అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 24-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 54 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



"ఒకవైపు ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇస్తారు... ఇంకోవైపు ఢిల్లీలో రైతాంగ ఉద్యమాన్ని అణచివేస్తారు. రైతులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. ఇంకోవైపు స్వామినాథన్ సిఫారసులను అమలు చేయడం లేదు. ఇది మోడీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. అంబేద్కర్‌కు దండ వేస్తారు. సంత్ రవిదాస్‌కు దండం పెడతారు. కుల వ్యవస్థను కాపాడే సనాతన ధర్మాన్ని సమర్థిస్తారు. ఈ ద్వంద్వ నీతిని ప్రజలు అర్థం చేసుకోకుండా కార్పొరేట్ మీడియా, ఆర్ఎస్ఎస్ అనుయాయుల ద్వారా విస్తృత ప్రచారం చేస్తారు.'

- బివి రాఘవులు,
సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

స్వామినాథన్‌కు భారతరత్న ఇస్తారు...
రైతాంగాన్ని అణచివేస్తారు

ఇది మోడీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనం

- బీజేపీ పీడ వదిలించుకుంటేనే దేశానికి మేలు
- తెలంగాణలో ఒక ఎంపి స్థానంలో పోటీ చేస్తాం
మిగతా చోట్ల ఇండియా కూటమిలోని పార్టీకి మద్దతు
- బీజేపీతో ఉంటారా? లేదా? బీఆర్ఎస్ స్పష్టతనివ్వాలి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

ముగిసిన రాష్ట్ర విస్తృత సమావేశం
పలు తీర్మానాలకు ఆమోదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, దేశ సార్వభౌమత్వం, రాష్ట్రాల హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తున్నదని బివి రాఘవులు మర్శించారు.రెండురోజులపాటు జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ముగిసింది. పలు తీర్మానాలను ప్రతినిధులు ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కొంత మెరుగైన ఫలితాలను సాధించిందనీ, దానిద్వారా పార్లమెంటు ఎన్నికల్లో పాగా వేయాలని చూస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో ఆ పార్టీ బలపడకుండా, దాని ఆశలు నెరవేరకుండా చేయడమే ముఖ్య కర్తవ్యమన్నారు. తమ బలాన్ని బట్టి ఒక్క స్థానంలోనే పోటీ చేసి మిగతా స్థానాల్లో బీజేపీని ఓడించే ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీకి ...13లో



ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలి

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే రెండింటిని అమలు చేసిందనీ, మరో రెండు ఈనెలాఖరులో అమలు చేయాలని నిర్ణయించిందని చెప్పారు. మిగతా గ్యారంటీల అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని ...13లో

27 ఫిబ్రవరి

27 నుంచి అమలు

రూ.500లకే గ్యాస్, 200యూనిట్ల ఉచిత విద్యుత్



జాతరలో సీఎం రేవంత్ తులాభారం...

- ప్రారంభానికి ప్రియాంకా గాంధీ హాజరు
- మార్చి 2న మరో ఆరువేల ఉద్యోగాల భర్తీ
- మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్ వెల్లడి
- సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న సీఎం, మంత్రుల ప్రత్యేక పూజలు
- మేడారంపై కేంద్రానికి వివక్ష అంటూ ఆరోపణ

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మరో రెండు పథకాల అమలుకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. రూ.500కే గ్యాస్ సిలిండర్, తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి పేదవానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చే పథకాలను ఈ నెల 27వ తేదీన ప్రారంభించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ పథకాల ప్రారంభానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హాజరుకానున్నట్టు తెలిపారు. రూ.2లక్షల రుణమాఫీపై బ్యాంకులతో చర్చిస్తున్నామని, త్వరలోనే రైతులకు శుభవార్త చెబుతామన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక చిక్కుముడులను విప్పుకుంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు.

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

శుక్రవారం మేడారంను సందర్శించిన సీఎం.. జాతరలో సమ్మక్క-సారలమ్మలకు నిలువెత్తు బంగారం (బెల్లం), పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచామన్నారు. 2లక్షల ఖాళీలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చినట్టుగానే అధికారంలోకొచ్చిన 60రోజుల్లోనే 25వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. 6,956 మంది స్టాఫ్ నర్సుల నియామకం, 441 సింగరేణి ఉద్యోగాలు, 15వేల పోలీస్, ఫైర్ డిపార్టుమెంట్ ఉద్యోగాలు భర్తీ చేసినట్టు చెప్పారు. మార్చి 2న మరో 6వేలపైచిలుకు ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నామన్నారు. గ్రామీణ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు.. పది స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు.

సమ్మక్క-సారలమ్మల స్ఫూర్తితో..

సమ్మక్క-సారలమ్మ ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రేవంత్ అన్నారు. రాష్ట్రంలో వర్షాలు బాగా పడి పాడిపంటలతో ప్రజలు విలసిల్లాలని, తెలంగాణలోని నాలుగు కోట్ల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని సమ్మక్క సారలమ్మను వేడుకున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతంతో, ఈ ప్రాంత ఎమ్మెల్యే, మంత్రి సీతక్కతో తనకున్న ప్రత్యేక అనుబంధం.. రాజకీయంగా తామిద్దరం కలిసి చేసిన ప్రయాణం అందరికీ తెలుసన్నారు. తాము ఏ ముఖ్య కార్యక్రమం తీసుకున్నా సమ్మక్క-సారలమ్మ ఆశీస్సులతో ఇక్కడి నుంచే మొదలుపెట్టినట్టు చెప్పారు. 2023 ఫిబ్రవరి ఆరో తేదీన 'హాత్ సే హాత్ జోడో'ను ఇక్కడ నుంచే ప్రారంభించామని గుర్తు చేశారు. ఎన్నికలు పూర్తికాగానే జాతరపై దృష్టి పెట్టి.. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పనులు చేయించినట్టు తెలిపారు. జాతర సమయంలోనే కాకుండా ఈ ప్రాంత అభివృద్ధిని మంత్రులు ...13లో

ప్రభుత్వ ఆస్తుల జాబితాను సమర్పించండి

- ప్రారంభోత్సవాలన్ని వారంలోగా పూర్తి చేయండి
- మెట్రో కొత్త మార్గాలకు త్వరలో శంకుస్థాపన
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జీహెచ్ఎంసీపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి 5లో..

ఉద్ధవ్ థాకరేకు రాహుల్ ఫోన్

- సీట్ల సర్దుబాటుపై చర్చ



(ఫైల్)

వివరాలు 3లో

మోడీ నియంత

- 'పుల్వామా'పై ప్రశ్నించినందుకే దాడులు : సీబీఐ సోదాలపై సత్యపాల్ మాలిక్



వివరాలు 13లో

కాంగ్రెస్‌తో వెళ్తే కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేస్తుంది

- మోడీ సర్కారుపై ఆప్ ఆరోపణలు



వివరాలు 13లో

రైతులకు నో.. కార్పొరేట్లకు ఎస్

- అన్నదాతల ఎమ్మెస్పీకి నిధులు లేవు
- బడావ్యాపారులకు మాత్రం భారీ పన్ను తాయిలాలు
- మోడీ సర్కారు తీరుపై రైతుల ఆగ్రహం

వివరాలు 3లో

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కన్నుమూత

ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టిన కారు

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- ఘటనపై ఎమ్మెల్యే సోదరి ఫిర్యాదు
- డ్రైవర్‌పై కేసు నమోదు
- ఫోరెన్సిక్, క్లూస్ టీంతో ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ
- అతివేగం, నిద్రమత్తే కారణమని అనుమానం
- శామీర్‌పేట్ ఓఆర్ఆర్ నుంచి పటాన్‌చెరు వైపు వస్తుండగా ఘటన
- సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల నివాళులు
- పాడె మోసిన మాజీ మంత్రి హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి



(ఫైల్)

నవతెలంగాణ-పటాన్‌చెరు/కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. శుక్రవారం తెల్లవారుజామున ఆమె ప్రయాణిస్తున్న కారు ఔటర్ రింగ్ రోడ్డుపై పటాన్‌చెరు సమీపంలో అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే లాస్య నందిత అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. కారు డ్రైవర్ ఆకాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సీటు బెల్ట్‌ను సరిగ్గా పెట్టుకోకపోవడంతోనే ఆమె ప్రాణం కోల్పోయి ఉంటారని భావిస్తున్నారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం, అతి వేగమే ప్రమాదానికి కారణంగా అనుమానం వ్యక్తమవుతున్నాయి. కాగా, ఎమ్మెల్యే భౌతికకాయానికి సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు నివాళులర్పించారు. అంత్యక్రియలు ...13లో

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవికి
మల్లు రవి రాజీనామా

నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేస్తానని స్పష్టీకరణ



నవ తెలంగాణ- జడ్చర్ల టౌన్

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవికి రాజీనామా చేసినట్టు పీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి వెల్లడించారు. శుక్రవారం జడ్చర్ల పట్టణంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసేందుకే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వచ్చాననీ, పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడంలో తన వంతు పాత్ర పోషించానని తెలిపారు. అయితే, మల్లు రవికి ఢిల్లీలో అధికార ప్రతినిధి పదవి ఉంది కదా.. ఎంపీ టికెట్ ఎందుకు.. తమకు ...13లో

కులగణనతోనే
అంతరాలు పోతాయి

ఆ తర్వాతే బీసీ సబ్‌ప్లాన్ అమలు : ఉప ముఖ్యమంత్రి భట్టి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ సబ్‌ప్లాన్ కావాలంటే కులగణన జరగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన కులగణన సమావేశంలో ఆయన బీసీ మేధావులు, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ సంపద కొద్ది మంది చేతుల్లో ఉందన్నారు. ఎక్కువమంది ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చుకోలేకపోతున్నారని చెప్పారు. ఈ అంతరాలు తొలగిపోవాలంటే కులగణన జరగాల్సిందేనని అన్నారు. ఇందుకు సంబంధించి వివిధ రాష్ట్రాలతోపాటు బీహార్‌లో ఎలాంటి న్యాయపర చిక్కుల్లేకుండా, విజయవంతంగా సర్వే జరిగి చట్టరూపం దాల్చిన తీరును అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. కులగణనకు సంబంధించి రాష్ట్ర క్యాబినెట్ కట్టుబడి ఉందన్నారు. ఇది కేవలం రాజకీయ నియామకాల కోసమే కాకుండా జనాభాకు అనుగుణంగా దేశ సంపదను పంచాలని చెప్పారు. సంపద ఎక్కడ ఉంది, భూమిలేని నిరుపేదలు ఎందరు, విద్యలో వెనుకబాటు, ఇల్లు లేని వారు, ద్విచక్ర వాహనాలు లేని వారు ఇలా అన్ని అంశాలను కులగణన సర్వే ద్వారా వెలుగులోకి వస్తాయన్నారు. బీహార్‌లో చేసిన సర్వేలో ఈ అంశాలన్నీ గుర్తించారా? అని అధికారులను అడిగి ఆరా తీశారు. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ప్రయోజనం చేకూర్చాలంటే ...5లో

అల్పాహారం ఆగింది

గతేడాది అక్టోబర్ 6న పథకం ప్రారంభం

- రాష్ట్రంలో 27147 స్కూల్స్‌లో 23 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- నిధుల్లేక ఇవ్వలేమంటున్న అధికారులు
- కొనసాగించాలంటున్న విద్యార్థులు
- మానవీయ కోణంలో అమలు చేయాలి : ఎస్ఎఫ్ఐ



(ఫైల్)

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

"విద్యార్థుల హాజరు పెంచడం.. పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా పిల్లల్లో శారీరక ఎదుగుదల ఉండేలా చూడటం. తల్లిదండ్రులపై భారం తగ్గించడం" వంటి ప్రధాన ఉద్దేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించడం పేద పిల్లలకు వరం లాంటిదే. గత ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించింది.ఎన్నికలకు ముందు పూర్తిస్థాయి బడ్జెట్‌ను గత ప్రభుత్వం ప్రకటించలేదు.. సరైన మార్గదర్శకాలూ లేవు. దాంతో ఎన్నికల అనంతరం ప్రభుత్వ స్కూల్స్‌లో అల్పాహార పథకం అమలు కావడంలేదు. పదోతరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మానవీయ కోణంతో ఆలోచించి విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేలా పథకాన్ని అమలుచేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం పూట అల్పాహారం కూడా అందించాలని గతేడాది అక్టోబర్ 6న గత ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 27147 పాఠశాలల్లోని 23 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 3161 ప్రభుత్వ పాఠశాలలు, సంగారెడ్డి జిల్లాలో 1262, మెదక్ జిల్లాలో 923, సిద్దిపేట జిల్లాలో 976 స్కూల్స్ ఉండగా 3 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అల్పాహార పథకం ద్వారా విద్యార్థులకు ఉదయం పూట టిఫిన్ అందిస్తారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు ఈ పథకాన్ని ప్రారంభించింది. వారంలో ఆరు రోజులు.. వివిధ రకాల అల్పాహారం ...3లో

గ్రూప్-1 మెయిన్స్‌లో తెలుగు అర్హత పరీక్ష నిర్వహించాలి

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌కు అభ్యర్థుల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 మెయిన్స్‌లో తెలుగు అర్హత పరీక్షను నిర్వహించాలని పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ మహేందర్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో అభ్యర్థులు శివానందస్వామి, శ్రీనివాస్, అనిల్‌రెడ్డి, ఎస్ కిశోర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రూప్-1 రాసేందుకు 13 ఏండ్లుగా ఎదురుచూస్తున్నామని తెలిపారు. అయితే గ్రూప్-1 మెయిన్స్‌లో ఇంగ్లీష్‌కు మాత్రమే అర్హత పరీక్షను నిర్వహించి మాతృభాష తెలుగు లేదని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన తెలుగు మాధ్యమం అభ్యర్థులు ఎక్కువగా ఉంటారని తెలిపారు. యూపీఎస్సీ మెయిన్స్‌లో 300 మార్కులకు తెలుగు అర్హత పరీక్ష ఉందని గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాల్లోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే ఉద్యోగాల్లో మెయిన్స్ విభాగంలో వారి మాతృభాషను అర్హత పరీక్షగా ఉందని పేర్కొన్నారు. ఏపీలోనూ గ్రూప్-1 మెయిన్స్‌లో 150 మార్కులకు తెలుగు అర్హత పరీక్ష ఉందని తెలిపారు.

ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని ఇంగ్లీష్‌తో పాటు తెలుగు అర్హత పరీక్షను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. తద్వారా అభ్యర్థులు సాధారణ పరిపాలన వ్యవహారాల్లో రాష్ట్ర ప్రజలతో మమేకమవుతారని వివరించారు. అనంతరం ఇదే విషయంపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీని వారు కలిసి వినతి పత్రం సమర్పించారు.

ఐఈఆర్పీ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో వికలాంగ విద్యార్థులకు 20 ఏండ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో విద్యాబోధన అందిస్తున్న ఐఈఆర్పీ ఉపాధ్యాయులను జీవో నెంబర్ 97 ప్రకారం ఉన్న ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు 1523లో విలీనం చేస్తూ క్రమబద్ధీకరించాలని ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు సిలువేరి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కె కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీలో కలపడం వల్ల ప్రస్తుతం కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 996 మంది ఐఈఆర్పీ ఉపాధ్యాయులు ఉద్యోగాలను కోల్పోయే అవకాశముందని తెలిపారు. మానవతా దృక్పథంతో న్యాయం చేయాలని కోరారు.

లాస్యనందిత మరణం పట్ల సీపీఐ దిగ్భ్రాంతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం పట్ల సీపీఐ రాష్ట్ర సమితి దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువ ఎమ్మెల్యే అర్ధాంతరంగా మరణించడం విషాదకరమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె తండ్రి సాయన్న మరణించిన ఏడాదికే ఆమె మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చడం బాధాకరమని పేర్కొన్నారు. ఆమె మరణం పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జన్నత్ హుస్సేన్ మరణం పట్ల నారాయణ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన జన్నత్ హుస్సేన్ మరణం పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ సంతాపం తెలిపారు. ఆయన వివిధ జిల్లాల్లో అధికారిగా పలు బాధ్యతలను నిర్వహించారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీ మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వద్ద సీఎస్‌గా పనిచేశారని తెలిపారు. వామపక్ష పార్టీలపై గౌరవభావంతో ఉండేవారని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అరికట్ల రామకృష్ణారెడ్డి ఆశయాలు కొనసాగిస్తాం

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'అరికట్ల' సంతాప సభ



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రజాపక్షపాతి, విప్లవ శ్రేయోభిలాషి అరికట్ల రామకృష్ణారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ నాయకులు అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం అరికట్ల రామకృష్ణారెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవ్య ప్రింటర్స్ ప్రెస్ నిర్వాహకులు కామ్రేడ్ అరికట్ల రామకృష్ణారెడ్డి మన మధ్య లేకపోవడం తీవ్రంగా కలిసి వేస్తున్నదని అన్నారు. చిన్నతనం నుంచే ప్రజా విప్లవ నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని.. విద్యార్థి సంఘాల్లో సైతం చురుకైన పాత్ర పోషిస్తూ.. విప్లవ రాజకీయాల వైపు దృఢంగా నిలబడ్డారని తెలిపారు.

ఈ కాలమంతటా లెక్కకు మిక్కిలి సన్నిహితులను, అభిమానులను, సహచరులను, ఉద్యమకారులను సృష్టించుకున్నారని చెప్పారు. ఆయన మరణం ప్రగతిశీల, ప్రజాస్వామిక, సామాజిక, విప్లవోద్యమాలకు తీరని లోటుగా తెలిపారు. కవిగా, రచయితగా, కార్టూనిస్టుగా కూడా విప్లవ, ప్రజా సాహిత్యోద్యమంలో తన వంతు పాత్రను పోషించారన్నారు. ప్రజా ఉద్యమాల పక్షపాతిగా, ప్రెస్ నిర్వాహకుడిగా, ఉత్తమ పబ్లిషర్‌గా రామకృష్ణారెడ్డి సాగించిన కృషి, సేవలు ప్రశంసించదగినవన్నారు. ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అనురాధ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య, రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, విరసం నాయకులు విమల, సామాజిక విశ్లేషకులు కాకర్ల సంజయ, ఓయూ ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్ సమున్నత, రామకృష్ణారెడ్డి సోదరి జానకి, ఆయన జీవిత సహచరి ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ సంధ్య, ప్రజా రచయిత జీవన్ హాజరై రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయ సంకల్ప యాత్రతో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు :లక్ష్మణ్

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మృతిపై దిగ్భ్రాంతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


తెలంగాణలో విజయ సంకల్ప యాత్రతో పెనుమార్పులు రాబోతున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కంటోన్మెంట్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్న వయస్సులోనే రాజకీయాల్లో రాణిస్తూ ఎదిగే క్రమంలో ఆమె అకాల మరణం కలిచివేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందనీ, ఇప్పటికే ఆరు క్లస్టర్ల పరిధిలోని 45 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పూర్తయిందని చెప్పారు. మోడీ ప్రభుత్వం ఆధ్వర్యంలో తీసుకొచ్చిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి చిట్టాను, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా తాత్సారం చేస్తున్న హామీల గురించి ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు.

బీఆర్‌ఎస్, బీజేపీ పొత్తు పెట్టుకుంటున్నా యని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ఆరుగ్యారెంటీల అమలు సాధ్యమవుతుందని చెప్పటం దివాళాకోరు తనమే అవుతుందని విమర్శించారు. తలాతోక లేని కుటుంబ, ప్రాంతీయ పార్టీలు, అవినీతిలో కూరుకు పోయిన పార్టీలు బెయిల్‌పై బయటకొచ్చి తిరుగుతున్న నేతల పార్టీలు ఒక్కటై కూటమి గడితే ఎలా విజయవంతం అవుతుందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణి, ఇసుక దోపిడి చేసిన బీఆర్‌ఎస్ నాయకుల అవినీతిని కక్కిస్తా మని చెప్పి ఇప్పుడు లోపాయికారి ఒప్పందాలు చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. చేవెళ్ల పార్లమెంట్‌లోని సీతారామపూర్‌లోని 1,110 ఎకరాలను దేవాదాయ భూమిని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యాపారవేత్తలకు అప్పనంగా అప్పజెప్పిందని ఆరోపించారు. ఆ ఆక్రమణలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఊసెత్తడం లేదని ప్రశ్నించారు. దేవాదాయ భూముల రక్షణ కోసం పోరాటాలు చేస్తామని ప్రకటించారు.

దేశ రక్షణ కోసమే అన్నదాతల ఉద్యమం

ఎస్‌కేఎమ్ పోరాటానికి పెరుగుతున్న విశాల మద్దతు

- మీడియా తక్కువచేసి చూపినా అంతర్జాతీయంగా సంఘీభావం
  కనీస మద్దతు ధరల చట్టం చేయాల్సిందే
- రైతుల ప్రధాన డిమాండ్లను నెరవేరాల్సిందే.. లేకుంటే మోడీ గద్దె దిగాల్సిందే
- న్యాయం దక్కేదాకా దశలవారీగా కార్యాచరణ అమలు : అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



'దేశ రక్షణ కోసం, వ్యవసాయ రంగాన్ని బతికించుకోవటం కోసమే ఢిల్లీ సరిహద్దుల్లో అన్నదాతలు ఉద్యమాన్ని ఉధృతంగా చేస్తున్నారు. సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎమ్) ఆధ్వర్యంలో రైతులు చేస్తున్న పోరాటంలో నిజాయితీ ఉంది కాబట్టే రోజురోజుకీ ప్రజా మద్దతు పెరుగుతున్నది. మీడియా పెద్దగా హైలెట్ చేసి చూపకపోయినా అంతర్జాతీయంగా సంఘీభావం దక్కుతున్నది. ఇప్పటికైనా మోడీ సర్కారు దిగొచ్చి కనీస మద్దతు ధరల చట్టం చేయాల్సిందే. ఇతర డిమాండ్లనూ పరిష్కరించాల్సిందే. లేదంటే మోడీ సర్కార్ గద్దె దిగాల్సిందే. రైతులకు న్యాయం చేయకపోతే ప్రజాకోర్టులోకి వెళ్లి రైతుల సత్తా ఏంటో మోడీ సర్కార్‌కు చూపుతాం' అని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో నవతెలంగాణ ప్రతినిధి అచ్చిన ప్రశాంత్‌కి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఢిల్లీ రైతాంగ పోరాటంపై పలు విషయాలను వివరించారు.

ఢిల్లీలో రైతాంగ ఉద్యమం మళ్లీ ఎందుకు మొదలైంది?

రైతుల ఉద్యమం తిరిగి ప్రారంభం కావడానికి మోడీ ప్రభుత్వ వైఖరే కారణం. 23 ఏండ్ల శుభ్‌కరణ్‌సింగ్ అనే రైతు చనిపోవడానికి ప్రధాన బాధ్యత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదే. మూడేండ్ల కిందట రైతు ఉద్యమాన్ని చల్లబర్చటానికి గురునానక్ జయంతి రోజు దేశ ప్రజానీకానికి మోడీ క్షమాపణ చెప్పారు. మూడు నల్లచట్టాలను, విద్యుత్ సవరణబిల్లును ఉపసంహరించుకుంటామనీ, కనీస మద్దతు ధరల చట్టం తీసుకొస్తామనీ బహిరంగంగా ప్రకటించి మాటతప్పారు. అందుకే రైతుల ఉద్యమం మళ్లీ మొదలైంది. గ్రీక్ ప్రధాని మాట్లాడుతూ..తమ దేశంలో, ఇండియాలో జరుగుతున్న రైతాంగ పోరాటాలకు సారూపత్య ఉందని ఒప్పుకున్నారు. మోడీకి మాత్రం రైతుల పోరాటాన్ని అంగీకరించేందుకు మనస్సు రావడం లేదు.

రోజురోజుకీ అన్నదాతల ఉద్యమానికి పెరుగుతున్న ఆదరణను ఎలా అర్థం చేసుకోవాలి?

దీన్ని కేవలం రైతుల కోసం జరుగుతున్న పోరాటంగా చూడొద్దు. ఇది రైతాంగం మనుగడ, వ్యవసాయం రక్షణ కోసం జరుగుతున్న పోరాటం. తాము బతకాలి, వ్యవసాయాన్ని బతికించుకోవాలనే లక్ష్యంతో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు కలిసికట్టుగా రోడ్లమీదకొస్తున్నారు. అందుకే ప్రజల నుంచి విశాల మద్దతు లభిస్తున్నది. జాతీయ మీడియా ఎంత తొక్కిపెట్టి చూపాలని ప్రయత్నిస్తున్నా అంతర్జాతీయంగానూ చర్చనీయాంశమవుతున్నది. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత దేశంలో ఇంత విశాల మద్దతు ఏ పోరాటానికీ దక్కలేదు. ఎందుకంటే ఈ పోరాటంలో విశ్వసనీయత ఉంది. దేశాన్ని కాపాడుకోవాలనే ధృఢసంకల్పం దాగి ఉన్నది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా రైతు మృతిపై బాధను వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వం స్పందించాలని గళమెత్తారు. రైతులతో చర్చించి డిమాండ్లను పరిష్కరించాలని మోడీ సర్కార్‌కు సూచించారు. మన జీడీపీలో 18.8 శాతం వాటా వ్యవసాయ రంగానిదే. 80 కోట్లమంది వ్యవసాయ మీద ఆధారపడుతున్నారు. దీనినిబట్టే రైతు ఉద్యమానికి గ్రావిటీ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎస్‌కేఎంలో విభేదాలున్నాయి, ఉద్యమం హర్యానా, పంజాబ్, యూపీలకే పరిమితమైందనే ప్రచారంపై మీరేమంటారు?

ఇది పూర్తిగా అసత్య ప్రచారం. ఎస్‌కేఎమ్‌లో వందలాది రాజకీయ, రాజకీయేతర సంఘాలు భాగస్వామ్యం అయ్యాయి. ఉద్యమ నిర్మాణం, ఇతరత్రా అంశాల్లో సంఘాల మధ్య భిన్నాభిప్రాయాలుండటం సాధారణమే. వాటిపై కూర్చొని చర్చించుకుంటున్నాం. అంతిమంగా కలిసికట్టుగానే ముందుకెళ్తున్నాం. ఉద్యమ బలోపేతం కోసం ఆరుగురు ముఖ్యనేతలతో ఓ కమిటీ వేశాం. ఉద్యమంలోకి బీజేపీ చొరబడి చర్చల పేరుతో విచ్ఛిన్నం చేయాలని కుట్రలు పన్నుతున్నది. చైతన్యంతో కూడుకున్న రైతాంగ ఉద్యమం బీజేపీ ఎత్తులను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నది. ఈ ఉద్యమంలో ప్రారంభం నుంచీ హర్యానా, పంజాబ్ రాష్ట్రాలతో పాటు యూపీలోని పశ్చిమ ప్రాంతానికి చెందిన రైతులు ముందువరుసలో ఉండటానికి చారిత్రక కారణాలున్నాయి. హరితవిప్లవం అమలు చేసింది అక్కడే. గోధుమ పంట ఎక్కువ పండేదీ అక్కడే. ఢిల్లీ సరిహద్దుల్లో ఆయా రాష్ట్రాలు ఉండటం కూడా సానుకూల అంశం. దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్నాటకలో కూడా ఉద్యమం జరుగుతున్నది.

ఎస్‌కేఎమ్ తక్షణ డిమాండ్లు ఏంటి?

రైతులకు కనీస మద్దతు ధరను గ్యారంటీ చేస్తూ చట్టం తేవాలి. విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలి. వ్యవసాయ కూలీలకు, పేదలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని, పేదలకు ఆహారాన్ని అందించే ప్రజాపంపిణీ వ్యవస్థలను బలోపేతం చేయాలి. పోలీసులను ఉసిగొల్పి యువరైతు శుభ్‌కరణ్‌సింగ్ చావుకు కారణమైన హర్యానా సీఎం ఖట్టర్ మీద కేసు నమోదు చేయాలి. ఆ రాష్ట్ర హోంమంత్రిని వెంటనే తొలగించాలి. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. చనిపోయిన రైతుకు 16 లక్షల అప్పు ఉంది. దాన్ని తీర్చాలి. కోటి రూపాయల పరిహారం కుటుంబానికి ఇవ్వాలి. ఇది హర్యానా ప్రభుత్వ హత్య అని కేసు ఫైల్ చేయాలి. రాజకీయం, ఓట్ల కోసం భారత రత్నలు ఇవ్వటం కాదు..ముందు స్వామినాథన్ సూచించిన సీటూప్లస్ మద్దతు ధరను రైతులకు అందజేసి కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

రైతులకు మేలు జరిగే కనీస మద్దతు ధర చట్టానికి మోడీ సర్కారు ఎందుకు అంగీకరించట్లేదు?

బీజేపీ రైతువారీ వ్యవసాయానికి వ్యతిరేకం. మన ఉత్పత్తి విధానం రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికుల కేంద్రంగా ఉంది. దేశ అవసరాలు, పోషణ, ఉపాధి కోసం మన దేశంలో సాంప్రదాయక వ్యవసాయం అమలవుతున్నది. దేశంలో పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చెందుతూ వస్తున్నది. నిజంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలనుకుంటే అది రైతులకు, వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు మేలు చేసేదిలా ఉండాలి. తద్వారా దేశానికి మేలు జరుగతుంది. కానీ, మోడీ సర్కారు దీని గురించి ఆలోచించడం లేదు. పూర్తిగా కంపెనీ వ్యవసాయంగా మార్చే కుట్రకు దిగింది. ప్రపంచంలో భౌగోళిక పరిస్థితుల రీత్యా అన్ని పంటలు పండేందుకు మన భూములు అనుకూలం. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ పండించి ఎగుమతులు చేసి లాభాలు గడించాలనే ఆలోచనలో భాగంగానే కార్పొరేట్ల కన్ను మన వ్యవసాయ రంగంపై పడింది. కానీ, ఇది మన రైతులు సాగులో ఉన్నంత కాలం వారికి సాధ్యం కాదు. అంబానీ, అదానీలకు వ్యవసాయాన్ని అప్పగించాలంటే కుదరదు. అందుకే మూడు వ్యవసాయ చట్టాలను తెచ్చి రైతులను అప్పులపాలు చేసి వారిని వ్యవసాయం నుంచి పక్కకు స్వయంగా తప్పుకునేలా చేసే కుట్ర జరుగుతున్నది.

అందుకే మోడీ సర్కారు రైతుల న్యాయసమ్మతమైన డిమాండ్లను తొక్కిపెడుతున్నది. కనీస మద్దతు ధరల చట్టం లేకపోవడం వల్ల ఇటు రైతులకు, అటు వినియోగదారులకు అన్యాయం జరుగుతున్నది. అంతిమంగా ట్రేడర్లు లాభపడుతున్నారు. వారంతా బీజేపీకి అనుకూలంగా ఉన్నారు. మద్దతు ధర ఇస్తే ట్రేడర్లకు లాభాలు తగ్గుతాయి. ఎఫ్‌సీఐ, ప్రజాపంపిణీ వ్యవస్థలను బలోపేతం చేయాలి. అది చేస్తే వినియోగదారులు బయట కొనటం తగ్గుతుంది. అందుకే వ్యవసాయ రంగానికి దోహదపడే వ్యవస్థలన్నింటినీ ఒక్కొక్కటిగా మోడీ సర్కారు నిర్వీర్యం చేస్తూ పోతున్నది.

మోడీ సర్కారు రైతు ఉద్యమం పట్టనట్టుగానే ఉంటున్న తరుణంలో మీ భవిష్యత్ కార్యాచరణ ఏంటి?

శుక్రవారం దేశంలో బ్లాక్ డే నిర్వహించాం. 26న దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ట్రాక్టర్ల ర్యాలీలతో నిరసనలు తెలుపుతాం. మహాపంచాయతీలను నిర్వహిస్తున్నాం. మార్చి 14న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జాతీయస్థాయి మహాపంచాయితీని తలపెట్టాం. ప్రధాన డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకే ఈ పోరాటం చేస్తున్నాం. అప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించకుంటే ప్రజాకోర్టులోకెళ్తాం. డిమాండ్లను నెరవేర్చని పక్షంలో 2024లో మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపుతాం. వచ్చే ప్రభుత్వం ద్వారా రైతుల డిమాండ్లను సాధించుకుంటాం.

రైతులపై కాల్పులకు నిరసనగా దిష్టిబొమ్మలు దహనం

నవతెలంగాణ- విలేకరులు

హర్యానా, పంజాబ్ సరిహద్దుల్లో రైతులపై హర్యానా పోలీసులు జరిపిన కాల్పులు, దాడులపై రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం రైతు, ప్రజాసంఘాలు, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బ్లాక్ డేగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు. హైదరాబాద్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ సీఐటీయూ ఆటో స్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, హర్యానా సీఎం దాడులకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. షాపూర్ నగర్ సీఐటీయూ కార్యాలయం దగ్గర నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కూకట్‌పల్లిలో సీఐటీయూ, గిరిజన సంఘాలు బ్లాక్ డే నిర్వహించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో రైతు కార్మిక సంఘాల నేతలు బ్లాక్‌డే నిర్వహించారు. దేవరకొండలో నల్లబ్యానర్‌తో నిరసన తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కేంద్ర బీజేపీ, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు యువ రైతు శుభకరన్ సింగ్‌ను పంజాబ్ బార్డర్‌లో క్రూరంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ ఆదిలాబాద్‌లోని సీపీఐ(ఎ కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.



ఉద్ధవ్ థాకరేకు రాహుల్ ఫోన్

సీట్ల సర్దుబాటుపై చర్చ

ముంబయి : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఇండియా ఫోరంలోని ప్రతిపక్ష పార్టీల మధ్య సీట్ల పంపకంపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఆప్, సమాజ్‌వాదీ పార్టీలతో కాంగ్రెస్ సీట్ల ఒప్పందాలను కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. తాజాగా మహారాష్ట్రలోని 48 సీట్లలో ఎనిమిది స్థానాలపై నెలకొన్న అనిశ్చితిపై చర్చించేందుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరేకు గురువారం ఫోన్ చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాహుల్ చేపడుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రస్తుతం మహారాష్ట్రలో కొనసాగుతోంది. దీంతో ఉద్ధవ్‌తో సుమారు గంటసేపు మాట్లాడినట్టు సమాచారం. ముంబయిలోని ఆరు లోక్ సభ స్థానాల్లో ముంబయి సౌత్ సెంట్రల్, ముంబయి నార్త్ వెస్ట్‌లలో మూడింటిలో కాంగ్రెస్ పోటీ చేయాలని భావిస్తున్నట్టు ఆవర్గాలు తెలిపాయి. ముంబయిలోని నాలుగు స్థానాలు సహా రాష్ట్రంలోని 18 లోక్‌సభ స్థానాల్లో ఉద్ధవ్ థాకరే పోటీ చేయాలను కుంటున్నట్టు తెలుస్తోంది. ఉద్ధవ్ థాకరే ముంబయి సీట్లలో అధిక స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్టు ఆ వర్గాలు తెలిపాయి. సీట్ల సర్దుబాటుపై రాహుల్, శరద్ పవార్ ఇప్పటికే ఫోన్‌లో చర్చలు జరిపారు. ఎంవీఏ కూటమి లోక్‌సభ సీట్ల సర్దుబాటు చివరి దశకు చేరుకుందని కాంగ్రెస్ వెల్లడించింది.

మేడారం జాతరను ట్రైబల్ ఫెస్టివల్‌గా నిర్వహించాలి

- కేంద్ర ప్రభుత్వం దృష్టికి నిర్ణయాన్ని తీసుకెళ్తా : గవర్నర్ తమిళి సై సౌందరరాజన్
- కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

మేడారం జాతరను ట్రైబల్ ఫెస్టివల్‌గా నిర్వహించేందుకు కేంద్రం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ అన్నారు. శుక్రవారం గవర్నర్ మేడారం జాతరను సందర్శించి సమ్మక్క-సారలమ్మ వనదేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. తాను మూడోసారి జాతరను సందర్శించి మొక్కులు సమర్పించుకుంటున్నట్టు తెలిపారు. భారత ప్రజలు, గిరిజన ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు.

మేడారం జాతర సందర్భంగా గిరిజనులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌గా మూడోసారి జాతరను సందర్శించుకోవడం సంతోషంగా ఉందని, అదృష్టంగా భావిస్తున్నారన్నారు. మేడారం ప్రాంతంలోని ఆరు గిరిజన గ్రామాలను దత్తత తీసుకున్నానని అన్నారు. అనంతరం కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా మాట్లాడుతూ.. దేశంలో ఆదివాసీలు చత్తీస్‌గడ్‌లో ఎక్కువగా ఉంటారని తెలిపారు. సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా దేశ ఆదివాసీలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ట్రైబల్ ఫెస్టివల్ జాతరగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, అడిషనల్ కలెక్టర్ శ్రీజా తదితరులు పాల్గొన్నారు.



అల్పాహారం ఆగింది

(మొదటి పేజీ తరువాయి)

అందించాలని మెనూను ప్రకటించింది. పథకం అమలును పర్యవేక్షించేందుకు పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామాల్లో అదనపు కలెక్టర్లు బాధ్యత చూడాలని కూడా అప్పటి ప్రభుత్వం ఆదేశించింది.

సీఎం బ్రేక్‌ఫాస్ట్ మెను

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన ముఖ్యమంత్రి అల్పాహారం పథకంలో రోజువారీగా విద్యార్థులకు పెట్టాల్సిన మెను ఇలా ఉండేది. సోమవారం ఇడ్లీ-సాంబర్ లేదంటే గోదుమరవ్వ ఉప్మా-చట్నీ, మంగళవారం పూరీ ఆలుకుర్మా లేదా రవ్వతో టమాటాబాత్, సాంబారు, బుధవారం ఉప్మా, సాంబర్ లేదా బియ్యం రవ్వ కిచిడీ, చట్నీ, గురువారం చిరుధాన్యాల ఇడ్లీ సాంబారు లేదా పొంగల్, సాంబారు, శుక్రవారం ఉగ్గాని/అటుకులు/చిరుధాన్యాల ఇడ్లీ, చట్నీ లేదా గోదుమరవ్వ కిచిడీ, చట్నీ, శనివారం పొంగల్, సాంబారు లేదా వెజిటబుల్ పులావ్, రైతా, ఆలుకుర్మా పెట్టేది.

నిలిచిన అల్పాహారం

కారణాలు ఏమైనా ప్రస్తుతం అల్పాహార పథకం ఆగింది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న లక్షలాది మంది పేదల నోటికి ముద్ద అందించే అల్పాహార పథకాన్ని కొనసాగించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కొన్ని రోజుల పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి జిల్లాలో దాతలు, స్థానికంగా ఉన్న పరిశ్రమల సహకారంతో స్నాక్స్ పెట్టిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసిన అల్పాహారం మాత్రం ఇవ్వట్లేదు.

ఉదయం వచ్చి.. పరీక్షలకు కుస్తీ

పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని, ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏలో ఉత్తీర్ణులు కావాలనే ఉద్దేశంతో అదనపు క్లాసులు తీసుకుంటున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు స్కూల్‌లోనే ఉంటున్నారు. మధ్యాహ్న భోజనం తప్ప ఎలాంటి ఆహారం లేకపోవడంతో అర్ధాకలితోనే చదువుకుంటున్నారు. అల్పాహార పథకం అమలు చేస్తే విద్యార్థులందరితో పాటు అదనంగా రెండు గంటల పాటు స్కూల్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు మేలు చేకూరనుంది. ఉదయం అల్పాహారం లేదా సాయంత్రం స్నాక్స్ ఇస్తే మరింత శ్రద్ధగా చదువుకుంటామని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు.

నిధుల్లేక అల్పాహారం ఆగింది

అల్పాహార పథకం ద్వారా ఉదయం పూట స్కూల్ ప్రారంభానికి ముందే 8.45 గంటలకు విద్యార్థులకు అల్పాహారం అందించేది. పిల్లల హాజరు శాతం పెరగడం, తల్లిదండ్రులకు భారం తగ్గించడం కోసం పథకాన్ని పెట్టారు. నిధులు రాకపోవడంతో ప్రస్తుతం అల్పాహారం ఇవ్వడంలేదు.

- వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి.

అల్పాహారం అందివ్వాలి

ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందివ్వాలి. లక్షలాది మంది విద్యార్థులకు ఉపయోగపడుద్ది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులే ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. వారందరికీ లబ్ధిచేకూర్చే పథకానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట స్నాక్స్ ఇవ్వాలి.

- రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి.

పోడు భూములకు

పట్టాలివ్వాలి

అక్రమ కేసులు , పీడీ యాక్ట్ ను ఎత్తివేయాలి

- ప్రభుత్వంపై ఆ మేరకు ఒత్తిడి తేవాలి : తమ్మినేనికి సీపీఎం మంచిర్యాల జిల్లా బృందం వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పోడు భూములకు పట్టాలివ్వాలనీ, గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులు,పీడీ యాక్టును ఎత్తివేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మంచిర్యాల జిల్లా పోడు సాగుదారులు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీని కోరారు. ఆ పార్టీ జిల్లా బృందం ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకి శుక్రవారం హైదరాబాద్‌లో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలం మాకులపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కోయపోచంగూడెం ఆదివాసీ, గిరిజన, నాయకపోడ్ తెగలకు చెందిన నలభై కుటుంబల వాళ్ళు 2003 నుంచి లింగాపూర్ శివారులో పోడు కొట్టి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఆ భూమి నుంచి వారిని వెళ్లగొట్టేందుకు పలు సార్లు పోలీసులు కేసులు పెట్టారని తెలిపారు. పీడీ యాక్టుకూడా ప్రయోగించారన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని తమ్మినేనికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, అశోక్, చందు, జిల్లా నాయకులు దుంపల రంజిత్ కుమార్, కోయపోచం గూడెం ఆదివాసీ గిరిజన నాయకులు సాధం బాపు తదితరులు పాల్గొన్నారు.

నేటి కలెక్టర్ల కాన్ఫరెన్స్ రద్దు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి శనివారం నిర్వహించతలపెట్టిన వీడియో కాన్ఫరెన్స్ రద్దయింది. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. కాన్ఫరెన్స్ కు బదులుగా ఉదయం 11.30 గంటలకు ధరణి కమిటీతో ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. తహశీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు ధరణిలో తప్పులు సరిదిద్దే అధికారాలపై చర్చించనున్నారు. ఈ చర్చ సందర్భంగా ఆయన కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

రైతులకు నో.. కార్పొరేట్లకు ఎస్

అన్నదాతల ఎమ్మెస్పీకి నిధులు లేవు • బడావ్యాపారులకు మాత్రం భారీ పన్ను తాయిలాలు

మోడీ సర్కారు తీరుపై రైతుల ఆగ్రహం

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు రైతుల పట్ల చిన్న చూపు చూస్తున్నదా? వారి ప్రయోజనాలు పట్టటం లేదా? రైతుల ప్రధాన డిమాండ్ అయిన కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)ను కేంద్రం కావాలనే విస్మరిస్తున్నదా? కార్పొరేట్ల కోసం ఏమైనా చేస్తుందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా 'చలో ఢిల్లీ' నిరసన కార్యక్రమంలో రైతన్నలు ఆందోళనలు చేస్తున్నారు. కేంద్రం తీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎమ్మెస్పీతో పాటు.. 2020-21లో ఏడాదిపాటు జరిగిన ఆందోళనల సందర్భంగా తమపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవటం, రుణమాఫీ, పెన్షన్ వంటివి నిరసన తెలుపుతున్న రైతుల డిమాండ్‌లు. గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో మోడీ ఎమ్మెస్పీకి మద్దతు ఇచ్చారనీ, ఇప్పుడు మాత్రం మొహం చాటేస్తున్నారని అన్నదాతలు అంటున్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్‌కు కేంద్రంలోని మోడీ సర్కారు ఇటీవల భారతరత్న ప్రకటించింది. అయితే, రైతుల డిమాండ్‌లను నెరవేర్చటాన్ని విస్మరించడం బాధాకరమనీ, స్వామినాథన్ ఫార్ములా ప్రకారం కనీస మద్దతు ధరను కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో స్వామినాథన్ కమిటీ సిఫారసుల అమలును గట్టిగా సమర్థించిన మోడీ.. ప్రధానమంత్రి అయిన తర్వాత దానిని విస్మరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా, ఆహారధాన్యాల ఉత్పత్తి ఏడాదికి సంవత్సరం ప్రాతిపదికన పెరుగుతూ, బఫర్ స్టాక్ నిరంతరం ధాన్యాల సరఫరాను పొందుతున్నప్పటికీ, వ్యవసాయ రంగం ఇప్పుడు అస్తిత్వ సంక్షోభం నుంచి బయటపడటానికి చూస్తున్నదని అంటున్నారు.

ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీ ఏమైంది?

2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తామని 2019లో (లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో) మోడీ తీవ్ర ప్రచారం చేశారు. మోడీ రెండోసారి గెలుపొందడంలో ఇది కీలకమైన అంశం. ఇప్పుడు, మాత్రం మోడీ, బీజేపీలు దీనిపై మౌనం వహిస్తున్నాయని రైతన్నలు అంటున్నారు. హర్యానాలోని బీజేపీ పాలనలో రైతులపై అక్కడి ప్రభుత్వం అధికార బలాన్ని ప్రయోగిస్తూ వారిని నియంత్రిస్తున్నది. హర్యానా సరిహద్దు దాటి ఢిల్లీకి చేరుకోకుండా కఠినమైన చర్యలను ప్రయోగిస్తున్నది. రైతుల హక్కులను కాలరాసిన మోడీ సర్కారు.. మళ్లీ ఇప్పుడు రామ మందిర నిర్మాణం పూర్తి చేశామనీ , రామ రాజ్యం వచ్చిందంటూ రాజకీయాలు మొదలు పెట్టిందని రైతులు అంటున్నారు.

బీజేపీ అనుకూల మీడియా తప్పుడు కథనాలు

కార్పొరేట్ నియంత్రణలో ఉన్న మోడీ, బీజేపీ అనుకూల మీడియా ప్రభుత్వం కోసం అవిశ్రాంతంగా ప్రచారంలో నిమగ్నమై ఉన్నదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల పోరాటం విషయంలో తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వార్తలు రైతులను, వారి న్యాయమైన పోరాటాన్ని కించపరిచేలా ఉన్నాయని అంటున్నారు.



రైతుల పట్ల ఉదాసీనత.. కార్పొరేట్‌లకు అనుకూలం

మోడీ పాలనలో వ్యవసాయ రంగం తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నది. కేంద్రం చూపు మాత్రం కార్పొరేట్ సంస్థలపై ఉన్నది. వాటికి తాము చెల్లించాల్సిన పన్ను రేట్లను తగ్గించి తాయిలాలు ప్రకటిస్తున్నది. కార్పొరేట్ పన్ను రేటును 30 శాతం నుంచి 22 శాతానికి భారీగా తగ్గించింది. కొత్తగా ఏర్పాటైన కంపెనీలకు పన్ను రేటును 25 శాతం నుంచి 15శాతానికి తగ్గించింది. పన్ను రేట్ల చర్యల ఫలితంగా ఖజానాకు రూ. 1,45,000 కోట్ల నష్టం వాటిల్లింది. పన్ను తగ్గింపుల వల్ల కార్పొరేట్ సంస్థలు రూ. 6 లక్షల కోట్లు ఆర్జించాయని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. అయితే, కోట్లాది మంది భారతీయులకు ఆహార భద్రతను, జీవనోపాధిని కల్పిస్తున్న వ్యవసాయ రంగం చాలా కాలంగా నష్టపోతున్నది. అలాంటి రంగానికి చేయూతనందించాల్సిన మోడీ సర్కారు నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించటం రైతులకు శాపంగా మారిందని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే, దేశంలో వ్యవసాయ సంక్షోభం తప్పదని వారు హెచ్చరిస్తున్నారు.

సంపాదకీయం

కమ్యూనిస్టులవసరం...

"ఇప్పుడే ఇక్కడే ఈ సందర్భంలోనే కమ్యూనిస్టులవసరం" అంటాడో ప్రజాకవి. సరిగ్గా ఇదే విషయాన్ని ఆ పార్టీ ప్లీనరీలో అగ్రనేతలందరూ నొక్కి వక్కాణించారు. అయితే ఈ దేశచరిత్రలో కమ్యూనిస్టులు అత్యంత బలహీనంగా, వారి అవసరం అనివార్యంగా మారిన దశలో ఈ సమావేశాలు జరుగుతుండటం గమనార్హం. ఇప్పుడు కమ్యూనిస్టులు బలంగా ఉండడం ఆ పార్టీలకే కాదు, ప్రజలకూ అవసరం. ప్రజల కోసం పోరాడటానికో, వారి సమస్యలను ప్రభుత్వాలకు నివేదించడానికో మాత్రమే కాదు... నేడు దేశానికి విద్వేషాలను అనుమతించని ప్రగతిశీల వాతావరణం కావాలి. అది కమ్యూనిస్టులు ఇవ్వగలరు. అందుకోసం కమ్యూనిస్టులు కావాలి. కూలిపోతున్న ప్రజాస్వామ్య లౌకిక విలువలను కాపాడుకోవడానికి కమ్యూనిస్టులు కావాలి. ప్రమాదంలో ఉన్న రాజ్యాంగ నియమాలను రక్షించుకోవడానికి కమ్యూనిస్టులు కావాలి. జరుగుతున్న పరిణామాలలో వారి పాత్ర లేకుంటే ప్రజలు నిస్సహాయులుగా మారిపోతారు. అది నివారించడానికి కమ్యూనిస్టులు కావాలి.

> రాజ్యం మతం కలగలిసి ఇలా ప్రజల్ని గుడ్డివాళ్లను చేయడం భూస్వామ్య వ్యవస్థ లక్షణం. నూతన ఆవిష్కరణలకు, అన్వేషణలకు అది అవరోధంగా మారినందువల్లనే ప్రపంచమంతటా మత ప్రమేయం లేని ఆధునిక ప్రజాస్వామిక రాజ్యాల ఆవిర్భావం కోసం అనేక పోరాటాలు జరిగాయి. ఆ పోరాటాల ఫలితమే నేటి ఆధునిక లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థలు. ఈ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ ఆ రెండిటినీ కలిపి దేశాన్ని తిరిగి మధ్యయుగాల చీకటి కాలానికి తీసుకుపోతోంది.


దేశంలో జనాన్ని క్రియారహితంగా, జ్ఞాన శూన్యులుగా తయారు చేసే చర్యలు వేగం పుంజుకుంటున్నాయి. లౌకిక ప్రజాస్వామిక ఆచరణల గురించి కనీసం ఆలోచించడానికి కూడా వీల్లేని భయానక వాతావరణం అలుముకుంటోంది. అంతిమంగా దేశంలో మొత్తం మానవ చైతన్యమే అణచివేతకు గురవుతోంది. ఫలితంగా దేశ భవిష్యత్తు మునుపెన్నడూ లేనంతగా ప్రమాదంలో పడింది. ప్రజాస్వామ్యమంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అవగాహనకు భిన్నంగా నేడు భారత దేశంలో అది అమలవుతోంది. మతాన్ని రాజ్యంతో విడదీయలేనంతగా కలగలిపిన పరిపాలన సాగుతోంది. ప్రజలందరి సంక్షేమానికి, జీవన భద్రతకు, అభివృద్ధికి పూచీ పడవలసిన ప్రభుత్వాలు నిస్సిగ్గుగా తమ బాధ్యతల నుండి తప్పుకుంటున్నాయి. తమ అంతులేని కార్పొరేట్ దోపిడీ నుంచి ప్రజల దృష్టిని ఏమార్చడానికి పాలకవర్గాలు మతాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నాయి. ఈ దేశంలో నెలకొన్న బహుళ మత విశ్వాసాలను అణచివేసి ఏకైక మతాధిపత్యానికి దారులు వేసే ప్రయత్నాలు పాలక రాజకీయ విధానాలలో స్పష్టంగా కనబడుతున్నాయి. ఇవి రాజ్యాంగంలోని ఆధునిక స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నాయి. ఈ విధానాల్ని సైద్ధాంతికంగా, రాజకీయంగా ఓడించి ఈ దేశ భవిష్యత్తును కాపాడుకోవాలి. అందుకు కమ్యూనిస్టులు అవసరం.



ఒకవైపు సమాజంలో సమాన అవకాశాల లేమి తీవ్రమవుతుండగా, మరోవైపు దాన్ని అర్థం చేసుకునేందుకు కావాల్సిన భావావరణం ప్రజలకు లేకపోవడం నేటి విషాదం. దీనివల్ల నిస్సహాయులైన ప్రజలు తమకు తెలియకుండానే ప్రచారంలో ఉన్న తప్పుడు భావాలకు, ఉద్వేగాలకు ప్రభావితమవుతున్నారు. అధిక సంఖ్యాకుల మత విశ్వాసం విద్వేషంగా మారి ప్రజల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అల్ప సంఖ్యాకుల దైనందిన జీవితంలో భయం రాజ్యమేలుతోంది. వాస్తవాల్ని మరుగుపరచి అబద్ధాల పునాదుల మీద మిథ్యా చరిత్రని నిర్మించే మిత- మతవాద రాజకీయాలు విషం చిమ్ముతున్నాయి. ఈ కారణంగా మతం మత్తుమందుగా వాడిన ఒకానొక కాలం నుండి మతం ఒక ఉన్మాదంగా మారిన ఈ కాలంలోకి వచ్చిపడ్డాం. చివరికి దేవుళ్లనూ దేవాలయాలను కూడా ఓటు బ్యాంకు రాజకీయాలకు సాధనాలుగా వాడుకునే స్థాయికి రాజకీయాలు దిగజారాయి. ఈ ఎత్తుగడ పాతదే అయినప్పటికీ ఈసారి చాలా బలంగా, వేగంగా సమాజాన్ని ప్రజాస్వామిక, లౌకిక స్ఫూర్తికి దూరంగా నెట్టివేస్తుండడం గుర్తించదగిన ప్రమాదం. దీనిని న్యాయస్థానాలు, ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగ సంస్థలు కూడా అడ్డుకోలేని విభ్రాంతికర ఘటనలను పౌర సమాజమంతా మౌనంగా వీక్షిస్తోంది.

రాజ్యం మతం కలగలిసి ఇలా ప్రజల్ని గుడ్డివాళ్లను చేయడం భూస్వామ్యవ్యవస్థ లక్షణం. నూతన ఆవిష్కరణలకు, అన్వేషణలకు అది అవరోధంగా మారినందువల్లనే ప్రపంచమంతటా మత ప్రమేయం లేని ఆధునిక ప్రజాస్వామిక రాజ్యాల ఆవిర్భావం కోసం అనేక పోరా టాలు జరిగాయి. ఆ పోరాటాల ఫలితమే నేటి ఆధునిక లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థలు. ఈ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ ఆ రెండిటినీ కలిపి దేశాన్ని తిరిగి మధ్యయుగాల చీకటి కాలానికి తీసుకుపోతోంది. ఒకే జాతి, ఒకే మతం, ఒకే పౌరసత్వం, ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ.. లౌకిక రాజ్యాంగా, సమాఖ్య వ్యవస్థగా కొనసాగుతున్న దేశాన్ని మతరాజ్యంగా, ఏకశిలా సదృశంగా మార్చ జూస్తోంది. అదే జరిగితే సమాజంలో మునుపెన్నడూ ఊహించని విధంగా మతం భూమికగా ఒక విశృంఖలత్వం ప్రబలి మన ఇంటి ముంగిట్లోకొచ్చే భయానక రోజులను చూడాల్సి వస్తుంది.

ఈ నేపథ్యంలో ఇవాళ కమ్యూనిస్టులకు దేశ రాజకీయాలలో ఒక చారిత్రక పాత్ర ఉన్నది. పాలక మనువాదం దేశాన్ని నియంతృత్వం వైపు, కాలం చెల్లిన మధ్య యుగాల తిరోగమన విలువల వైపు నడుపుతున్న ప్రస్తుత సందర్భంలో ఏం చేయాలి? ప్రభుత్వము, ప్రజలు ఈ మత భావనలకతీతంగా, దూరంగా ఉండగలిగితేనే అది నిజమైన స్వేచ్ఛ, సెక్యులరిజం అని ప్రజలకి ఎలా అర్థం చేయించాలి? మతమే రాజ్యంగా మారటం మహా ప్రమాదమన్న సంగతి ప్రజలకు ఎలా చెప్పాలి? జరుగుతున్న ఘటనల నుంచి ఈ మొత్తం సందర్భాన్ని ఎలా చూడాలి? ఎలా ఎదుర్కోవాలి. ఇదే ఇప్పుడు దేశం ముందు, కమ్యూనిస్టుల ముందు ఉన్న అతిపెద్ద సవాలు.. వారు ఈ సవాలును అధిగమించడంపైనే ఇప్పుడీ దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది.



మరో పోరాటం

నాగలి భుజాన పెట్టినప్పుడే
తాము యుద్ధాన్ని విరమించనట్లు
పంటపతాకాన్ని ఎగురేస్తనే ఉంటరు
ఎరువు కోసం నెత్తురు చిందించారు
విత్తనాల కోసం లాఠీలను భరించారు
కాలం పొడూత కొలిమిలా మండుతూ
ఇండియా గేట్ ముందు కవాతు

నేలంటే గుండెంత ప్రేమ
మట్టిలో గింజలు వాళ్ల చెమటదారలు
మెతుకు మెతుకుమీద పేరు మెరుస్తున్నా
వాళ్లెవరికీ యాదుండదు అధికారంలో సోయుండదు
పాలకులకు వాళ్లంటేనే శత్రువులు
అవసరాలకు వాళ్లను
జై కిసాన్ జై జవాన్ అని ఘనంగా కీర్తించినా
కుర్చీలెక్కాక పెంటమీద విసిరేసినాకులే
రైలు పట్టాల మీద రూపాయిబిళ్లలా
నలిగిపోయే నాగలి బిడ్డలు

రాముడంత ప్రయారిటీ రైతులు కారేమో
నినదించని నేలలేదు అడుగని దినం లేదు
ఎలుగెత్తిన నినాదాలతో రోడ్లమీదనే ఎండిపోతున్నరు
పొలాలను విడిచి రోడ్లెక్కటం ఈ దేశ దౌర్భాగ్యం
స్వామినాథన్ కు భారతరత్నను బహుమానమిచ్చి
కార్పొరేట్ కత్తుల చట్టాలతో గొంతులు కోస్తున్నరు

మేమున్నామని అన్నింటికీ అభయ మిచ్చారు
గళమెత్తకుండా నేడు బారికేడ్లతో రోడ్లు తవ్వుతున్నరు
తీవ్రవాదుల్లా చూస్తున్నరు
కర్షకుల ఉసురు పెప్సీకోలాలా తాగి
దళారుల కంపెనీలకు జయజయహోలు పాడుతున్న 'విశ్వగురు'

నేలకు బువ్వపెట్టడానికి
నిరంతరం పొలంలో పురుగై పొరాడి
పంటకంకులను కన్నబిడ్డల్లా సాదుకుంటరు
పొలంనుండి పొలాన్ని వెలిగించే పంటకాపులు
ఏడాదికేడాది కొత్తకొత్త వంగడాలతో
దేశం కడుపునింపె అన్నం చేతులు

శరీరమే సేద్యమై సర్వస్వం దారపోసినా
కృషలుడు వంచించబడుతున్నాడు
ఎండను సెల్లరూమాలుగా చుట్టి పొలం చేయటం
ఏ యుద్ధవీరుడు సాగుదారుకు సాటిరాడు
బాధలు కష్టాలతో కాలం ఎల్లదీస్తున్న శ్రవణకుమారులు
కరువు యుద్ధాలన్నీ వ్యవసాయదారుల ముందు దిగదుడుపు
అతివృష్టి అనావృష్టి అనార్థాలన్నీ తోకముడుచినవి
మరో పోరాటమంటే హాలికులదే
ధైర్యం ఉక్కుగుండంటే రైతులదే కర్షకులదే...

(ఢిల్లీలో రైతుల పోరాటానికి మద్దతుగా..)

- వనపట్ల సుబ్బయ్య, 9492765358

పెన్షన్ల గురించి...



ప్రభాత్ పట్నాయక్


మనకిప్పుడు ఒక వింత దృశ్యం కనిపిస్తోంది. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలోకెల్లా మనది అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ప్రధానమంత్రి మొదలు ప్రభుత్వ అధికార ప్రతినిధులందరూ అదేపనిగా విసుగెత్తిపోయేలా ప్రచారం చేస్తూనే వున్నారు. త్వరలోనే అది 5లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ కానుందని, జీడీపీ వృద్ధి రేటులో చైనానే మించిపోతుందని గొప్పలు పోతున్నారు. అదే ప్రభుత్వ ప్రతినిధులు, నాయకులు పాత పెన్షన్ విధానం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ చెల్లించే విషయం వచ్చేసరికి ప్రభుత్వం దగ్గర నిధులు లేవని ప్రకటిస్తున్నారు. ఇక అసంఘటిత రంగంలో పనిచేస్తూ, ఎటువంటి పెన్షన్ సదు పాయమూ లేని కోట్లాదిమంది కార్మికులకు సార్వత్రిక పెన్షన్ చెల్లించే సంగతి గురించి చెప్పేదేముంది?

ప్రపంచంలోనే అతివేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ తన దేశంలోని వృద్ధులకు పెన్షన్లు చెల్లించే పరిస్థితిలో లేదు. అంతే కాదు, తన దేశంలోని మాతృ మూర్తులకు కడుపు నిండా తిండి పెట్టలేని స్థితిలో ఉంది. 15 నుంచి 49 ఏండ్ల మధ్య వయస్కులైన స్త్రీలలో 57 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య, సంక్షేమ సర్వే వెల్లడించింది. ఇది 2019-20 నాటి సర్వే. ఇక ప్రపంచంలోనే అతి వేగంగా పెరుగుతున్న మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆకలి సూచికలో 125 దేశాలకు గాను 111వ స్థానంలో ఉంది. అంటే తన ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించలేని స్థితిలో ఉంది. కనీసం 2200 క్యాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని రోజూ పొందలేకపోతే అట్టివారు నిష్టదరిద్రంలో ఉన్నట్టేనని పాత ప్లానింగ్ కమిషన్ నిర్ధారించింది. ఆ విధంగా చూస్తే గ్రామీణ ప్రాంతాల్లో కనీసం 80 శాతం మంది నిష్టదరిద్రులు ఉన్నారు. 2017-18 జాతీయ శాంపిల్ సర్వేలో ఈ విషయం బయటపడింది.

> ప్రస్తుతం నయా ఉదారవాద వ్యవస్థ అధికోత్పత్తి సంక్షోభంలో తీవ్రంగా కూరుకుపోతున్న పరిస్థితుల్లో. ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ద్వారా ఆ సంక్షోభాన్ని నివారించడానికి పూనుకోవచ్చు. అలా చేసినందువలన సామాన్య ప్రజలకు కాస్తంత గౌరవప్రదమైన జీవన పరిస్థితులను కల్పించినట్టూ ఔతుంది. కాని నయా ఉదార వాదం సంపన్నుల మీద పన్నులను పెంచడానికి ఒప్పుకోదు. అటు ద్రవ్యలోటును పెంచి ప్రభుత్వం ఖర్చు చేయడానికీ ఒప్పుకోదు. అందుచేత ఈ నయా ఉదారవాద చట్రంలో ఆర్థిక వ్యవస్థ కొనసాగుతూన్నంత కాలమూ పెన్షన్ సమస్యకు పరిష్కారం లభించదు. సంక్షోభాన్ని, దాని భారాలను ఎదిరించి పోరాడే క్రమంలో నూతన వ్యవస్థను నిర్మించుకోవడమే పరిష్కారం.

కొత్త పెన్షన్ స్కీములో పెన్షన్ కోసం ఉద్యోగుల జీతాల నుండి ప్రతీ నెలా మినహాయిస్తున్నారు. పాత పెన్షన్ విధానం అటువంటిది కాదు. ఆ విధానం ప్రకారం పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు. దానిని చెల్లించే బాధ్యత యజ మాని అయిన ప్రభుత్వానిదే. అయితే ఆ పాత పెన్షన్ విధానాన్ని ఎందుకు అమలు చేయడం లేదని అడుగుతున్న వారందరికీ ప్రభుత్వ అధికార ప్రతినిధులు, మంత్రులు అందరూ చెప్తున్న సమాధానం ఒక్కటే. "ప్రభుత్వం దగ్గర అంత స్తోమత లేదు". పాత పెన్షన్ విధానంలో ఉద్యోగి రిటైర్ అయేనాటికి అతనికి, లేదా ఆమెకు వచ్చే నెల జీతంలో బేసిక్ పే, కరువు భత్యం లెక్కించి, అందులో సగం పెన్షన్‌గా చెల్లించడం జరుగుతుంది. ఆ తర్వాత పెరిగే ధరలకు అనుగుణంగా ఆ పెన్షన్‌ను సవరిస్తారు. ధరల పెరుగుదల ప్రభావాన్ని పరిగణించి, నిజ పెన్షన్ విలువను అందుకు అనుగుణంగా లెక్కిస్తే ఆ పెన్షన్‌లో నిజానికి ఏ పెరుగుదలా లేనట్టే.

ఇప్పుడు ఆర్థిక వ్యవస్థ 6-7 శాతం చొప్పున ప్రతీ ఏడూ పెరుగుతోంది. కాని పెన్షనర్ల సంఖ్య అంత వేగంగా పెరగడం లేదు. అంటే జీడీపీలో పెన్షన్ కోసం చెల్లించే మొత్తం శాతం (జీడీపీకి పెన్షన్ మొత్తానికి మధ్య నిష్పత్తి) ఏటికేడూ పడిపోతోందన్న మాట. అలా పడిపోతున్నప్పుడు ఆ పెన్షన్ చెల్లించడం ప్రభుత్వానికి ఏండ్లు గడుస్తున్న కొద్దీ తేలిక కావాలి. ప్రభుత్వం చెప్పే లెక్కల్ని బట్టే ఇది నిర్ధారణ అవుతోంది. కాని, ఇందుకు పూర్తి విరు ద్ధంగా పాత పెన్షన్ విధానాన్ని అందరికీ వర్తింపజేయడం మోయలేని భారం అవుతుందని ఎందుకు ప్రభుత్వ ప్రతినిధులు చెప్తున్నారు? అంటే జీడీపీ వృద్ధి వేగంగా ఉన్న కాలంలో ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బలహీన పడుతున్నట్టు అనుకోవాలి. ఏ విధంగా చూసినా, అలా అనుకోలేము. అసలు కారణం ఏమంటే, ఈ ప్రభుత్వం జీడీపీలో మరింత ఎక్కువ వాటా పెట్టుబడిదారులకు దక్కేలా చేయాలని భావిస్తోంది. అలా చేయడాన్ని సమర్థించుకోడానికి ఈ ప్రభుత్వం దగ్గర ఒక వాదన ఉండనేవుంది. పెట్టుబడిదారులకు ఎంత ఎక్కువ వాటా దక్కితే అంత ఎక్కువగా వాళ్లు పెట్టుబడులు పెట్టి జీడీపీ మరింత ఎక్కువగా వృద్ధి చెందడానికి తోడ్పడతారు అన్నదే ఆ వాదన.



ఈ వాదన ఏ మాత్రమూ సమర్థనీయం కాదు. పెట్టుబడిదారులకు ఎక్కువ ధనాన్ని ఇస్తే వాళ్లు ఎక్కువ పెట్టుబడులు పెడతారు అనే వాదన ఎంత పసలేనిదో దాదాపు ఒక శతాబ్దం క్రితమే బూర్జువా ఆర్థిక శాస్త్రవేత్త అయిన కీన్స్, పోలిష్ ఆర్థికవేత్త, మార్క్సిస్టు అయిన మైకేల్ కాలెక్కీ నిరూపించారు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో సప్లైకి తగిన స్థాయిలో డిమాండ్ లేని పరిస్థితే సాధారణంగా కొనసాగుతూ వుంటుంది. అటువంటి వ్యవస్థలో ఉత్పత్తి, పెట్టుబడి, వృద్ధి పెరగాలంటే దానికి ముందు పెరగవలసినది మొత్తం డిమాండ్. అంతే కాని, పెట్టుబడిదారులకు ధనాన్ని ఎక్కువ ధారపోస్తే దానివలన ప్రయోజనం ఉండదు. ఈ సంగతి మోడీ ప్రభుత్వానికి కూడా తెలుసు. కాని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి తిరస్కరిస్తోంది. దానిని బట్టి ఈ ప్రభుత్వం పెట్టుబడిదారుల పక్షాన వ్యవహరిస్తున్న ప్రభుత్వం అని స్పష్టమవుతోంది.

ప్రభుత్వం జీడీపీ వృద్ధి రేటు పెరుగుదల పట్ల ప్రదర్శిస్తున్న ఈ వ్యామోహం, ఆ వృద్ధిరేటు గురించి ప్రచారం చేసుకుంటున్న తీరు అర్థరహితం. ఇటువంటి ధోరణినే గతంలో కొందరు మహారాజులు ప్రదర్శించారు. ప్రజలకి ఉపాధి లేకుండా చేసి, వాళ్లు అడుక్కు తినే పరిస్థితిలో ఉన్నప్పుడు బలవంతంగా వాళ్లతో చాకిరీ చేయించి పెద్ద పెద్ద కోటలను, రాజహర్మ్యాలను నిర్మించారు. తమ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందంటూ గొప్పలు పోయేవారు. అందుకు తార్కాణంగా ఆ కోటలను, భవంతులను చూపించేవారు. ఈ క్రమంలో ప్రజల పట్ల తమ ప్రవర్తన ఎంత అమానవీయంగా ఉన్నా అది వాళ్లకేమీ పట్టేదేకాదు. బహుశా అడుక్కుతినే స్థితిలో ప్రజలు ఉండడం గర్వకారణంగా వాళ్లు పరిగణించివుండాలి. అదే మాదిరిగా ఇప్పుడు కూడా కోట్లాదిమంది వృద్ధులు అత్యంత దయనీయ స్థితిలో జీవించేటందుకు నెట్టబడుతున్నారు. వారిలో చాలా తక్కువ మందికి ప్రభుత్వం నెలనెలా ఇచ్చే రూ.200 దక్కుతోంది. అది చాలా స్వల్పం. ఇలా జరగడానికి కారణం ప్రభుత్వం దగ్గర ఆర్థిక వనరులు లేకపోవడం ఎంత మాత్రమూ కానేకాదు. వనరులను పెట్టుబడిదారులకు కట్టబెట్టడమే కారణం. ఆ విధంగా కట్టబెట్టడాన్ని సమర్థించుకోడానికి ప్రభుత్వం చేస్తున్న వాదన బొత్తిగా అర్థం లేనిది.

ఈ వనరుల సమస్యను మరికాస్త వివరంగా పరిశీలిద్దాం. 2018-19 నాటికి దేశంలో 60 ఏండ్లు పైబడినవారు సుమారు 13 కోట్ల మంది ఉన్నారు. వాళ్లు జీవించడానికి నెలకు తలా రూ.3వేలు కావాలి. ఆ ఏడాది స్థూల జాతీయ ఆదాయం రూ.187 లక్షల కోట్లు, లేదా రూ.187 ట్రిలియన్లు. వృద్ధులకు గనుక నెలకు తలా రూ.3000 చొప్పున చెల్లించాలంటే అందుకు కావలసిన మొత్తం స్థూల జాతీయాదాయంలో 2.5 శాతం మాత్రమే. ఈ మొత్తాన్ని చెల్లించాక దానిని అందుకున్న పెన్షనర్లు తిరిగి దానిని ఖర్చు చేస్తారు. ఆ ఖర్చులో పన్నుల రూపంలో ప్రభుత్వానికి తిరిగి కనీసం 30 శాతం వెనక్కి వచ్చేస్తుంది. అంటే నికరంగా ప్రభుత్వం పెన్షన్లకోసం తన స్థూల జాతీయాదాయంలో 1.75 శాతం కేటాయిస్తే సరిపోతుంది. ఈ మొత్తాన్ని సమకూర్చు కోడానికి సంపన్నుల మీద ఒక శాతం సంపద పన్ను విధిస్తే చాలు. అలా ఒక శాతం పన్ను అదనంగా విధించినంత మాత్రాన ఆ సంపన్నుల వినిమయం ఏమీ తగ్గిపోదు. అందుచేత ఇతరత్రా పెన్షన్ సదుపాయం లేని వృద్ధులకు నెలకు రూ.3వేల చొప్పున సార్వత్రిక పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి వనరుల కొరతేమీ లేదు.

> 2018-19 నాటికి దేశంలో 60 ఏండ్లు పైబడినవారు సుమారు 13 కోట్ల మంది ఉన్నారు. వాళ్లు జీవించడానికి నెలకు తలా రూ.3వేలు కావాలి. ఆ ఏడాది స్థూల జాతీయ ఆదాయం రూ.187 లక్షల కోట్లు, లేదా రూ.187 ట్రిలియన్లు. వృద్ధులకు గనుక నెలకు తలా రూ.3000 చొప్పున చెల్లించాలంటే అందుకు కావలసిన మొత్తం స్థూల జాతీయాదాయంలో 2.5 శాతం మాత్రమే. ఈ మొత్తాన్ని చెల్లించాక దానిని అందుకున్న పెన్షనర్లు తిరిగి దానిని ఖర్చు చేస్తారు. ఆ ఖర్చులో పన్నుల రూపంలో ప్రభుత్వానికి తిరిగి కనీసం 30 శాతం వెనక్కి వచ్చేస్తుంది. అంటే నికరంగా ప్రభుత్వం పెన్షన్లకోసం తన స్థూల జాతీయాదాయంలో 1.75 శాతం కేటాయిస్తే సరిపోతుంది. ఈ మొత్తాన్ని సమకూర్చు కోడానికి సంపన్నుల మీద ఒక శాతం సంపద పన్ను విధిస్తే చాలు.

2018-19తో పోల్చితే ఇప్పటికి పెన్షన్ పొందే అర్హత కలవారి సంఖ్య ఇంకా పెరిగివుంటుంది కదా అన్న సందేహం రావచ్చు. అలాగే 2018 నాటి రూ. 3వేలు ఇప్పటి ధరలకు అనుగుణంగా సవరిస్తే ఇంకా ఎక్కువ అవుతుంది కదా? అటువంటప్పుడు ఆర్థిక భారం ఇంకా ఎక్కువ అవుతుంది కదా? అని సందేహం వస్తుంది కూడా. ఆ సందేహానికి ఆస్కారం లేదు. ఈ కాలంలో జాతీయ ఆదాయం కూడా పెరిగింది గనుక పెన్షనర్లకు చెల్లించే మొత్తం కూడా అందులో ఒకానొక శాతంగా ఉంటుంది గనుక అది కూడా పెరుగుతుంది. ఒకవేళ ఇప్పుడు కూడా రూ.3వేల చొప్పున మాత్రమే చెల్లించాలనుకుంటే ఆ శాతం తగ్గుతుంది కూడా.

ప్రస్తుతం నయా ఉదారవాద వ్యవస్థ అధికోత్పత్తి సంక్షోభంలో తీవ్రంగా కూరుకుపోతున్న పరిస్థితుల్లో. ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ద్వారా ఆ సంక్షోభాన్ని నివారించడానికి పూనుకోవచ్చు. అలా చేసినందువలన సామాన్య ప్రజలకు కాస్తంత గౌరవప్రదమైన జీవన పరిస్థితులను కల్పించినట్టూ ఔతుంది. కాని నయా ఉదారవాదం సంపన్నుల మీద పన్నులను పెంచడానికి ఒప్పుకోదు. అటు ద్రవ్యలోటును పెంచి ప్రభుత్వం ఖర్చు చేయడానికీ ఒప్పుకోదు. అందుచేత ఈ నయా ఉదారవాద చట్రంలో ఆర్థిక వ్యవస్థ కొనసాగుతూన్నంత కాలమూ పెన్షన్ సమస్యకు పరిష్కారం లభించదు. సంక్షోభాన్ని, దాని భారాలను ఎదిరించి పోరాడే క్రమంలో నూతన వ్యవస్థను నిర్మించుకోవడమే పరిష్కారం.

> పెట్టుబడిదారులకు ఎక్కువ ధనాన్ని ఇస్తే వాళ్లు ఎక్కువ పెట్టుబడులు పెడతారు అనే వాదన ఎంత పసలేనిదో దాదాపు ఒక శతాబ్దం క్రితమే బూర్జువా ఆర్థిక శాస్త్రవేత్త అయిన కీన్స్, పోలిష్ ఆర్థికవేత్త, మార్క్సిస్టు అయిన మైకేల్ కాలెక్కీ నిరూపించారు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో సప్లైకి తగిన స్థాయిలో డిమాండ్ లేని పరిస్థితే సాధారణంగా కొనసాగుతూ వుంటుంది. అటువంటి వ్యవస్థలో ఉత్పత్తి, పెట్టుబడి, వృద్ధి పెరగాలంటే దానికి ముందు పెరగవలసినది మొత్తం డిమాండ్. అంతే కాని, పెట్టుబడిదారులకు ధనాన్ని ఎక్కువ ధారపోస్తే దానివలన ప్రయోజనం ఉండదు. ఈ సంగతి మోడీ ప్రభుత్వానికి కూడా తెలుసు. కాని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి తిరస్కరిస్తోంది. దానిని బట్టి ఈ ప్రభుత్వం పెట్టుబడిదారుల పక్షాన వ్యవహరిస్తున్న ప్రభుత్వం అని స్పష్టమవుతోంది.

(స్వేచ్ఛానుసరణ)

చండీగఢ్ మేయర్ ఎన్నిక - బీజేపీ దురాక్రమణ - సుప్రీం తీర్పు

- డాక్టర్ బి.గంగారావు

చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికలో రాజ్యాంగ నిబంధనలకు, చట్టాలకు పాతరేసి బీజేపీ తీవ్ర అక్రమాలు, మోసాలకు తెగబడింది. ఏకంగా బ్యాలెట్ పేపర్లనే ట్యాంపరింగ్ చేసి దొడ్డిదారిన తన అభ్యర్థిని మేయర్ పీఠానెక్కించింది. ఈ అప్రజాస్వామిక ఘాతుకానికి వ్యతిరేకంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించి, సంచలనాత్మక తీర్పును వెలువరించింది. అక్రమంగా మేయర్ పదవినెక్కిన బీజేపీ నేత మనోజ్ సోంకార్ ఎన్నిక చెల్లదని తీర్పు చెప్పింది. అసాధారణ పవర్‌ని వినియోగించి ఆమ్ ఆద్మీ - కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి అయిన కుల్దీప్ కుమార్‌ను మేయర్‌గా ఎన్నికైనట్లు ప్రకటించింది. దీంతో బీజేపీ ఖంగుతింది. దేశవ్యాప్తంగా ఈ తీర్పు పట్ల హర్షాతిరేకం వ్యక్తమౌతుండగా, రెండోవైపు ఈ ఎన్నికలో బీజేపీ బ్యాలెట్‌ల దురాక్రమణ త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు, దేశ ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదాన్ని తెలియజేస్తున్నది.

జరిగిందేమిటంటే...వాస్తవంగా జనవరి 18న మేయర్ ఎన్నిక జరగాలి. రిటర్నింగ్ అధికారికి ఆరోగ్యం బాగోలేదనే కథ అల్లి ఫిబ్రవరి 6కి ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు చండీగఢ్ టెరిటరీ అడ్మినిస్ట్రేషన్ ప్రకటించింది. ఆప్, కాంగ్రెస్ కౌన్సిలర్లను కొనుగోలు ప్రయత్నాలు విఫలమవడంతో బీజేపీ ఎన్నిక వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో ఆప్ హైకోర్టును ఆశ్రయించగా జనవరి 30న మేయర్ ఎన్నిక జరపాలని అలాగే ఎన్నిక, కౌంటింగ్ ప్రక్రియను సీసీటీవీ కెమెరాలు రికార్డు చేయాలని ఆదేశించింది.

జనవరి 30వ తేదీన చండీగఢ్ మేయర్ ఎన్నిక జరిగింది. మేయర్‌ను, సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ లను పరోక్ష పద్ధతిలో ఎన్నుకోవల్సి ఉంటుంది. మొత్తం 35 మంది కౌన్సిలర్లతో పాటు బీజేపీకి చెందిన చండీగఢ్ ఎంపి ఎక్స్ అఫిషియో సభ్యునిగా మొత్తం 36 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీకి 13, బీజేపీకి 14, కాంగ్రెస్‌కి 7, అకాలీదళ్‌కు ఒకరు చొప్పున కౌన్సిలర్‌లు ఉన్నారు. బీజేపీకి 14 మంది కౌన్సిలర్లు, చండీగఢ్ ఎంపి, మద్దతు ఇస్తున్న అకాలీదళ్ కౌన్సిలర్‌తో కలిపి మొత్తం 16 మంది మద్దత్తు ఉండగా, ఆమ్ ఆద్మీ - కాంగ్రెస్ కూటమికి 20మంది బలం ఉంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా అనిల్ మసీహ్‌ను నియమించారు. ఈయన బీజేపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మరియు నామినేట్ చేయబడిన కౌన్సిలర్. వాస్తవంగా ప్రభుత్వ ఉన్నతాధికారిని రిటర్నింగ్ అధికారిగా నియమించాలి. ఈ నిబంధనను కూడా బీజేపీ తుంగలో తొక్కింది. పార్టీ నాయకుడినే రిటర్నింగ్ అధికారిగా నియమించింది.

బలం లేక పోయినా తప్పుడు పద్ధతులకు పాల్పడైనా గెలవాలని బీజేపీ ముందుగా వ్యూహం పన్నింది. మనోజ్ సోంకార్‌ను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టింది. ఆమ్‌ఆద్మీ- కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థిగా కుల్దీప్ కుమార్ ఉన్నారు. 36 మంది ఓటు వినియోగించుకున్నారు. బీజేపీకి 16, ఆమ్ ఆద్మీ - కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి కి 12 ఓట్లు వచ్చినట్లు, మిగిలిన 8 ఓట్లు చెల్లనివిగా ప్రకటించి బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్‌ను మేయర్ అభ్యర్థిగా గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. బ్యాలెట్ పేపర్లు ట్యాంపరింగ్ జరిగాయని ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికను బహిష్కరించారు.

కౌంటింగ్‌లో రిటర్నింగ్ అధికారిగా ఉన్న బీజేపీ నాయకుడు ఆమ్ ఆద్మీ - కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థికి అనుకూలంగా పడిన 8 బ్యాలెట్లు చెల్లకుండా వాటిపై గీత గీసి ఇంటు (X) మార్క్ పెట్టాడు. రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పేపర్‌లు ట్యాంప రింగ్‌కు పాల్పడుతున్న దశ్యాలు సిసిటీవి కెమెరాల్లో రికార్డ్ అయ్యింది. మున్సిపల్ అధికారులను లోబర్చుకున్నారు. ఈ అక్రమాలను ఆమ్‌ఆద్మీ పంజాబ్ - హర్యానా రాష్ట్రాల ఉమ్మడి హై కోర్టులో ఛాలెంజ్ చేసింది. ఎన్నికపై స్టే కోరడమైంది. స్టే నిరాకరించి మూడు వారాల్లో సమాధానం ఇవ్వాలని ప్రతివాదులకు నోటీస్‌లు ఇచ్చింది. అంతేగాక బ్యాలెట్ పేపర్‌లను హై కోర్టు రిజిస్ట్రార్ స్వాధీనం చేసుకొని భద్రపరచాలని ఆదేశించింది.

హైకోర్టులో స్టే రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆప్ ఆశ్రయించింది. సుప్రీంకోర్టు అత్యవసర కేసుగా దీనిని పరిగణించి వెంటనే విచారణ ప్రారంభించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ నేతత్వంలోని జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం మేయర్ ఎన్నిక కౌంటింగ్ వీడియోను కోర్టులోనే అందరి సమ క్షంలో ప్రదర్శించింది. కౌంటింగ్ సందర్భంగా రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పేపర్‌లు ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్న దశ్యాలు చూసి తీవ్ర ఆందోళనకు గురైంది. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఘాటుగా స్పందించింది. రిటర్నింగ్ అధికారిని బోనులో నిలబెట్టింది. తీవ్ర అక్రమాలకు, కోర్టులో సైతం అబద్ధాలకు పాల్పడిన నిన్నెందుకు ప్రాసిక్యూట్ చేయకూడదని ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే రిటర్నింగ్ అధికారిపై కేసు నమోదు చేసి ప్రాసిక్యూట్ నోటీసు ఇవ్వాలని కోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించింది.



రిటర్నింగ్ అధికారిపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందిచడంతో తీర్పుకు రెండురోజులు ముందుగా మేయర్ పదవికి బీజేపీ రాజీనామా చేయించింది. మేయర్ ఎన్నికను రద్దుచేసి కొత్తగా ఎన్నిక జరపాలని సుప్రీం కోర్టు తీర్పిస్తుందని బీజేపీ అగ్ర నాయకత్వం భావించి వెంటనే తిరిగి ఎన్నిక పెడితే గెలవటానికి గాను అవినీతి పద్ధతులకు తెరలేపింది. కోట్ల రూపాయలు ఎరేసి ముగ్గురు ఆప్ కౌన్సిలర్లను కొనేసింది. కానీ కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో ముఖ్యమైన అంశమేమంటే రాజ్యాంగంలోని సెక్షన్ 142 యొక్క అసాధారణ పవర్‌ను సుప్రీంకోర్టు ఉపయోగించింది. తిరిగి ఎన్నిక నిర్వహించకుండా ఆప్ అభ్యర్థిని మేయర్‌గా ప్రకటించింది. దీంతో బీజేపీ జిత్తుల మారి అడ్డదారులన్నీ మూసుకుపోయాయి. ముగ్గురు ఆప్ కౌన్సిలర్లను కొనుగోలు చేసి ఎలాగైనా మేయర్ పీఠాన్ని చేజిక్కించుకోవాలనే అధికార దాహం పటాపంచలయ్యింది.

చండీగఢ్ మేయర్ ఎన్నికకి చాలా రాజకీయ ప్రాముఖ్యత ఉంది. త్వరలో జరగబోతున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించటానికి దేశంలోని బీజేపీ వ్యతిరేక రాజకీయ పార్టీలన్నీ ఇండియా బ్లాక్‌గా ఏర్పడిన నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ మేయర్ ఎన్నికల్లో తొలిసారిగా ఆప్-కాంగ్రెస్ ఒక్కటై ఇండియా బ్లాక్‌గా మేయర్ అభ్యర్థిని నిలబెట్టాయి. ఈ కూటమి గెలిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికలపై పడుతుందని బీజేపీ భయం పట్టుకుంది. అందుకే ఈ దారుణానికి ఒడిగట్టింది. బీజేపీ అభ్యర్థిని మేయర్‌గా రిటర్నింగ్ అధికారి ప్రకటించిన వెంటనే బీజేపీ అధ్యక్షుడు జే.డి.నడ్డా అంకగణాంకాలు, కెమిస్ట్రీలు ఏవీకూడా బీజేపీ గెలుపును ఆపలేవని నిస్సిగ్గుగా ప్రకటించారు.

గతేడాది ఢిల్లీ మున్సిపల్ మేయర్ ఎన్నికల్లో కూడా బీజేపీ అనేక అక్రమాలకు పాల్పడింది. 250 స్థానాలున్న కార్పొరేషన్‌లో ఆప్ 134 వార్డులలో గెలుపొందింది. బీజేపీ కేవలం 104, కాంగ్రెస్ 9 స్థానాల్లో గెలుపొందాయి. ఆప్ అభర్థి మేయర్‌గా గెలుపొందటానికి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ అనేక నెలలు మేయర్ ఎన్నిక జరగనీయకుండా ఘర్షణలకు దిగింది. వందల కోట్లతో ఆప్ కార్పొరేటర్లను కొనుగోలు చేయటానికి ప్రయత్నించింది. లెఫ్టినెంట్ గవర్నర్‌ను ఉపయోగించింది. నిబంధనలకు విరుద్ధంగా పదిమంది బీజేపీ నాయకులను కో ఆప్షన్ సభ్యులుగా నామినేట్ చేసి మేయర్ ఎన్నికల్లో వారికీ ఓటు హక్కు కల్పించారు. మూడుసార్లు ఎన్నిక వాయిదా పడింది. చివరికి ఆప్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నామినేటెడ్ సభ్యులకు మేయర్ ఎన్నికలో ఓటు అర్హత లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. దీంతో బీజేపీ తోక ముడిచింది.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవటం సాధ్యం కాదనీ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ను ఏలాగైనా చేజిక్కించుకొని ఆప్‌ను ఇబ్బందులు పెట్టాలనే కుట్రపన్నింది. ఢిల్లీ మొత్తం మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా వుండేది. మూడింటిని కలిపి ఒకే కార్పొరేషన్‌గా బీజేపీ చేసింది. అయినా దాని కుట్రలు ఫలించలేదు.

> చండీగఢ్ మేయర్ ఎన్నికకి చాలా రాజకీయ ప్రాముఖ్యత ఉంది. త్వరలో జరగబోతున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించటానికి దేశంలోని బీజేపీ వ్యతిరేక రాజకీయ పార్టీలన్నీ ఇండియా బ్లాక్‌గా ఏర్పడిన నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ మేయర్ ఎన్నికల్లో తొలిసారిగా ఆప్-కాంగ్రెస్ ఒక్కటై ఇండియా బ్లాక్‌గా మేయర్ అభ్యర్థిని నిలబెట్టాయి. ఈ కూటమి గెలిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికలపై పడుతుందని బీజేపీ భయం పట్టు కుంది. అందుకే ఈ దారుణానికి ఒడిగట్టింది. బీజేపీ అభ్యర్థిని మేయర్‌గా రిటర్నింగ్ అధికారి ప్రకటించిన వెంటనే బీజేపీ అధ్యక్షుడు జేడి.నడ్డా అంకగణాంకాలు, కెమిస్ట్రీలు ఏవీకూడా బీజేపీ గెలుపును ఆపలేవని నిస్సిగ్గుగా ప్రకటించారు.

సెల్ : 9490098792

ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులకూ ఐఆర్

- ఆర్థిక శాఖకు సీఎంవో ఆదేశాలు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులకూ వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ)లోని మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం కార్యాలయం ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేసింది. కొత్త వేతన సవరణ కమిషన్ ఏర్పాటు సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు శాతం ఐఆర్ ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అక్టోబర్‌లో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆది నుంచి పీఆర్సీ పరిధిలో ప్రభుత్వరంగ సంస్థలైన కార్పొరేషన్లు, వివిధ సొసైటీల ఉద్యోగులకు సైతం ఐఆర్ వర్తింపచేస్తున్నారు. కానీ అక్టోబర్ నాటి ఉత్తర్వుల్లో వారిని చేర్చకపోవడం గమనార్హం.

ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడం కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల జేఏసీ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తమకు పీఆర్సీని వర్తింపచేయాలనీ, ఐఆర్ ఇవ్వాలని కోరింది. దీనిపై స్పందించిన సీఎం వెంటనే ఆర్థిక శాఖకు నోట్ పంపించాలని తన కార్యాలయ కార్యదర్శిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల ప్రత్యేక కార్యదర్శి సైతం దీనిపై ఆర్థిక శాఖకు లేఖ పంపించారు. అధికారులు దీనిపై ప్రతిపాదనలను రూపొందించి పంపించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

కులగణనతోనే అంతరాలు పోతాయి

(మొదటిపేజీ తరువాయి)

కులగణన జరిగి తీరాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో కుల గణన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదింపజేయడం విప్లవాత్మకమైన చర్యగా అభివర్ణించారు. ఈ చారిత్రిక అంశాన్ని సెమినార్లు, మీడియా సమావేశాలు, యూనివర్సిటీల్లో సదస్సుల ద్వారా తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీసీ మేధావులను భట్టి కోరారు.అసెంబ్లీలో కులగణన తీర్మానం ప్రవేశపెట్టడం ద్వారా ఒక ఘట్టం ముగిసిందని సమావేశంలో పాల్గొన్న బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తాము నిజాయితీగా ఉన్నామనీ, క్యాబినెట్‌లో ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా కులగణన తీర్మానాన్ని ఆమోదించామని వివరించారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ప్రజలకు అర్థమైందని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంతో మరో 15 ఏండ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని చెప్పారు. కులగణన తీర్మానాన్ని అసెంబ్లీలో ఆమోదింపజేయడం ద్వారా కొత్త ప్రభుత్వ రాజకీయ సంకల్పం అర్థమైందని ప్రొఫెసర్ మురళీధర్ అన్నారు. ఈ అంశాన్ని చివరి వరకు తీసుకెళ్తారనీ, అధికారులకు ప్రభుత్వానికి ఈ అంశంలో చిత్తశుద్ధి ఉందని తమకు నమ్మకం కలిగిందని అభిప్రాయపడ్డారు. ఒక పెద్ద జాతీయ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ కులగణనకు కట్టుబడి ఉండడం విప్లవాత్మకమైన చర్య అని ప్రొఫెసర్ సింహాద్రి అన్నారు. ఇది విజయవంతంగా పూర్తయితే మిగిలిన అన్ని అంశాలూ ఒక్కొక్కటిగా పరిష్కారమవుతాయని చెప్పారు. కింది కులాల పట్ల ఈ ప్రభుత్వానికి నిజాయితీ నిబద్ధత ఉందని తమకు భరోసా కలిగిందని బీసీ నేత క్రాంతి కుమార్ అన్నారు. అంధకారంలో ఉన్న బతుకులకు కొత్త ప్రభుత్వం వెలుగులు చూపిస్తుందన్న నమ్మకం కలిగిందన్నారుమీ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, బీసీ సంక్షేమం, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు 18 మంది అభ్యర్థుల ఎంపిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు 18 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఆ జాబితాను విడుదల చేశారు. 18 డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ ఎనిమిదో తేదీన టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 16న జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్‌ఎల్)ను, 17న ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాను ప్రకటించారు. ఈనెల 20న హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. ఇప్పుడు ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను విడుదల చేశారు. వారి వివరాలు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. మల్టీజోన్-1 పరిధిలో ఐదుగురు, మల్టీజోన్-2 పరిధిలో 13 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని వివరించారు

పొద్దు తిరుగుడు పంటను కొనండి : మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

యాసంగిలో పండిన పొద్దు తిరుగుడు పంటను కొనుగోలు చేయాలంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్క్‌ఫెడ్‌ను ఆదేశించారు. అన్ని మార్కెట్లలో శనివారం నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసారి 21,350 ఎకరాల్లో పొద్దుతిరుగుడు సాగైందనీ, 16,995 టన్నుల మేర దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పొద్దుతిరుగుడు సాగుచేసి రైతులెవరూ తొందరపడి మార్కెట్లో తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు.

ప్రభుత్వ ఆస్తుల జాబితాను సమర్పించండి

- ప్రారంభోత్సవాలన్ని వారంలోగా పూర్తి చేయండి
- మెట్రో కొత్త మార్గాలకు త్వరలో శంకుస్థాపన
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జీహెచ్‌ఎంసీపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో విలువైన ప్రభుత్వ ఆస్తుల జాబితాను సమర్పించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. నగరంలో ఏవైనా ప్రారంభోత్సవాలు ఉంటే వాటిని వారం రోజుల్లో నిర్వహించుకోవాలని సూచించారు. మెట్రో కొత్త మార్గాలకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. హైదరాబాద్ వాటర్ వర్క్స్, జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తదితర అంశాలపై శుక్రవారం రాత్రి హెచ్‌ఎండీఏ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం పాల్గొని పలు ఆదేశాలను జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో భవనాల అనుమతులకు సంబంధించిన దస్త్రాలు స్పష్టంగా ఉండాలని సూచించారు. చాలా భవనాల అనుమతులకు సంబంధించిన ఫైళ్లు కనబడటం లేదని తెలిపారు. ఆన్‌లైన్‌లో లేకుండా ఇష్టారీతిగా పర్మిషన్లు ఇచ్చినట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో 15 రోజుల్లో హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీలో విజిలెన్స్ దాడులు జరుగుతాయంటూ ఆయన హెచ్చరించారు. ఇష్టానుసారంగా వ్యవహరించిన ఉద్యోగులు ఇంటికి పోతారని తెలిపారు. ఆన్‌లైన్‌లో లేకుండా ఇచ్చిన అనుమతుల జాబితాను తయారు చేయాలంటూ సూచించారు. హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్ నుంచి చెరువుల ఆన్‌లైన్ డేటా ఎందుకు డిలీట్ అవుతుందంటూ ప్రశ్నించారు. మొత్తం 3,500 చెరువుల టేడా ఆన్‌లైన్ ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఆక్రమణలకు గురి కాకుండా చెరువుల వద్ద సీసీ కెమెరాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

హైదరాబాద్ నగరంలో పిల్లల కోసం ప్రత్యేక క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలంటూ సీఎం ఈ సందర్భంగా సూచించారు. కొత్తగా ఏర్పడిన 85 మున్సిపాల్టీల్లో కమిషనర్లు లేకపోవడం ఏంటని నిలదీశారు.ఈ విషయంపై ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుతో రేవంత్ ఫోన్‌లో మాట్లాడారు. ఆయా మున్సిపాల్టీల్లో కమిషనర్లుగా గ్రూప్ 1 అధికారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన్ను ఆదేశించారు. మున్సిపల్ వర్కర్లకు ప్రమాద బీమా కల్పించడంపై అధ్యయనం చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీలో వయస్సు పైబడిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వాలని అన్నారు. ఆస్తి పన్ను మదింపు కోసం డ్రోన్ కెమెరాను ఉపయోగించడంపై అధ్యయనం చేయాలని సూచించారు. హైదరాబాద్‌లో ప్రయివేటు సెక్టార్‌లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఉదయమే లేచి కాలనీల్లో జోనల్ కమిషనర్లు పర్యటించాలనీ, అలా పర్యటించని వారు ... ఇంటికి పోవచ్చని హెచ్చరించారు. కుర్చీల్లో కూర్చునే పోస్టులు కావాలంటే ఇస్తామంటూ వారిని హెచ్చరించారు. న్యూయార్క్ టైమ్ స్క్వేర్ తరహాలో హైదరాబాద్‌లో వీడియో ప్రకటనల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వీధి దీపాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలనీ, బహుళ ఉపయోగ టవర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌కు తాగు నీటి కొరత లేకుండా చూడాలనీ, స్థానిక చెరువులను స్టోరేజీ ట్యాంకులుగా ఉపయోగించుకోవాలని సూచించారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ, రంగనాయక సాగర్‌ల నుంచి హైదరాబాద్‌కు తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ఇందు కోసం అవుటర్ రింగ్ రోడ్డు బయట ఉన్న చెరువులను క్లస్టర్లుగా విభజించాలని సూచించారు. వచ్చే 50 ఏండ్ల వరకు తాగునీటి అవసరాల కోసం ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఈ సందర్భంగా ఉన్నతాధికారులను ఆదేశించారు. సమీక్షలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులు దానకిశోర్, ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.

యువ రైతు శుభకరణ్‌సింగ్ హత్యకు నిరసన

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం
- హర్యానా సీఎం, హోంమంత్రి రాజీనామా చేయాలి : ఎస్‌కేఎం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

యువ రైతు శుభకరణ్‌సింగ్ హత్యకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో కేంద్ర, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు టి. సాగర్, ఉపేందర్‌రెడ్డి, మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్య ఝాన్సీ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్‌రాములు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, హర్యానా సీఎం, రాష్ట్ర హోంమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, అనిల్ విజ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పంజాబ్ బార్డర్‌లో కేంద్రం, హర్యానా రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు శుభకరణ్‌సింగ్‌ను క్రూరంగా హత్య చేశాయని ఆరోపించారు. బాధ్యులైన వారిపై హత్యానేరం మోపాలని డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తేయాలని కోరారు. శుభకరణ్ స్ఫూర్తితో రైతు పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల నిరసన స్థలంలో ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేశారన్నారు. రైతులను చంపి, గాయపరిచినందుకు, నిరసన స్థలంలో అనేక ట్రాక్టర్లను ధ్వంసం చేసినందుకుగానూ పంజాబ్ ప్రభుత్వానికి, హర్యానా పోలీసులకు వ్యతిరేకంగా సెక్షన్ 302 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాల్పులు, ట్రాక్టర్లకు జరిగిన నష్టంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుని కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పాడైన 100 ట్రాక్టర్ల మరమ్మత్తు ఖర్చులు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోతే ఫిబ్రవరి 26న జాతీయ రహదారులపై ట్రాక్టర్లు, వాహనాల ర్యాలీలు నిర్వహిస్తా మన్నారు.తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఆందోళనలో పార్టీల కతీతంగా రైతులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు మూడ్ శోభన్, బొంతు రాంబాబు, బాబు, చుక్కయ్య, బ్రహ్మం, కందుకూరి జగన్ (వ్యవసాయ కార్మిక సంఘం), పద్మ, అరుణ(ఐఎఫ్‌టీయు), అనగంటి వెంకటేశ్ (డీవైఎఫ్ఐ), మహేష్ (పీడీఎస్‌యూ) తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ అధికారులపై సర్కారు దృష్టి

- 1300 మందిపై త్వరలో వేటు ?
- సీఎం పరిశీలనలో దస్త్రం
- అవసరమైన వారి కొనసాగింపు
- అవినీతి మరకలున్న వారికి ఉద్వాసన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఉద్యోగ విరమణ చేసి ఎక్స్‌టెన్షన్‌పై సర్వీసులో ఇంకా కొనసాగుతున్న అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. త్వరలోనే వారిపై సర్కారు తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆయా ప్రభుత్వ శాఖల నుంచి పూర్తిసమాచారం తెప్పించుకున్న ప్రభుత్వం కొరడా ఝులిపించేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఉద్యోగ విరమణ చేసి సర్వీసులో కొనసాగుతున్న వారిలో ఆయా శాఖ హెచ్‌వోడీలతోపాటు అఖిల భారత సర్వీసు(ఏఐఎస్) అధికారులు ఉన్నారు. దాదాపు 40 రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 120 మంది హెచ్‌వోడీలు ఉన్నట్టు సమాచారం. అలాగే పదుల సంఖ్యలో ఏఐఎస్‌లు ఉన్నారు. వీరి గురించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ద్వారా నివేదిక తెప్పించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, త్వరలోనే ఒక నిర్ణయానికి రానున్నారు. క్లీన్‌చిట్ ఉంటే ఆయా శాఖల్లో అవసరాలను బట్టి కొందరిని కొనసాగించే పరిస్థితులు ఉన్నాయి. అలాగే మరికొందరి విషయంలో కఠినంగా వ్యవహరించాలని రేవంత్ సర్కారు భావిస్తున్నది. సాగునీటి శాఖ, రెవెన్యూ, సర్వే, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, సింగరేణి, వైద్య, ఆరోగ్య శాఖ, విద్యుత్, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ తదితర శాఖలతోపాటు ఇతర డిపార్ట్‌మెంట్లల్లో పనిచేస్తున్న వారు సుమారు 1500 మంది ఉంటారని సమాచారం. వీరిలో దాదాపు 200 మంది లోపు ఆయా స్థాయి అధికారులు ప్రభుత్వానికి అవసరమని ఉన్నతాధికారులు సిఫారసు చేసినట్టు సమాచారం. వీరి పనితీరు, హోదా ఆధారంగా కొనసాగించాలా ? వద్దా ? అనే విషయమై నిర్ణయం తీసుకోనున్నారు. మిగతా 1300 మందికి ఉద్వాసన తప్పదని అధికారులు చెబుతున్నారు. వీరందరిపై ఇంటెలిజెన్స్ ద్వారా సమాచారం తెప్పించుకుంటున్నట్టు తెలిసింది. ప్రధానంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని ఇంటికి పంపాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఎన్నికల ప్రచారంలోనే అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా రేవంత్ ఎక్స్‌టెన్షన్ అధికారులను తొలగిస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాక నెల రోజులకు ఉద్యోగ విరమణ చేసిన అధికారుల వివరాలను తెప్పించుకున్నారు. నివేదిక సీఎంవోకు వచ్చి దాదాపు నెల దాటింది. ఈనేపథ్యంలో త్వరలోనే వీరిపై చర్యలు తీసుకోవచ్చని సచివాలయం వర్గాలు చెబుతున్నాయి.

సీఎం సంతాపం

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ మృతి పట్ల...



(ఫైల్)

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీగా పని చేసిన జన్నత్ హుస్సేన్ తెలుగు రాష్ట్రానికి సుదీర్ఘ సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఉమ్మడి రాష్ట్రంలో పలు జిల్లాల కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారనీ, వైఎస్ఆర్ సీఎంగా ఉన్న సమయంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీగా పని చేసి స్పెషల్ సీఎస్ హోదాలో రిటైరయ్యారని తెలిపారు. అనంతరం సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్‌గా పని చేశారనీ, కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో అమల్లోకి తెచ్చిన ఉచిత విద్యుత్ పథకం విధివిధానాలను రూపొందించి రైతులకు మేలు చేయటంలో ఆయన విశేషంగా కృషి చేశారని సేవల్ని గుర్తుచేసుకున్నారు. జన్నత్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రజావాణిలో 1203 విజ్ఞాపనలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు నుండి విశేష స్పందన లభిస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 1,203 దరఖాస్తులు అందాయనీ, వీటి స్వీకరణకు 16 కౌంటర్లు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పౌరసరఫరాల శాఖ, పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖ, ఉపాధి, విద్య ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయ పశుసంవర్థక శాఖ, పరిశ్రమలు, అటవీ, విద్యుత్, నీటిపారుదల, దేవాదాయ తదితర శాఖలకు సంబంధించి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు తమ అర్జీలను సులభంగా అధికారులకు అందచేశారని వివరించారు.

రంజాన్ ఏర్పాట్లు చేయండి

- వక్ఫ్ అధికారులకు షబ్బీర్ అలీ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని అన్ని మశీదులు, ఈద్గాలు, దర్గాల్లో ప్రత్యేక ఏర్పాట్లను తక్షణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ వక్ఫ్‌బోర్డ్ అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయ ప్రాంగణంలోని మసీదులో జరిగిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,730	-	---
22 క్యారెట్లు	57,500	-	---
కిలో వెండి	76,000	▼	700



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	140
రిటైల్ (లైవ్)	రూ.	162
స్కిన్‌తో	రూ.	235
స్కిన్‌లెస్	రూ.	267

ఐరోపా పాలక వర్గాలను సంకట స్థితిలోకి నెట్టిన
రైతుల నిరసన జ్వాలలు

నెల్లూరు నరసింహారావు

ప్రపంచ గమనం



ఐరోపా గ్రామీణ ప్రాంతాలలో పోలండ్ నుంచి స్పెయిన్, జర్మనీ, స్విట్జర్లాండ్, రొమానియా, గ్రీస్‌ల దాకా రైతుల అలజడి విస్తరిస్తోంది. ట్రేడ్ యూనియన్ నాయకత్వాల వలే సుతి మెత్తని వైఖరులను కాకుండా అత్యంత మిలిటెంట్ పద్ధతులను అవలంబించటానికి వెనుకాడకుండా రైతాంగం ముందుకు సాగుతోంది. అలా వారు అనేక రాయితీలను పొందుతున్న విషయాన్ని కార్మికులు గమనిస్తున్నారు. దీనితో పాలక వర్గాలు గందరగోళంలో పడుతున్నాయి. రైతుల ఒత్తిడితో ఫ్రెంచ్, స్పానిష్, గ్రీక్ ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి ఇస్తున్న సబ్సిడీలను పెంచుతున్నాయి. ఫ్రాన్స్ డీజిల్‌పై పన్నును విధించాలనే ఆలోచనను మానుకుంది. అలాగే ఫ్రెంచ్ అధ్యక్షుడు మక్రాన్, ఐర్లాండ్ ప్రధాని వరదకార్ లాటిన్ అమెరికాలో ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసే మెర్కోసుర్ దేశాలైన అర్జంటీనా, బ్రాజిల్, పెరాగ్వే, ఉరుగ్వే, వెనిజు యేలా, బొలీవియాలతో ఎటువంటి వాణిజ్య ఒప్పందాలను చేసుకోవటానికి సిద్ధంగా లేమని ప్రకటించటం జరిగింది. దీనంతటికీ కారణం రైతుల మిలిటెంట్ పోరాటాలే.

ఐరోపా దేశాల జనాభాలో రైతుల శాతం చాలా తక్కువగా ఉంటుంది. ఫ్రాన్స్ జనాభాలో 2.5%, నెదర్ ల్యాండ్స్, జర్మనీ దేశాలలో 1% కంటే కొంచెం ఎక్కువగా రైతులు ఉంటారు. జనాభాలో ఇంత తక్కువ సంఖ్యలో వున్నప్పటికీ రైతులు తమతమ ట్రాక్టర్లనే ఆయుధాలుగా మలచుకుని ప్రభుత్వాలనుంచి రాయితీలను పొందటం లోను, ప్రభుత్వాలను, యూరోపియన్ యూనియన్‌ను కూడా చీల్చటంలో విజయాలు సాధించారు. రైతాంగం డిమాండ్ల సారం ఎటువంటిదైనా వారు చేస్తున్న పోరాటాలు కార్మికులకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. బెల్జియం, స్పెయిన్, పోలాండ్, ఫ్రాన్స్, జర్మనీలలో నగరాల రహదార్ల ను రైతులు దిగ్బంధిస్తున్నారు. అనేక ఓడ రేవులను కూడా దిగ్బంధిస్తున్నారు. బెల్జియం రైతులు డచ్ సరిహద్దును, పోలండ్ రైతులు ఉక్రెయిన్ సరిహద్దును 30 రోజులపాటు దిగ్బంధించారు. పోలాండ్‌లో ఉక్రెయిన్ నుంచి వచ్చి పడిన దిగుమతుల కారణంగా 2023తో పోల్చినప్పుడు వ్యవసాయ ఉత్పత్తుల ధరలు 40% పతనం అయ్యాయి. ఐరోపా దేశాల రైతులు తమ ట్రాక్టర్లతో యురోపియన్ యూనియన్ పార్లమెంట్ భవనాన్ని ముట్టడించారు. ఆ ప్రాంతంలో పాత టైర్లను తగలబెట్టారు. పార్లమెంట్ భవనంపై రాళ్ళతోను, కోడి గుడ్లతోను దాడి చేశారు. అనేక చోట్ల ప్రభుత్వ భవనాలను ట్రాక్టర్లతో ముట్టడించారు. ప్రభుత్వ కార్యాలయాలపైనే కాకుండా ప్రధాన సూపర్ మార్కెట్లను, హోల్ సేల్ మోనోపలీలను కూడా లక్ష్యంగా చేసుకుని రైతులు తమ తీవ్ర నిరసనలను తెలుపుతున్నారు. బెల్జియం, ఫ్రాన్స్‌లలోని అల్డీ, లిడ్ల్ వంటి పంపిణీ కేంద్రాలవద్ద గడ్డి మోపులతో బారికేడ్లను నిర్మించారు. వాయవ్య ఫ్రాన్స్‌లో నివసించే రైతులు ప్యారిస్ నగరాన్ని ముట్టడించారు. "ప్యారిస్ కడుపు"గా పిలువబడే 570ఎకరాల హోల్ సేల్ మార్కెట్ ముందు వందలాది ట్రాక్టర్ల ను నిలిపి దిగ్బంధించారు.

అలాగే ఇదే విధంగా క్యాటలాన్ రైతులు బార్‌సెలోనా లోని ఐరోపాలోనే అత్యంత పెద్ద మార్కెట్‌ను స్తంభింపజేశారు. ఇదంతా రైతాంగ నాయకత్వం కూడా పాలక వర్గాలకు అణుకువగా మెలుగుతున్నప్పటికీ రైతులు తిరగబడుతున్న పరిస్థితిని పాలక వర్గాలు ఎదుర్కొంటున్నాయి. ఫ్రాన్స్‌లో రైతాంగ నిరసనలను అణచటానికి 15000 మంది పోలీసులను ప్రయోగించినప్పటికీ ఫలితం లేకపోయింది. తక్షణం రైతాంగ సమస్యల పరిష్కారానికి ఏదో ఒకటి చెయ్యకపోతే అది కార్మిక రంగానికి కూడా విస్తరించే ప్రమాదం ఉందని, అదే జరిగితే వ్యవస్థ స్తంభిస్తుందని ఫ్రెంచ్ పోలీస్ యూనియన్ హెచ్చరించింది. సరిగ్గా ఇదే కారణం చేత పాలక వర్గాలు రైతులకు అనేక రాయితీలను ఇస్తున్నాయి. రైతుల తిరుగుబాటు అనే మందు పాతరను ఎలాగైనా పేలకుండా చెయ్యాలని పాలక వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. లేకపోతే ఈ నిరసన ఇతర రంగాలకు దావానలంలా వ్యాపించే అవకాశం ఉంటుంది. పాలక వర్గాలకు రైతాంగ ఉద్యమాలవల్ల తీవ్రమైన రాజకీయ పర్యవసానాలు ఉన్నాయి. గత సంవత్సరంలో డచ్ ఫార్మర్స్ సిటిజెన్స్ ఉద్యమం(బిబిబి) అన్ని పార్టీలకంటే ముందు నిలిచింది. ఈ పార్టీ కార్యక్రమం ఎటువంటిదైనా ప్రభుత్వాల మీద, ప్రభుత్వ సంస్థల మీద నేరుగా దాడిచేసే రైతుల ధోరణి ప్రజలను ఆకట్టుకుంటోంది. జూన్ నెలలో యూరోపియన్ పార్లమెంటుకు ఎన్నికలు ఉన్నందున ఇటువంటి అనిశ్చిత స్థితి పాలక వర్గాలను భయపెడుతోంది. ఇటువంటి పరిస్థితిలో ఫ్రాన్స్‌లోని నేషనల్ ర్యాలీ, జర్మనీలోని ఏఎఫ్‌డి వంటి మితవాద పార్టీలు లాభపడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ పార్టీల కార్యక్రమాలలో రైతులకు పనికి వచ్చేది ఏమీ లేదు. ఉదాహరణకు ఏఎఫ్‌డి వ్యవసాయ సబ్సిడీలను వ్యతిరేకిస్తోంది. అలాగే వలసలను తగ్గించాలని కూడా ఈ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. చౌకగా లభించే వలస కార్మికుల శ్రమను ఐరోపా దేశాల రైతాంగం ఉపయోగించుకుంటోంది. రాబోయే ఎన్నికల్లో మితవాద పార్టీలు లాభపడటం అంటూ జరిగితే అది ఉక్రెయిన్ యుద్ధాన్ని వ్యతిరేకించటం వల్లే అవుతుంది. ఎందుకంటే ఉక్రెయిన్ యుద్ధం వల్ల చమురు ధరలు విపరీతంగా పెరగటమే కాకుండా ఉక్రెయిన్ నుంచి అత్యంత చౌక ఆహారోత్పత్తులు ఐరోపా మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. దీని ప్రభావం పారిశ్రామిక ఉత్పత్తిపైన ప్రతికూలంగా పడుతోంది. చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలను మాంద్యం ప్రమాదం వెన్నాడుతోంది.

ఐరోపా సామ్రాజ్యవాదం మూర్ఖత్వంతో మొదలైన ఉక్రెయిన్ యుద్ధం ఐరోపా దేశాలనే కుంగదీస్తోంది. తాము వెనుక నుంచి నడిపే ఉక్రెయిన్ యుద్ధంతో ఈ దేశాలు రష్యాను నాశనం చెయ్యలేకపోగా తమతమ సమాజాలలో తీవ్రమైన సమస్యలను తమకు తాముగా సష్టించుకుంటున్నాయి. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎగదోసే అమెరికా యుద్ధ క్షేత్రానికి దూరంగా వుండటంతో ఐరోపా దేశాల వలే ప్రతికూలంగా ప్రభావితం కావటం లేదు. నిజానికి చిన్న రైతులను రక్షించటానికి ఉదారవాద, మితవాద పార్టీలకు ఎటువంటి కార్యక్రమం లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక సంక్షోభం నుంచి మరొక సంక్షోభానికి పయనిస్తున్న క్రమంలో నష్టపోయేది కార్మిక వర్గం మాత్రమే కాదు. పెద్ద బ్యాంకులు, ఎనర్జీ కంపెనీలు, సూపర్ మార్కెట్లు, వాణిజ్యం దెబ్బ తినటం, ద్రవ్యోల్బణం, పెరిగే వడ్డీ రేట్లు చిన్న రైతుల, చిరు వ్యాపారుల నడ్డి విరుస్తున్నాయి.

సాధారణ కాలాల్లో ఈ తరగతుల పైనే పాలక వర్గాలు ఆధారపడుతుంటాయి. ఐరోపా దేశాలలోని సంప్రదాయ గ్రామీణ ప్రాంతాలలో నివసించే ఈ వర్గాలపైన మితవాద పార్టీలకు గట్టి పట్టు ఉంటుంది. నేడు ఈ పట్టు సడలిపోతోంది. రైతాంగంలో కదన కుతూహలం పెరుగుతున్న కొద్దీ పెట్టుబడిదారుల వెన్నులో వణుకు ఎక్కువ అవుతుంది. ఈ వర్గాల ప్రజలలో అసంతృప్త జ్వాలలు రగలటం రాబోయే పెను మార్పులకు సూచికగా ఉంటుంది. అయితే రైతులు, చిన్న పెట్టుబడిదారులు మాత్రమే బడా పెట్టుబడి పాలనకు సవాలును విసరలేరు. అందుకు కార్మిక వర్గం తోడవ్వాలి. ప్రస్తుతం ఐరోపాలో కార్మిక వర్గం చలనాలు ఇంకా పుంజుకోలేదు. అప్పటిదాకా రాబోయే మార్పులకు రైతాంగమే అగ్రగామిగా ఉంటుంది.

ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరు గిరిజనుల హత్య

- పామేడు ఏరియా మావోయిస్టు కమిటీ లేఖ విడుదల

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని పామేడు పోలీస్ స్టేషన్ పరిధి దూలోడ్ గ్రామానికి చెందిన సోడి హుంగ, మడివి నంద అనే ఇద్దరు గిరిజనులను పామేడు ఏరియా మావోయిస్టు కమిటీ హతమార్చినట్టు ఓ లేఖలో పేర్కొన్నారు. శుక్రవారం పామేడు ఏరియా మావోయిస్టు కమిటీ పేరుతో ఓ లేఖను విడుదలచేశారు. పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా మారవద్దని, ఎన్ని మార్లు హెచ్చరించినా మాట వినకపోవడంతో పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా ఉన్న ఆ ఇద్దరిని పీఎల్‌జీఏ మట్టు పెట్టడం జరిగిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పోలీస్ స్టేషన్లను ప్రారంభించి అమాయక గిరిజనులపై బలవంతంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

సాగునీటి శాఖ ఈఎన్సీ(జనరల్)గా అనిల్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



రాష్ట్ర సాగునీటి,ఆయకట్టు, అభివృద్ధి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(జనరల్)గా గుమ్మడి అనిల్ కుమార్ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఛార్జీ తీసుకున్నారు. అనిల్‌కుమార్ ఇప్పటికే ఈఎన్సీ (అడ్మిన్)గా పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ఈనెల ఎనిమిదిన ఈఎన్సీ జనరల్‌గా ఉన్న మురళీధర్‌రావు రాజీనామా చేసిన నేపథ్యంలో కొత్త నియామకం అవసరమైంది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ల కుంగుబాటు తరుణంలో సాగునీటి శాఖలో భారీ మార్పులు, చేర్పులు ఉండే అవకాశాలు లేకపోలేదని సమాచారం. ఇప్పటికే ఇద్దరు అధికారులపై వేటు వేసిన సర్కారు, మరికొంత మందిని ఇంటిదారి పట్టించనుందని తెలిసింది. ఇదిలావుండగా సాగునీటి శాఖ ప్రత్యేక కార్యదర్శిగా ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను నియమించడం గమనార్హం.

కూలీల ఆటో బోల్తా

- పది మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం




నవతెలంగాణ-కల్లూరు

ఖమ్మం జిల్లా కల్లూరు మండలం మధిర రోడ్‌లో ముందు వెళ్తున్న బైకును కూలీలతో వెళుతున్న ఆటో ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి బోల్తాపడింది. శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పదిమంది కూలీలకు, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాఇ. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు, ఆటోలో ప్రయాణిస్తున్న వారు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన కూలీలు.. కల్లూరు మండలం పెద్ద కోరుకొండి మీదుగా ఏపీలోని కృష్ణా జిల్లా ఊటుకూరుకు కూలీ పనులకు వెళుతున్నారు. ఈ సమయంలో కల్లూరులోని మధిర రోడ్డులోకి రాగానే ముందున్న బైక్‌ను ఆటో ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి పోచవరం రైతు వేదిక వద్ద బోల్తా పడింది.

ఆటోలో ఉన్న పదిమంది కూలీలకు గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. కాగా బైక్‌పై ఉన్న ఇద్దరూ కిందపడి గాయాలయ్యాయి. కుర్నవల్లి గ్రామంలోని కూలీల కుటుంబాలకు ఘటన సమాచారం అందడంతో బాధితుల బంధువుల రోదనలతో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని గాయపడిన వారిని 108లో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించినట్టు ఎస్ఐ షాకీర్ చెప్పారు. గాయపడిన వారిలో భద్రమ్మ, చీమకుర్తి కృష్ణమ్మ, ఈశ్వరి, బండి పద్మ, చీమకుర్తి వెంకటయ్య, ఈదుల పద్మ, సాయి శ్రీని, పి.పుల్లమ్మ, ఏ.యువ సాయి ఉన్నారు. వైద్యాధికారి నవ్య కాంత్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

మేడారం బస్టాండ్‌లో తొక్కిసలాట

- ప్రాణాపాయ స్థితిలో వృద్ధురాలు
- మరొకరి తలకు తీవ్ర గాయాలు
- బస్సుల కోసం గంటల తరబడి ప్రయాణికుల నిరీక్షణ



నవతెలంగాణ-ఏటూరు నాగారం ఐటీడీఏ

మేడారం జాతరలో కోసం ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్టాండ్ సందర్శకులతో కిటకిటలాడటంతో తొక్కిసలాడ జరిగింది. అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నాక శుక్రవారం ఇంటిబాట పట్టిన సందర్శకులు.. హన్మకొండ వెళ్లేందుకు బస్సుల కోసం క్యూ లైన్‌లో గంటల తరబడి నిరీక్షించారు. ఈ క్రమంలో ములుగు-హన్మకొండ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు రావడంతో ప్రయాణికులంతా ఒకేసారి ఎగబడ్డారు. దాంతో తొక్కిసలాట జరిగింది. ఇందులో ఒక వృద్ధురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. మరోవ్యక్తి తలకు తీవ్రగాయాలయ్యాయి. వీరితో పాటు చాలా మంది ప్రయాణికులు స్వల్పగాయాలపాలయ్యారు. జాతరలో ఆర్టీసీ సేవల కోసం ప్రభుత్వం రూ.2.25 కోట్ల నిధులు కేటాయించింది. ఆరువేల బస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్టీసీ ఎండీ తెలిపారు. అయినా గంటకో బస్సు కూడా రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఇంతపెద్ద జాతరలో ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో కనీసం ఒక అంబులెన్స్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో సందర్శకులు ఆర్టీసీ అధికారులపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు గాయపడిన వారిని గద్దెల వద్ద ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రైతులపై లాఠీ

- హర్యానాలో రైతుల ఆందోళనపై పోలీసుల దాడి
- రైతులకు గాయాలు... ధ్వంసమైన ట్రాక్టర్లు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతులపై హర్యానా పోలీసులు లాఠీలు ప్రయోగించారు. ఈ దాడిలో రైతులకు గాయాలయ్యాయి. వారి వాహనాలు సైతం పోలీసు దాడిలో ధ్వంసమయ్యాయి. ఖాప్ పంచాయతీలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు ఖానౌరీ సరిహద్దు మార్చ్‌కు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం హర్యానాలోని హిస్సార్ జిల్లా నార్నాండ్ సబ్ డివిజన్‌లోని ఖేరీ చోప్తా వద్ద నిరసన తెలుపుతున్న రైతుల సమూహంపై పోలీసులు లాఠీచార్జి చేశారు. కొంతమంది పోలీసులు ట్రాక్టర్ల తాళాలు లాక్కోవడం ప్రారంభించడంతో పోలీసుల కు, నిరసన తెలిపిన రైతులకు మధ్య తోపులాట జరిగింది. సుమారు రెండు గంటల పాటు జరిగిన హింసాత్మక ఘర్షణలో పలువురు రైతులు గాయపడ్డారు. ఈ ఘర్షణలో కొన్ని ట్రాక్టర్లు ధ్వంసమయ్యాయి. ఎస్పీ హన్సీ మక్సూద్ అహ్మద్ ఖేరీ చోప్తా వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

మరో రైతు మృతి

'ఢిల్లీ చలో' పిలుపు మేరకు నిరసన తెలుపుతున్న రైతుల్లో మరో రైతు ఖానౌరీ సరిహద్దులో గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో మృతి చెందిన వారి సంఖ్య ఐదుకి చేరుకుంది. భటిండా జిల్లాలోని అమర్‌పురా గ్రామానికి చెందిన రైతు దర్శన్ సింగ్ (62) ఫిబ్రవరి 13 నుండి ఖానౌరీ సరిహద్దులో ఉన్నాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఆయన అసౌకర్యానికి లోనయ్యారు. పాటియాలాలోని రాజింద్ర మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించాక మృతి చెందారు.

రైతు నాయకులపై ఎన్ఎస్ఏ ప్రయోగం...వెంటనే ఉపసంహరణ

అంబాలా జిల్లాకు చెందిన కొంతమంది రైతు నాయకులపై జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ), 1980 విధింపును శుక్రవారం హర్యానా పోలీసులు ప్రకటించారు. వెంటనే ఉపసంహరించుకున్నామని అధికారులు తెలిపారు. వ్యవసాయ నేతలపై ఎన్ఎస్ఎ ప్రయోగించబోమని అంబాలా రేంజ్ ఐజీపీ సిబాష్ కబీరాజ్ తెలిపారు. 'ఎన్ఎస్ఏ విధించే ముందు మాకు చెప్పలేదు. రద్దు చేసే ముందు చెప్పలేదు' అని రైతు నాయకులు అన్నారు.

ప్రభుత్వ ఆస్తులకు ఎలాంటి నష్టం జరిగినా రైతులే చెల్లించాలి

'రైతుల నిరసనల సందర్భంగా ప్రభుత్వ ఆస్తులకు ఎలాంటి నష్టం జరిగినా రైతులే చెల్లించాలి' అని హర్యానా పోలీసులు తెలిపారు. "రైతుల వల్ల ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్తులకు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నాం. ఈ ఉద్యమంలో రైతులు ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్తులకు నష్టం కలిగిస్తే, వారి ఆస్తులు, బ్యాంకు ఖాతాల నుంచి స్వాధీనం చేసుకుని ఈ నష్టాన్ని భర్తీ చేస్తాం. ఈ విషయంలో అడ్మినిస్ట్రేషన్ ఇప్పటికే తెలియజేసింది. ఉద్యమ సమయంలో రైతులు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే, సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ప్రజా ఆస్తులకు నష్టం కలిగించే నిరోధక చట్టం 1984 (పిడిపిపి చట్టం)లో సవరణ ఉంది. దీని ప్రకారం ఉద్యమ సమయంలో ప్రజల ఆస్తులకు నష్టం జరిగితే, ఉద్యమానికి పిలుపునిచ్చిన సంస్థ నేతలే బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని అంబాలా పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆందోళనలో పాల్గొనాలంటే అనుమతి తీసుకోవాలి.. ఇంటి గోడకు పోలీసుల నోటీసు

రైతు నాయకుడు నిరసన నిర్వహించే ముందు అనుమతి తీసుకోవాలని పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు పోలీసులు బీకేయూ (షహీద్ భగత్ సింగ్) అధ్యక్షుడు అమర్జీత్ సింగ్ మొహ్రీ నివాసం వెలుపల ఒక నోటీసును అతికించారు. నిరసన నిర్వహించే ముందు జిల్లా యంత్రాంగం నుండి అనుమతి తీసుకోవాలని హెచ్చరించారు. ఫిబ్రవరి 21న ఆయన శంభు సరిహద్దులో జరిగిన ఆందోళనలో పాల్గొన్నప్పుడు ఆయన ఇంటి వెలుపల నోటీసు అతికించబడిందని ఆయన సహచరులు పేర్కొన్నారు. శుక్రవారం (ఫిబ్రవరి 23)లోగా తన ఆస్తి, భూమి వివరాలను సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి

అప్పుల బాధతో ఉరేసుకుని రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కుమ్మరి లక్ష్మీపతి (55) బుధవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దాంతో కుటుంబ సభ్యులు గ్రామ పరిసర ప్రాంతంలో వెతుకుతున్న సమయంలో తన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

- ఇద్దరు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో సీఆర్పీఎఫ్ జవాన్..

నవతెలంగాణ-వాజేడు

ములుగు జిల్లా వాజేడు మండలం పాయబట్ల గ్రామం వద్ద 163 జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుపాన్ వాహన డ్రైవర్ అతివేగంగా నడుపుతూ ఐరన్ లోడ్‌తో ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీ కొట్టడంతో వాహనంలోని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన వారిలో ఒకరు పేరూరు పోలీస్ స్టేషన్‌లో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా పెరుమాల్ చక్రపాణి విధులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇతను సెలవుపై తన స్వగ్రామం తమిళనాడులోని పాండిచ్చేరికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మరోవ్యక్తి చత్తీస్‌గఢ్ రాష్ట్రం మద్దెడు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా ప్రశాంత్ పాటిల్ జీవన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా ఉన్న ఆయన స్థానంలో మిక్కిలినేని మను చౌదరి నియమితులయ్యారు. శుక్రవారం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జనగామ కలెక్టర్‌గా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రిజ్వాన్ బాషా షేక్‌ను నియమించారు. జనగామ కలెక్టర్‌గా ఉన్న సీహెచ్ శివలింగయ్యను బదిలీ చేసిన ప్రభుత్వం జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజ రామయ్యర్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది.

దేశవ్యాప్తంగా బ్లాక్ డే, ఆక్రోష్ దివస్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పంజాబ్‌లోని ఖానౌరీ సరిహద్దులో యువ రైతు శుభకరన్ సింగ్‌ను హర్యానా పోలీసులు, అమిత్ షా ఆధ్వర్యంలోని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ హత్య చేయడంపై దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులలో తీవ్ర ఆగ్రహంతో శుక్రవారం బ్లాక్ డే, ఆక్రోష్ దివస్‌ని నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపులో భాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కేంద్ర మంత్రి అమిత్ షా, హర్యానా ముఖ్యమంత్రి ఎంఎల్ ఖట్టర్, రాష్ట్ర హోం మంత్రి అనిల్ విజ్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా టార్చ్‌లైట్ ప్రదర్శనలూ జరుగుతున్నాయి. మహిళలు, యువత కూడా నిరసన కార్యక్రమాలలో విస్తతంగా పాల్గొన్నారు.శుభకరణ్ సింగ్ కుటుంబానికి రూ. 1 కోటి, ఉద్యోగం ఇవ్వడానికి పంజాబ్ భగవంత్ మాన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఎస్కేఎం స్వాగతించింది. ఫిబ్రవరి 23న చండీగఢ్‌లో జరిగిన ఎస్కేఎం జనరల్ బాడీ సమావేశం ఈ డిమాండ్‌ను లేవనెత్తింది. పంజాబ్ ప్రభుత్వానికి ఎస్కేఎం తన డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, హర్యానా సీఎం ఖట్టర్, రాష్ట్ర హోం మంత్రి అనిల్ విజ్, రైతు మరణానికి కారణమైన పోలీసు, రెవెన్యూ అధికారులపై ఐపీసీ సెక్షన్ 302 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.

'వికసిత్ భారత్'పై మాడ్యూల్

- సిద్ధం చేసిన ఎన్‌సీఈఆర్‌టీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ నేతృత్వంలోని కేంద్రం తన "వికసిత్ భారత్" కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్వచ్ఛతా హి సేవ, స్వదేశీ అప్నావో కార్యక్రమాలను పాఠ్యాంశాల్లో భాగంగా చేరనున్నాయి. ప్రభుత్వం ముఖ్యమైన పథకాలను పాఠ్యాంశాల్లో అనుబంధ పఠనంగా చేర్చాలని నిర్ణయించామనీ, ఈ మేరకు మాడ్యూల్‌ను కూడా రూపొందించినట్టు అధికారులు తెలిపారు. ఇది నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) సప్లిమెంటరీ మాడ్యూల్‌లో భాగమనీ, దీనిని కేవలం 'వికసిత్ భారత్' అని పిలుస్తారని ఎన్‌సీఈఆర్‌టీ అధికారి తెలిపారు.

"ప్రస్తుత ప్రభుత్వం 125 కోట్ల (1.25 బిలియన్) భారతీయులకు 'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్' సందేశాన్ని అందించింది. ఆత్మవిశ్వాసంతో, స్వావలంబనతో ముందుకు సాగడానికి సహాయం చేస్తుంది" అని మాడ్యూల్‌లో పేర్కొన్నారు. "ఇది పాఠ్యాంశాల్లో భాగం కాదు. తమ దేశం సాధించిన విజయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి, దాని గురించి గర్వపడేలా చేసే ప్రయత్నం" అని అధికారి తెలిపారు. కేంద్రం నారీ శక్తి వందన్ కార్యక్రమం, చంద్రయాన్-3 స్పేస్ మిషన్, భారతదేశం జీ20 ప్రెసిడెన్సీపై ఏజెన్సీ గతంలో మాడ్యూల్స్‌ను విడుదల చేసింది.

గాంధీ ఆస్పత్రిలో పైపులైన్ లీకేజ్

- సూపరింటెండెంట్‌ను ప్రశ్నించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- వెంటనే రిపేర్ చేయించాలని సూచన

నవతెలంగాణ-బేగంపేట

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతదేహాన్ని సందర్శించడానికి గాంధీ ఆస్పత్రికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. అక్కడి డ్రైనేజ్ పైపులైన్ లీకేజీని ఆగ్రహం వ్యక్తం చేశారు. లాస్య నందిత పోస్టుమార్టం సమయంలో మంత్రి అక్కడే ఉండగా.. ఆ సమయంలో పైన పైపులైన్ నుంచి మోరీ నీల్లు కింద పడ్డాయి. దాంతో సూపరింటెండెంట్ రాజారావును పిలిచి.. ఇలా మోరీ నీళ్ల పడుతుంటే ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. అందుకు సూపరింటెండెంట్ స్పందిస్తూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో రూ.14 కోట్ల 50 లక్షలు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు చేయించలేకపోయామని సూపరింటెండెంట్ చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలు గాంధీ ఆస్పత్రికి వస్తుంటారని, ఇలా మురికి నీళ్ల కింద పడితే ఇబ్బందికరంగా ఉంటుందని, వెంటనే రిపేర్ చేయించాలని మంత్రి సూచించారు. తాను సీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా చూస్తానని తెలిపారు.

సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యత ఇవ్వండి

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పునరుత్పాదక విద్యుదుత్పత్తిపై ఇంధన శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారుల్ని ఆదేశించారు. ప్రధానంగా సోలార్ విద్యుత్ విస్తరణకు ఉన్న అన్ని అవకాశాల్ని వినియోగించుకోవాలని సూచించారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి సంబంధించి ఇప్పటి వరకు విధానమే లేకపోవడం దురదృష్టకరమనీ, తక్షణం ఆ విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, సాగునీటి జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్తు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారంనాడిక్కడి ప్రజాభవన్‌లో టీఎస్ రెడ్కో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రీన్ పవర్ ఉత్పత్తికి అవసరమైన అన్ని శాఖలను భాగస్వాములుగా చేసి త్వరలో సమీక్ష చేస్తామన్నారు. పవన విద్యుదుత్పత్తికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని చెప్పారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో చార్జింగ్ కేంద్రాల ఏర్పాటును మరింత విస్తరించాలని ఆదేశించారు. మన ఊరు-మన బడి పథకం ద్వారా 1,521 పాఠశాలల్లో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారనీ, వీటిలో ఎన్ని పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని ప్రశ్నించారు. ఆర్టీసీ, సోషల్ వెల్ఫేర్ సంస్థల్లో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్ టాప్ పని తీరు గురించి ఆరా తీశారు. సమావేశంలో టీఎస్ రెడ్కో వైస్ చైర్మెన్ జానయ్య, సింగరేణి సంస్థల సీఎమ్‌డీ ఎన్ బలరాం, టి.ఎస్ రెడ్కో జనరల్ మేనేజర్ జీఎస్‌వీ ప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్లు రామకష్ణ, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌కు ఈడీ, సీబీఐ సమన్లు వెనుక బీజేపీ "రాజకీయ కుట్ర"

- ఆయన్ను అరెస్టు చేస్తే దేశంలో ప్రజా సునామీ : ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసేందుకు బీజేపీ రాజకీయ కుట్ర పన్నిందని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమిలో భాగంగా ఆప్, కాంగ్రెస్‌ల పొత్తు బీజేపీని చావు దెబ్బ తీస్తుందనే భయంలో మోడీ ఉన్నారని తెలిపారు. ఎలాగైనా బీజేపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలనుకుంటున్న బీజేపీ... ఈడీ, సీబీఐల ద్వారా అక్రమ నోటీసులు పంపుతున్నారని ఆయన విమర్శించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
ఎల్బీనగర్ -మహేశ్వరం
శనివారం | ఫిబ్రవరి 24, 2024 | www.navatelangana.com

సిటీ మోడల్ హైస్కూల్‌లో విజ్ఞాన పరీక్షలు



నవతెలంగాణ-మలక్‌పేట్

జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రతిభ విజ్ఞాన పరీక్షలు ప్రభుత్వ సిటీ మోడల్ హై స్కూల్ చాధర్‌ఘాట్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి సి. ధర్మేందర్ రావు మాట్లాడుతూ ఫిబ్రవరి 28న ప్రతి పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 9 ఏండ్ల నుండి జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని జరుపుతున్నట్టు పేర్కొన్నారు. ఈ పరీక్షల ద్వారా విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేస్తారని వివరించారు.

ఎమ్మెల్యే లాస్య అకాల మరణం బాధాకరం

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా

నవతెలంగాణ- నాగోల్

రోడ్డు ప్రమాదంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సోదరి లాస్య నందిత ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ నిర్వాహక అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికై, తండ్రి దివంగత సాయన్న బాటలో ప్రజాసేవకు అంకితమైన లాస్య నందిత అకాల మరణం అత్యంత బాధాకరం అని అన్నారు. అనంతరం లాస్య నందిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఓట్ల కోసం కాదు..

ప్రజల కోసమే పనిచేస్తా

• ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్ పేట్

తన జీవితాంతం పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తాను తప్ప.. ఓట్ల కోసం కాదనీ మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలను రెసిడెన్షియల్ జోన్లుగా మార్చడానికి అంతా చట్ట ప్రకారమే పనిచేసినట్టు తెలిపారు. ఓట్ల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేస్తానని, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు న్యాయం చేస్తానని చెప్పారు. కార్పొరేషన్ పరిధిలోని ఆయా కాలనీల ఓపెన్, గ్రీన్ జోన్ సమస్యను నాటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసు కెళ్లి, నాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే రెసిడెన్షియల్ జోన్‌గా మార్చటానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు గుర్తుచేశారు. పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి, పూర్తి చట్టబద్ధంగా కృషి చేసినట్లు ఇందులో రహస్యం ఏమి లేదన్నారు. చిన్న పాటి సాంకేతిక సమస్యతో జీవో ఆలస్యం అయిందని, అంతలోనే కోడ్ అమల్లో రావటంతో ప్రక్రియ ఆగిపోయిందని అన్నారు. రెసి డెన్షియల్ జోన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను మాత్రమే ప్రజలకు చెప్పడం జరిగిందన్నారు. నేను కానీ, మా నేతలు ఎవరు ఎక్కడ అబద్ధాలు చెప్ప లేదని, అబద్ధాలు చెప్పి ఓట్లు వేయించుకునే అవసరం మాకు లేదన్నారు. చేసేదే చెప్తా మని, చెప్పిందే చేస్తామన్నారు. ఇలాంటి అంశాలలో ఎక్కడైనా ప్రభుత్వం ముందుగా నోటిఫికేషన్ ఇచ్చి, ప్రజల నుండి ఏమైనా అభ్యంతరాలుంటే స్వీకరిస్తుందని, ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటన కూడా ఇస్తుందన్నారు. ప్రభుత్వం పూర్తి పారదర్శ కంగా వ్యవహరించిందని, ఎక్కడ కూడా నింబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించలేదన్నారు. ఎన్నికల కోడ్ రావాడంతోనే జీవో ఆలస్యం అయ్యిందని పేర్కొన్నారు. ఆయా కాలనీల వాసుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకూ ఆయా కాలనీ వాసుల వెంట ఉంటానని హామీ ఇచ్చారు. 20 ఏండ్లుగా ఏజీఆర్ కాలనీ, రోమా 2 కాలనీ, శ్రీ లక్ష్మి హిల్స్, అల్మాస్ గూడ పరిధిలోని ఏఆర్‌సిఆర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఎస్ఆర్ హిల్స్, విశాఖ నగర్, ఎంఆర్ఆర్ కాలనీ, శ్రీ సాయి హెామ్స్‌లకు సబంధించి ఓపెన్ జోన్, గ్రీన్ జోన్ సమస్యకు ఎమ్మెల్యేగా ప్రజలకు ఇచ్చిన మాటను తప్పకుండా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఓట్ల కోసం ఫేక్ జీవో ఇచ్చారని ఎలాంటి ఆధారాలు లేకుండా విమర్శించే వారు ఈ విషయాలు గ్రహించాలని, ఓ పత్రికలో వచ్చిన వార్త పూర్తి నిరాధారమన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలగొద్దు



- కలుషిత నీళ్లు, లీకేజీలు లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి
- వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వండి
- డిమాండ్‌ను బట్టి అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు
- వేసవి కార్యాచరణపై ఎండీ సుదర్శన్ రెడ్డి సమీక్ష

నవతెలంగాణ-సిటీబ్యూరో

వేసవిని దృష్టిలో ఉంచుకొని కావాల్సిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటిని సరఫరా చేయాలని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీతో పాటు ఓఆర్ఆర్ పరిధిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దని, సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రచించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ఎండీ శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో తాగునీటి సరఫరా, ఇతర అంశాలపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రాబోయే 5 నెలలకు తాగునీరు సరఫరా చేసేందుకు క్షేత్ర స్థాయిలో మైక్రో లెవల్ ప్లాన్స్ రూపొందించుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి అదనపు జలాలను తరలించడానికి ఎమర్జెన్సీ పంపింగ్ కోసం ఏర్పాట్లు మొదలు పెట్టినట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాలకు కేటాయించే నీటి సరఫరాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా సప్లైలో తక్కువ నీరుంటే సర్దుబాటు చేసే లాగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీటి సరఫరా చేసేటప్పుడు సమయ పాలన పాటించాలన్నారు.

నీటి సమస్యలకు 24 గంటల్లో పరిష్కారం..

క్షేత్ర స్థాయిలో లైన్ మెన్లు గైర్హాజరైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలుషిత నీటి సరఫరా, లీకేజీలు జరిగితే సమస్యను గుర్తించి 24 గంటల్లో పరిష్కరించాలని పేర్కొన్నారు. మోటార్లు, బూస్టర్లు, వాల్వులు రిపేర్లు వస్తే ఏఎంస్ కింద మరమ్మతులు చేయాలన్నారు. అవసరానికి సరిపడా వాల్వులను, జంక్షన్లు, తదితర సామగ్రిని సెంట్రల్ స్టోర్‌లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సంబంధిత జీఎంను ఆదేశించారు.

నీటి కొరతలో ప్రెజర్ ఫిర్యాదులకు ప్రాధాన్యం

తాగునీటి సరఫరా, నీటి కొరతలో ప్రెజర్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వాటి పర్యవేక్షణ, పరిష్కారానికి ప్రత్యేక బృందాల్ని సీజీఎంల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా పవర్ కట్స్ ఉంటే ఇతర సమయాల్లో నీటి సరఫరా చేయాలన్నారు. చేతి పంపులు, బోర్ వెల్స్ నిర్వహణపై దృష్టి సారించాలని, అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండేందుకు అదనపు సామగ్రి ఉంచుకోవాలని పేర్కొన్నారు.

డిమాండ్‌ను బట్టి అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు

వేసవిని దృష్టిలో పెట్టుకొని డిమాండును అంచనా వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. నగరంలో ఇప్పటికే 72 ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా డిమాండ్‌ను బట్టి అదనపు ఫిల్లింగ్ స్టేషన్ కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ప్రతి జీఎం సక్రమ నీటి సరఫరాకు ట్రాన్స్ మిషన్ అధికారుల సమన్వయంతో ఇన్ ఫ్లోను పర్యవేక్షించాలని తెలిపారు. తాగునీటి సరఫరా సమయాల్లో కొంత మంది మోటార్లతో నీటిని తోడుతున్న ప్రాంతాల్లోలో -ప్రెజర్ సమస్యలు వస్తున్నాయని వీటిని నివారించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌కు ఆదేశించారు. ఈ సమావేశంలో ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ఈఎస్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ గ్యానేందర్ రెడ్డి, జీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

గాడ్గే బాబా స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలి



• మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న గౌడ్

నవతెలంగాణ- నాగోల్

నేటి యువత సంత్ గాడ్గే బాబా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని బీఎన్‌రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న గౌడ్ సూచించారు. స్వచ్ఛ భారత్ స్ఫూర్తి ప్రదాత సంత్ గాడ్గే బాబా 149వ జయంతి వేడుకలను తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెదవుర బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నాగోల్ డివిజన్లోని సాయి నగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీ ప్రసన్న గౌడ్, పెదవుర బ్రహ్మయ్యలు గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబా సేవలు ఎప్పటికీ మరువలేనివని, అంబేద్కర్‌కు గురువుగా గాడ్గే బాబా అనేక సూచనలు అందించిన వ్యక్తి అని కొనియాడారు. స్వచ్ఛ భారత్‌పై మొట్టమొదటిగా అవగాహన కల్పించిన వ్యక్తి అని పేర్కొన్నారు. అంతేకాదు గాడ్గే బాబా అనేక విద్యాసంస్థలు, కాలేజీలు, అనాథ ఆశ్రమాలను నెలకొల్పి ఎంతో మంది నిరుపేదలను విద్యావంతులుగా తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ప్రభుత్వం సంత్ గాడ్గే బాబా జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. అనంతరం చీపుర్లతో రోడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వినయ్ కుమార్, లింగరాజు, వెంకటేష్ గౌడ్, చైతన్య, రేణుక, కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్య మరణం తీరని లోటు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎమ్మెల్యే లాస్య నందిత మరణం తీరని లోటు అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ అనతి కాలంలోనే తండ్రికి తగ్గ తనయ అన్నట్టు.. గెలిచిన కొద్ది రోజులకే ఇలా అకాల మరణం చెందడం తీవ్ర మనస్థాపానికి గురిచేసిందన్నారు. ఆమె తండ్రి సాయన్న ఎంతో మంచి వ్యక్తి అని అన్నారు. జనరల్ ఎన్నికలో అతి పిన్న వయసులో గెలిచి నాలుగు నెలలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజల హృదయాలను గెలుచుకుందన్నారు. ఆమె మరణం కంటోన్మెంట్ ప్రజలకు, బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే లాస్య కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పాఠశాలకు స్థలం కేటాయించాలని వినతి



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్‌లోని మండల్ పరిషత్ ప్రాథమిక పాఠశాల కోసం స్థలం కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల నిర్మాణం కోసం కేంద్రం నుంచి రూ.54 లక్షల నిధులు మంజూరయ్యాయని, రాబోయే నాలుగు సంవత్సరాలు ప్రతి యేటా రూ.50 లక్షలు మంజూరు అయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రంగారెడ్డి జిల్లాలో కేవలం రెండు పాఠశాలలే పీఎంశ్రీ పథకానికి ఎంపికయ్యాయని తెలిపారు. ఇప్పుడున్న భవనం కేవలం 150 గజాల్లో నిర్మితమై ఉందని, ఈ నిధులను వినియోగించులేని పరిస్థితి నెలకొన్నదన్నారు. సర్వే నంబర్ 79లో రెండు ఎకరాల స్థలం కేటాయిస్తే పాఠశాల నిర్మాణం చేసుకోవచ్చని అన్నారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. వెంటనే స్థలం కేటాయించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా గతంలో సంఘీనగర్, తొర్రూర్ నుంచి ఇంజాపూర్ మీదుగా నడిచే బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. వినతి అందజేసిన వారిలో టీపీసీసీ కార్యదర్శి, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, నక్క శివలింగం గౌడ్, గుండా ధనరాజ్, రేవల్లి యాదగిరి, మేతరి దర్శన్, బాలరాజ్, ధనరాజ్, బొక్క వంశీధర్ రెడ్డి, మల్లెల మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ ఇన్ ఇండియా

ఇంక్ హెచ్‌ఆర్ మేనేజర్స్ సర్వే నివేదిక ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ది ఉద్గైతి ఫౌండేషన్, సెంటర్ ఫర్ ఎకనామిక్ డేటా అండ్ అనాలిసిస్ (సెడా) సహకారంతో 'ఉమెన్ ఇన్ ఇండియా ఇంక్ హెచ్‌ఆర్ మేనేజర్స్ సర్వే నివేదికను ఆవిష్కరించింది. ఇది ప్రకటనలు, వాస్తవాలకు మధ్య గణనీయమైన వ్యత్యాసాన్ని హైలైట్ చేస్తుంది. మన దేశంలో లింగ వైవిధ్య కార్యక్రమాల్లో ప్రభావవంతమైన డేటాను నడపడానికి గోద్రెజ్ డే ల్యాబ్స్, సెంటర్ ఫర్ ఎకనామిక్ డేటా అండ్ అనాలిసిస్, అశోక విశ్వవిద్యాలయం, దస్రా భాగస్వామ్యంతో ది ఉదయి ఫౌండేషన్ ద్వారా నిర్వహించబడిన ఉమెన్ ఇన్ ఇండియా ఇంక్ సమ్మిట్‌లో ఈ అధ్యయనం వెల్లడింపబడింది. ఉదాహరణకు, 73శాతం భారతీయ సంస్థలు లింగ వైవిధ్య లక్ష్యాలను నిర్దేశించినప్పటికీ, కేవలం 21శాతం మాత్రమే మద్దతు వ్యూహాలను కలిగి ఉన్నాయి. 55శాతం సంస్థలు మహిళల అభివృద్ధి కోసం లక్ష్యాలను నిర్దేశించగా, కేవలం 37శాతం మంది మాత్రమే నియామకంలో లింగ అసమానతలను పరిష్కరిస్తున్నారు. చట్టపరమైన సమ్మతి అంతరాలు: 59శాతం సంస్థలు తప్పనిసరి అంతర్గత ఫిర్యాదుల కమిటీలు లేవు. 37శాతం ప్రసూతి సెలవు ప్రయోజనాలను అందించడంలో విఫలమయ్యాయి. 17.5శాతం మాత్రమే పిల్లల సంరక్షణ సౌకర్యాలను అందిస్తాయి.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

• కార్పొరేటర్ సుజాతా నాయక్

నవతెలంగాణ - హస్తినాపురం

స్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అధికారులను ఆదేశించారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనంలో జీహెచ్‌ఎంసీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను జీహెచ్‌ఎంసీ ఏఈ హేము నాయక్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ ద్వారా మరిన్ని నిధులు మంజూరు చేయించి.. స్మశాన వాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. డివిజన్‌లో ఎక్కడ సమస్య ఉన్నా తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ప్రణాళికాబద్ధకంగా పరిష్కరించనున్నట్లు చెప్పారు. నూతనంగా ఏర్పడ్డ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహాయ సహకారాలు అందజేయనున్నట్లు తెలిపారు.



సంత్ గాడ్గే బాబా రజక జయంతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్వచ్ఛభారత్ పితామహుడు, 150 విద్యాలయాలు స్థాపించిన మహెూన్నతమైన వ్యక్తి సంత్ గాడ్గే బాబా రజక జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రజకుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి రవి, మహిళా అధ్యక్షురాలు దుర్గారాణి, ఉపాధ్యక్షులు అక్కెనపల్లి గణేష్, కార్యదర్శి కేతూరి రవి, సహాయ కార్యదర్శి రావుల వెంకట రాములు, ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి నిరంజన్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు మహానంది వెంకట్, కార్యవర్గ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

• బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి



నవతెలంగాణ - సిటీబ్యూరో

ప్రభుత్వ భూములను కాపాడాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు తూంకుంటలోని జిల్లా ప్రెస్ క్లబ్‌లో ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గండి మైసమ్మ మండలం దుండిగల్ గ్రామంలోని ప్రభుత్వ సీలింగ్ భూములు సర్వే నెంబర్ 182, 284, 321, 322, 323, 324, 325, 330 నుంచి 335, 345, 358 నుంచి 362 వరకు, 423 నుంచి 426 వరకు మొత్తం 106.07 ఎకరాల్లో ప్రభుత్వ, ప్రయివేటు భూముల మార్పిడి జరిగిందని తెలిపారు. రియల్ ఎస్టేట్ దందాతో రూ.కోట్ల కుంభకోణం జరిగిందని తెలిపారు. ఈ ప్రభుత్వ, సీలింగ్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనకూలంగా విలువైన భూములను ప్రయివేటు వ్యక్తులకు ఇచ్చి పనికి రాని భూములను ప్రభుత్వ భూములుగా మార్పిడి చేసినట్టు పేర్కొన్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రూ.కోట్ల లాభం రాగా.. ప్రభుత్వానికి తీరని నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ప్రయివేటు వ్యక్తులకు అనుకూలంగా మార్చడం చట్ట వ్యతిరేకం అన్నారు. ప్రభుత్వం వెంటనే భూములను రక్షించి, యధాతథ స్థితిని కొనసాగించాలని కోరారు.

మూడుచింతలపల్లిలో డీఎల్‌పీవో సాంభిరెడ్డి పర్యటన



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండల కేంద్రంలో శుక్రవారం డీఎల్‌పీవో సాంభిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మూడుచింతలపల్లి గ్రామపంచాయతీలో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, వైకుంఠధామం డంపింగ్ యార్డు, క్రికెట్ గ్రౌండ్‌ను పరిశీలించారు. అధికారులు విధులు సక్రమంగా నిర్వహిం చాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో సునీత, సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, తదితరులున్నారు.

లాస్య నందితకు బీఆర్ఎస్ నాయకుల నివాళ్లు



నవతెలంగాణ-కీసర

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో నాగారం మున్సిపాలిటీలోని రాంపల్లి గ్రామంలో ఆమె చిత్ర పటానికి బీఆర్ఎస్ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎలిజాల నగేష్‌గౌడ్ , నాయకులు గండి అంజయ్య గౌడ్, మచ్చ శ్రీనివాస్ గౌడ్, అరిగే రాములు, ఎల్లమయ్య, బందెలా పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



- టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్
- పీర్జాదిగూడ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగ కనకదుర్గ నియామకం

నవతెలంగాణ-బోడుప్పల్

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఒక ప్రతీ కార్యకర్త కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం పీర్జాదిగూడ కార్పొరేషన్‌కు చెందిన ఎస్.కే.దుర్గాను పీర్జాదిగూడ కార్పొరేషన్ కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా నియమించారు. కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అధ్వర్యంలో నియామకపు పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. కార్యకర్తలు వచ్చే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాగకనక దుర్గ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పీర్జాదిగూడ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్‌ను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడంలో అందరూ కలిసి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా చైర్మెన్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పన్నాల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బద్రు శ్రీలత నాయక్, అలుగువెళ్ల సుదర్శన్‌రెడ్డి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టాన్ని వినియోగించుకోవాలి



- ఎంసీపల్లి ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు హనుమంతరెడ్డి
- ఉపాధిహామీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రజలు ఉపాధిహామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని మూడుచింతలపల్లి మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు హనుమంతరెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండల పరిధిలోని కేశవరం గ్రామంలో ఉన్న నల్లకుంట చెరువులో శుక్రవారం ఉపాధిహామీ కూలీలతో కలిసి ఎంజీఎన్ఆర్‌ఈజీఎస్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని వ్యవసాయ కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంజీఎన్ఆర్‌ఈజీఎస్ పథకం అమలు చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా ఒక రోజుకు రూ.270 వేతనం చెల్లిస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జాబ్ కార్డు తీసుకుని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, వాటర్‌మెన్ రాజు, మహిళా కూలీలు పాల్గొన్నారు.

మంచి నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి



- దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మెన్ ప్రణీత శ్రీకాంత్‌గౌడ్

నవతెలంగాణ-కీసర

మంచి నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మెన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ఆర్‌జీకే కాలనీ 1వ వార్డులో రూ.20లక్షలతో వాటర్ ట్యాంక్ మరమ్మతు పనులకు చైర్ పర్సన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు మంచి నీటి సమస్య రాకుండా చూసేందుకు వాటర్ ట్యాంక్‌కు మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రాజ మల్లయ్య, డీఈ చిరంజీవులు, మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు కౌకుట్ల తిరుపతిరెడ్డి , కౌన్సిలర్ భూక్యనాను నాయక్, 2వ వార్డు కౌన్సిలర్ సుజాత శ్రీనివాస్, ఒకటో వార్డు అధ్యక్షులు రాజేష్, యూత్ ఉపాధ్యక్షుడు సందీప్, మజీద్ దశరథ్, మహేష్, ఈశ్వర్, శ్రీనివాస్‌చారి, వార్డు మైనార్టీ అధ్యక్షుడు అన్సారీ, శ్రీకాంత్ తదితులున్నారు.

ఐదేండ్లలోపు వారికి పోలియో చుక్కలు వేయించాలి: నాగారం మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-కీసర

ఐదేండ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం పురపాలక సంఘం కార్యాలయంలో పల్స్ పోలియో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్చి 3వ తేదీన బూత్ స్థాయిలో పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. 4వ తేదీ నుంచి 6 తేదీ వరకు ఇంటి ఇంటికీ వెళ్లి ఆశా వర్కర్లు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. మురికివాడలు, సంచార జాతులు, ఇటుక బట్టీలు, నిర్మాణ స్థలాల్లో నివసిస్తున్న ప్రాంతాల్లో పల్స్ పోలియో బూతులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. రాజేందర్ కుమార్, వికాస్ నగర్ బస్తీ దవాఖాన డాక్టర్ కుమార్, రాంపల్లి బస్తీ దవాఖాన డాక్టర్ సింధూజ, మున్సిపల్ మేనేజర్ కే. చంద్రశేఖర్, రంగనాయకమ్మ, ఆశావర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఈనెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు నిర్వాహణ
- 139 సెంటర్లు, 1,31,460 మంది విద్యార్థులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 28వ తేదీన నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఇప్పటికే విద్య, వైద్య, ఆరోగ్య, పోలీస్, విద్యుత్, పోస్టల్, ఆర్టీసీ శాఖల అధికారులతో రెండు రోజుల క్రితమే జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం 139 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,31,460 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ నెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులను గంట ముందే ఎగ్జామినేషన్ హాల్‌లోకి పంపుతామని ఇంటర్ బోర్డు ప్రకటించింది. నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించే ప్రసక్తే లేదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు చెప్పారు. ఇప్పటికే అన్ని రకాల పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

జిల్లాలో ఏర్పాట్లు పూర్తి..

పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, ఫర్నీచర్ ఏర్పాటు చేసినట్టు ఇంటర్మీడియట్ అధికారి కిషన్ తెలిపారు. లైటింగ్, ఫ్యాన్స్, టాయిలెట్స్ వంటి అవసరమైన వసతులను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున, పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ షాపులు మూసేయనున్నారు. పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు. నిరంతర పర్యవేక్షణకు నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్, నలుగురు సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశారు.

పరీక్షలకు హాజరు ఇలా..

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 65,965 మంది, ద్వితీయ సంవత్సరంలో 65,495 మందితో కలిపి మొత్తం 1,31,460 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కాగా ఇప్పటి వరకు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోని విద్యార్థులు నేరుగా ఇంటర్మీడియట్ వెబ్ సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు కంట్రోల్ రూమ్ నెంబర్‌ను సైతం ఏర్పాటు చేశారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

జి.కిషన్, డీఐఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

ఇంటర్మీడియట్ పరీక్షలు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేస్తున్నాం. పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థి సమయం కంటే ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌ను అనుమతించం. నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత మైండ్‌తో పరీక్షలు రాయాలి.

మా భూమిలో డంపింగ్ యార్డు ఎత్తేయాలి

- చెత్త వాహనాలను అడ్డుకున్న యన్నంపేట యువకులు
- నోటీసులు జారీ చేసిన మున్సిపల్ కమిషనర్



నవతెలంగాణ-ఘట్కేసర్

మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ సర్వే నెంబర్ 137, 138 లో చెత్త డంపింగ్ చేస్తున్న భూమి తమదేనని, ఇక్కడ చెత్త డంపింగ్ చేయొద్దని యంనంపేట గ్రామానికి చెందిన కొందరు యువకులు శుక్రవారం అడ్డుకున్నారు. డంపింగ్ యార్డ్ వద్ద టెంట్ వేసుకొని చెత్త డంప్ చేసే వాహనాలను రానీయకుండా అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోచారం మున్సిపల్ కమిషనర్ వేమనరెడ్డి ఆందోళన చేస్తున్న యువకులను పిలిపించుకొని నోటీసులు అందజేశారు. వివాదాన్ని పెద్దది చేసుకోవద్దని సూచించారు. వివరాల్లోకి వెళితే.. 1979లో పోచారం మున్సిపాలిటీ యన్నంపేటలో సర్వే నెంబర్ 137, 138 లోని దాదాపు 28 ఎకరాల్లో లేఔట్ చేశారు. ఈ లేఔట్‌లో 2.27 ఎకరాల భూమిని ఓపెన్ స్పేస్‌గా, దాదాపు వెయ్యి గజాలు ఇతర అవసరాల కోసం కేటాయిం చారు. అయితే పోచారం మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత మున్సిపాలిటీ పరిధిలోని చెత్తాచెదారాన్ని డంప్ చేయడాని కి ఇస్మాయిల్ ఖాన్ గూడలోని సర్వేనెంబర్ 46/1లో ఎకరం స్థలం కేటాయించారు. ఆ స్థలంలోకి వెళ్లడానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో సర్వేనెంబర్ 137, 138లో లేఅవుట్‌లోని ఓపెన్ స్థలం 2.27 ఎకరాలు వాడు కుంటున్నారు. అయితే గురువారం పోచారం మున్సిపాలిట "లో చెత్త డంపింగ్ యార్డ్ నిర్వహణకు రూ.85 లక్షలు కేటాయిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ విషయం తెలుసుకున్న యమనంపేటకు చెందిన రాజేందర్ గౌడ్, మరికొందరు యువకులు చెత్త డంపింగ్ కేంద్రానికి వెళ్లి వాహనాలను అడ్డుకున్నారు. 2020 సంవత్సరంలో సర్వేనెంబర్ 137, 138లో చేసిన లేఔట్‌లో యజమాను లు ఓపెన్ స్పేస్‌గా వదిలేసిన 2.27 ఎకరాల భూమిని తాము కొనుగోలు చేసి రిజిస్టర్ (3864/2020) చేసుకు న్నామని తెలిపారు. గతంలో ఈ స్థలంలో చెత్త డంపింగ్ చేసి తాత్కాలికంగా వాడుకుంటామని చెప్పిన మున్సిపల్ అధికారులు ఈ స్థలాన్ని పూర్తిస్థాయిలో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నార ని ఆరోపించారు. ప్రయివేటు స్థలంలో డంపింగ్ యార్డ్ అభివృద్ధి కోసం మున్సిపల్ నిధులు రూ.85 లక్షలు కేటాయించడం ఇందుకు నిదర్శనం అన్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా నిజాలు తెలుసుకొని వ్యవహరించాలని కోరారు.

ఇది ముమ్మాటికీ మున్సిపల్ భూమి : చైర్మెన్ కొండల్‌రెడ్డి



యన్నంపేటలో సర్వేనెంబర్ 137, 138లో లేఔట్‌లోని ఓపెన్ స్థలాన్ని యంనంపేట గ్రామపంచాయతీ వారు మున్సిపాలిటీకి అప్పగించారు. ఈ భూమి ని చెత్త డంపింగ్ కోసం ఐదేండ్లుగా వాడుతున్నాం. వారానికి 100 టన్నుల చెత్త ఇక్కడి నుంచి జవహర్ నగర్ కు తరలిస్తున్నాం. ఇదిలా ఉంటు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఇటీవల డంపింగ్ యార్డ్‌ను సందర్శిం చి నోటీసులు జారీ చేశారు. చెత్త తగలబెట్టి వాతావరణం కాలుష్యం చేస్తున్నారని వెంటనే చెత్తను ఇక్కడి నుంచి తరలించే విధంగా చర్యలు చేపట్టాలని హెచ్చరించా రు. దీంతో మున్సిపల్‌లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి చెత్త వాహనాల ద్వారా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌కు తరలించడానికి, ఇతర అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ.85 లక్షల 75వేలు 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఏ ఒక్కరి స్థలాన్ని ఆక్రమించడం లేదు. ఇది ముమ్మాటికి మున్సిపాలిటీ చెందిన భూమి. న్యాయం కావాలంటే కోర్టును ఆశ్రయించండి.

నోటీసులు జారీ చేశాం : కమిషనర్ వేమనరెడ్డి



పోచారం మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు స్థలాన్ని తమదే అంటూ ఆందోళన దిగిన యువకులకు నోటీసులు జారీ చేశాం. మున్సిపల్ పరిధిలో సేకరిస్తున్న చెత్తను డంప్ చేయడానికి సర్వే నెంబర్ 46/1 లో ఎకరం స్థలం ఉంది. కానీ ఆ భూమికి చేరుకోడానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఈ రెండు ఎకరాల స్థలాన్ని వాడుకుంటున్నాం. భూమి విషయం ఏదైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలని బాధితులకు సూచించాను.

ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి



- పార్కులు అందుబాటులోకి తెస్తాం
- ఆకుపచ్చ జవహర్ నగరే లక్ష్యం
- మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి

నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రజలందరూ ఇంటి పన్ను సకాలంలో చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి కోరారు. శుక్రవారం జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఇంటి పన్ను వసూలుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆయా కాలనీల్లో పర్యటించారు. అనంతరం కాలనీ ప్రజలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి, కార్పొరేషన్, పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం కార్పొరేషన్‌లోని నర్సరీలను సందర్శించి, వాటి అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఆకుపచ్చ జవహర్ నగర్ తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, ఎన్విరానమెంట్ ఇంజనీర్ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ వాసుల సొంత నిధులతో డ్రయినేజీ పనులు



- ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్

నవతెలంగాణ-జవహర్‌నగర్

కాలనీవాసులు సొంతంగా సమకూర్చుకున్న నిధులతో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 21 డివిజన్ పరిధిలోని జయశంకర్ కాలనీలో 150 మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను డివిజన్ కార్పొరేటర్ చింతల ప్రేమల శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు గుండ్ల నాగేష్, డివిజన్ బీసీ సెల్ అధ్యక్షులు కృష్ణ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ చారి, సీనియర్ నాయకులు ముకుందం, విష్ణు, పుల్లయ్య చారి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క సారమ్మలను దర్శించుకున్న మల్లారెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

ఆసియా ఖండంలో అతిపెద్ద ఆదివాసి జాతరగా పిలువబడే సమ్మక్క సారలమ్మ జాతరకు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి శుక్రవారం వెళ్లారు. ఈ సందర్భంగా సమ్మక్క సారలమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఘట్‌కేసర్ మాజీ జెడ్పీటీసీ మంద సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా రుక్మిణీ, సత్యభామ, వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం



నవతెలంగాణ-ఘట్కేసర్

మండల పరిధిలోని ఎదులాబాద్‌లో ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంపై రుక్మిణీ, సత్యభామ, శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ ధర్మకర్తలు అంబారిపేట వంశస్తులు అమ్మవార్లకు, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణంలో భాగంగా వేదపండితులు స్వామివారి కల్యాణ ఘట్టాలను భక్తులకు వివరించారు. భక్తులు అమ్మవార్లకు, స్వామివారికి జిలకర బెల్లం సమర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య రుక్మిణీ సత్యభామ శ్రీ వేణుగోపాలస్వామి వార్లకు మాంగల్యాధారణ జరిపించారు. భక్తులు ఒడిబియ్యం, కట్నకానుకలు, పూలు, పండ్లు సమర్పించారు. అంతకు ముందు మహిళలు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంబారిపేట అప్పాలాచార్యులు, రాం ప్రసాద్, వరదరాజులు, ఎ.వీ.ఎస్.ఎన్ చార్యులు, టీపీ లక్ష్మణాచార్యులు, పురుషోతా మాచార్యులు, సేనామాచార్యులు, అచ్యుతాచర్యులు, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి ఎంపీటీసీ రవి, కొండల విద్యాసాగర్రెడ్డి, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం రైల్వే గేటు వద్ద భారీగా ట్రాఫిక్

- ఇబ్బందుల్లో వాహనదారులు



నవతెలంగాణ-అల్వాల్

బొల్లారం రైల్వే గేటు వద్ద ప్రతీరోజు ఉదయం, సాయంత్రం భారీగా ట్రాఫిక్‌జామ్ అవుతోంది. వాహనాల రద్దీతో గేటుకు రెండు వైపులా దాదాపు 2 కిలోమీటర్ల వరకు వాహనాలు నిలుస్తున్నాయి. దీంతో ఉదయం పనులకు, ఆఫీసులకు వెళ్లే వాళ్లు సమయానికి పనులకు చేరుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ రైల్వే గేటుకు అండర్ గ్రౌండ్ బ్రిడ్జి మంజూరు అయినప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిమ్మకు నేరేతినట్టు వ్యవహరిస్తూ స్పందించకపోవడంతో బ్రిడ్జి పనులు ప్రారంభం కాలేదు. దీంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. బ్రిడ్జిని నిర్మిస్తే ప్రజలకు రెండు గంటల సమయం కలిసి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులు చేయకపోవడంతో చాలామంది తమ తమ పనులు సమయానికి వెళ్లడం లేదు. గత ప్రభుత్వ వైఫల్యాలే ఈ ట్రాఫిక్ జామ్‌కు ప్రధాన కారణం అని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం బ్రిడ్జిని నిర్మించి సమస్యను తీర్చాలని కోరుకుంటున్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు



- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- 'రాంచ్యాడ్' పై ఎంటర్ ప్రీమియర్ అవగాహన సదస్సు

నవతెలంగాణ-జవహర్‌నగర్

దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యా నాయుడు అన్నారు. జవహర్ నగర్ పరిధిలోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో శుక్రవారం 'రాంచ్యాడ్'పై ఎంటర్ ప్రీమియర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. పారిశ్రామిక, వాణిజ్యం రంగంలోకి అడుగు పెట్టలనుకుంటున్న యువత కొత్త ఆలోచనలతో ముందుకు రావాలన్నారు. భారతదేశం భిన్న మతాలకు నిలయమని, భిన్నత్వంలో ఏకత్వం భారతదేశానికే సాధ్యమని తెలిపారు. మన దేశాన్ని ఇతర దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో భారతదేశం నుంచే పెద్ద పెద్ద కంపెనీలకు సీఈవోలుగా నిలుస్తున్నారని చెప్పారు. విద్యార్థులు మార్పునకు పునాదిగా మారాలని, కొత్త నాయకత్వం పుట్టుకొస్తేనే దేశం మరో వందేండ్లు ముందుకు సాగుతుందన్నారు. ప్రతిభ, నైపుణ్యంతోనే దేశాన్ని మార్చగలుగుతామని పేర్కొన్నారు. చదువు కేవలం విజ్ఞనం కోసమే కాదని, మంచి నడవడిక, విలువలు, సమాజం పట్ల బాధ్యత పెంచే సాధనంగా మారుతుందని తెలిపారు. సెల్ ఫోన్లకు బానిసలు కాకుండా విజ్ఞానంతో అజ్ఞానాన్ని తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిట్స్ పిలానీ క్యాంపస్ మాజీ డైరెక్టర్ సుందర్, క్యాంపస్ అధికారులు యోగేశ్వరీ, బిట్స్ పిలానీ సిబ్బంది, 1000 మంది పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం అధికారులమంటూ బంగారం చోరీ

నవతెలంగాణ-ఉప్పల్

డబుల్ బెడ్రూం అధికారులమంటూ ఉప్పల్ పీఎస్ పరిధిలోని హనుమ సాయి నగర్‌లో రమాదేవి(62) అనే మహిళ మెడలోని ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు దుండగులు దోచుకెళ్లారు. ఈ ఘటన మూడురోజుల క్రితం జరుగగా శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. డబుల్ బెడ్రూం కేటాయించే అధికారులమని చెప్పి ఇద్దరు వ్యక్తులు కారులో రమాదేవిని తీసుకెళ్లారు. కొద్ది దూరం వెళ్లాక మారణ ఆయుధాలతో భయపెట్టి పుస్తెల తాడు, చేవి కమ్మలు, చేతి రింగ్ ఎత్తుకెళ్లారు. ఈ మేరకు రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే లాస్య మృతి దిగ్భ్రాంతికి గురి చేసింది

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన మాటాడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న లాస్య నందిత ఇలా రోడ్డు ప్రమాదంలో మతి చెందడం నిజంగా ఇప్పటికీ నమ్మశక్యంగా లేదన్నారు. ఆమె తండ్రి సాయన్న మరణం మరువకముందే ఆ కుటుంబంలో ఇలా జరగడం చాలా బాధాకరమన్నారు. సాయన్న కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. ఎంతో సౌమ్యంగా అందరినీ అన్నా అంటూ పలకరిస్తూ చిరునవ్వులు చిందిస్తూ కండ్ల ముందు కనిపించే లాస్య నందిత ఇక లేదు అన్న వార్త జీర్ణించుకోలేకపోతున్నామని చెప్పారు. భగవంతుడు ఆ కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాని తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-చేవెళ్ల

చేవెళ్ల, ముడిమ్యాల్ సహకార సంఘం చైర్మన్లు దేవర వెంకటరెడ్డి, గోనె ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ జూలూరి పాండు గౌడ్ తన 200 మంది ముఖ్య అనుచరులతో కలిసి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వెంట కుమ్మెర గ్రామ మాజీ ఉప సర్పంచ్, బీజేపీ సీనియర్ నాయకులు కావలి శంకర్ యాదవ్, వారితో పాటు నాయకులు బోనగిరి దర్శన్, బైండ్ల జంగయ్య, మాజీ వార్డు సభ్యులు కుమార్, హుస్సేన్, వెంకటస్వామిలు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీం భరత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి ఎలా వచ్చిందో అలాగనే మరి కొన్ని రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ గెలుస్తుందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే రెండు గ్యారెంటీలను అమలు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, చేవెళ్ల సహకార సంఘం డైరెక్టర్ పైండ్ల మధుసూదన్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు సూర్యాపేట శ్రీనివాస్ గౌడ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నియంతృత్వ మోడీ ప్రభుత్వం గద్దె దిగాలి

- సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్
- పలు ప్రాంతాల్లో నిరసనలు



నవతెలంగాణ-దుండిగల్

భారత రైతాంగం న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సాగిస్తున్న పోరాటంపై మోడీ ప్రభుత్వం యుద్ధాన్ని తలపించే విధంగా, శత్రుసంహారం చేస్తున్న రీతిగా యువరైతును హతమార్చిందని.. నియంతృత్వ మోడీ ప్రభుత్వం గద్దె దిగాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ సీఐటీయూ ఆటో స్టాండ్ వద్ద సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంజాబ్ రాష్ట్రం బటిం డా జిల్లాలోని బాలస్ గ్రామానికి చెందిన 24 సంవత్సరాల యువరైతు శుభకరన్ సింగ్ మరణించాడని తెలిపారు. ఈ ఘటనకు కారణమైన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా హర్యానా సీఎం బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు . రైతులను హత్య చేసి గాయపరిచినందుకు ఈ ఘటనకు కారణమైన పోలీస్ సిబ్బంది వారందరి పై సెక్షన్ 302 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి వెంటనే వారందరిని సస్పెండ్ చేయాలన్నారు. ఈ పోరాటంలో అమరుడైన యువ రైతు శుభకరన్ సింగ్ కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భాలలో పోలీసులు జరిపిన కాల్పులు అనేక దుర్ఘటనలు రైతులపై చేయడం జరిగిందని.. వాటి వల్ల సుమారు 100 ట్రాక్టర్లకు ప్రభుత్వమే మరమ్మతులు చేయించాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎన్. బాలాపీరు రైతు సంఘం నాయకులు బ్రహ్మానందం, కృష్ణ రావు, మరియు సిఐటియు ఆటో యూనియన్ నాయకులు మహేష్ రెడ్డి బాబు నాయక్ వెంకటేష్ ప్రకాష్ సంజీవ్ ఇర్ఫాన్ శ్రీను నరసింహ లంబు అక్తర్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు

కుత్బుల్లాపూర్ : హర్యానా, పంజాబ్ సరిహద్దుల్లో రైతులపై హర్యానాకు చెందిన పోలీసులు జరిపిన దాడిని ఖండిస్తున్నామని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం షాపూర్ నగర్ సీఐటీయూ కార్యాలయం దగ్గర నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ కేంద్రంగా సాగిన చారిత్రాత్మకమైన రైతంగ పోరాటంలో మరణించిన 750 మంది రైతు కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై అమానుషంగా కాల్పులు చేయడం మోడీ ప్రభుత్వ ,కార్పొరేట్, మతతత్వ విధానాలకు నిదర్శన మనీ అన్నారు. రైతులపై హర్యానా పోలీసులు జరిపిన కాల్పులను ఖండించవలసిందిగా ప్రజలను, ప్రజాస్వామిక వాదులను మేధావులను కోరుతున్నామన్నారు. రైతుల డిమాండ్స్ పరిష్కా రం కాకపోతే రైతులకు అండగా కార్మిక వర్గం ఉంటుందని తెలియజేశారు.





సీఐటీయూ నాయకులు దేవదానం, శ్రీనివాస్ తిమ్మప్ప, వీరేష్, భాష నర్సింలు, సాధులు మల్లారెడ్డి, కరుణాకర్, సురేష్, మహిళా సంఘం కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షురాలు రావుల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ : పోరాటంలో అమరుడైన యువ రైతు శుభం సింగ్ కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ కూకట్ పల్లి మండల కార్యదర్శి కృష్ణా నాయక్ డిమాండ్ చేశారు. కూకట్ పల్లి మండల సీఐటీయూ, గిరిజన సంఘాలు బ్లాక్ డే నిర్వహించారు. శుభకరన్ సింగ్ మృతి పట్ల ఎస్కెఎం, జాయిం ట్ ప్లాట్ ఫాం ఆఫ్ సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశాయి. రైతులపై దాడులను వెంటనే మానుకొని వెంటనే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నాయకులు చిరంజీవి, మండల అధ్యక్షులు గోపాల్, నాయకులు భాషా, బొజ్జ లక్ష్మణ్, సీఐటీయూ మండల నాయకులు రాములు, గణేష్ , తదితరులు పాల్గొన్నారు.



రైతన్నలకు ఆసరాగా కాంగ్రెస్ నిలుస్తుంది

నవతెలంగాణ-బాలానగర్

రైతన్నలకు ఆసరాగా కాంగ్రెస్ నిలుస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ మళ్ళీ రైతులు ఉద్యమం చేస్తున్నారని, రైతు వ్యతిరేక ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వమని, గతంలో కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న నిరంకుశ మోడీ ప్రభుత్వం ఉత్తర్ ప్రదేశ్ లో అధికార మదంతో రైతులని కారుతో తొక్కించి అనేక మంది రైతులు ప్రాణాలు కోల్పోవడానికి కారణమయిందన్నారు. మోడీ ప్రజా వ్యతిరేకంగా పాలన చేస్తున్నారని, ప్రజలు తిరగబడే రోజులు వస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు భవానీ రెడ్డి, వచన్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నాలాలను, చెరువుల కబ్జాలను ఉపేక్షించేది లేదు

- కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నాలాలను, చెరువుల కబ్జాలను ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్ అధికారులను హెచ్చరించారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలాజినగర్ డివిజన్ రంగాధముని చెరువు నాలను రంగాధముని చెరువు నాలాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గంలోని చెరువులు కబ్జాకు గురై అన్యాక్రాంతమవుతున్నాయని, గత పాలకుల నిర్లక్ష్యం, అధికారుల నిర్లక్ష్యం వల్ల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ లలో, నాలాలను కబ్జా చేయడం వలన వర్షాకాలం వచ్చినప్పుడు వరదలు రావడంతో ఇండ్లలోకి నిరుచేరి ప్రజలు అష్టకష్టాలు పడుతారన్నారు. కూకట్ పల్లి లోని రంగాధముని చెరువు నాలాను ఎన్ఫోర్స్మెంట్, జీహెచ్ఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సమక్షంలో పరిశీలించగా అక్కడి నాల శాశ్వత ప్రవాహం నుండి మళ్లించి కొంతమంది బడా వ్యక్తులు, ఏమీ స్వాన్ లేక్ బిల్డర్స్ నాలపై శాశ్వత కట్టడాలను నిర్మించి కబ్జా చేసారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గం నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, ఏ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు కష్ణ రాజపుట్, శేరి సతీష్ రెడ్డి, కే దినేష్ కుమార్, సాదు ప్రతాప్ రెడ్డి, రఘు, సునీల్ యాదవ్, మేకల రమేష్, కుక్కల రమేష్, చూను పాష, నయీమ్, అల్లావుద్దీన్, ఖాజా, అమీర్, మోసిన్, జీషన్, ఇరఫన్,మొహమ్మద్ అక్బర్,మహిళా నాయకురాళ్లు, పుష్పా రెడ్డి, రేష్మ, కష్ణవేణి, జ్యోతి, కల్పనా తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కత్తుల దుర్గయ్య జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సీపీఐ కుత్బుల్లాపూర్ సీనియర్ నాయకులు, కాటికాపరి,బ్యాగరి సంఘం రాష్ట్ర నాయకులు, కత్తుల దుర్గయ్య జన్మదిన వేడుకలు శుక్రవారం జగద్గిరిగుట్ట బస్ స్టాప్ లో సీపీఐ నాయకులు జర్నలిస్టుల,దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించి దుర్గయ్యకు వారు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల సమస్యల పట్ల నిరంతరం పోరాటాలు చేసే నాయకుడని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు,దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.ఏసురత్నం, ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు వి.హరినాధరావు చర్లపల్లి రాములు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు ఆకుబత్తిని ప్రవీణ్, జర్నలిస్టులు దప్పు రామస్వామి,జోగు వెంకట్, స్థానిక నాయకులు కొంగరి శోభన్ బాబు,దుదిగే రాములు, రాజంపేట నవీన్, జి.మల్లేష్, కర్నాటి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



విజయ సంకల్ప యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి రూరల్ జిల్లా అధ్యక్షులు పటోళ్ల విక్రంరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా ప్రెస్ క్లబ్‌లో విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. మల్కాజిగిరి సెగ్మెంట్ పరిధిలో ఉన్న 7 లక్షల మంది నార్త్ ఇండియన్స్‌తో త్వరంలో మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర ఎల్బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి మీదుగా జవహం నగర్ రూరల్ జిల్లాలోని వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో దమ్మాయిగూడ చౌరస్తాలో సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. అసెంబ్లీ ఫలితాలు తమకు నిరాశాజనకంగా అనిపించినా.. ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘటకేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి బీజేపీ ఏం చేసింది అనే విషయాలతోపాటు పలు అభివృద్ధి పనుల గురించి ఈ యాత్రలో వివరించనున్నట్టు తెలిపారు. 370 ఆర్టికల్, రామ మందిరం వంటి పనులతోపాటు సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అందరికీ అందేలా చూసిన విషయాలను ఈ యాత్ర నేపథ్యంలో వివరించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అచ్చిని నర్సింహ, మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమలరెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కరించాలి

- ఎమ్మెల్యే ఆరికేపూడి గాంధీ

నవతెలంగాణ - కూకట్ పల్లి

ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రచించాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని, వివేకానంద నగర్ కాలనీ ,సప్త గిరి కాలనీ, భాష్యం స్కూల్ వద్ద ,సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ , నవోదయ కాలనీ లలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారాని కై తీసుకోవాల్సిన చర్యల పై ఎమ్మెల్యే కార్యాలయంలో కూకట్ పల్లి ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు, కాలనీ వాసులతో ఎమ్మెల్యే శుక్రవారం చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహనాల రద్దీ వలన ఉదయం పూట ,సాయంత్రం పూట రహదారులు నిత్యం రద్దీగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని తెలిపారు, విద్యార్థులు,ఉద్యోగులు,ప్రజలు ట్రాఫిక్ వలన నరకయాతన అనుభవిస్తున్నారని చెప్పారు. గంటల కొద్దీ రోడ్డు పైన ట్రాఫిక్ జామ్‌లో ఉండాల్సి వస్తున్నదని, ట్రాఫిక్ సమస్య కు వెంటనే పరిష్కారం చూపాలని,ప్రత్యామ్నాయ మార్గాల పై దృష్టి పెట్టి, ప్రజలకు సాంత్వన చేకూరేల అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్ పైన అవగాహన కల్పించాలని సూచించారు.



అదేవిధంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ ,నవోదయ కాలనీ లలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. అవసరం ఉన్న చోట విభాగిణి లు ఏర్పాటు చేయాలని, రోడ్డు మళ్లింపు చర్యలను తీసుకోవాలని, రోడ్డు దాటే వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి , ప్రజలకు సుఖవంతమైన, ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని, కాలనీ వాసులు కూడా సహకరించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు సంజీవ రెడ్డి, పలు కాలనీ వాసులు శర్మ మల్లయ్య ,హర్ష ,రాజీ రెడ్డి, ప్రవీణ్, శివ శంకర్, మదన్ ,సత్యనారాయణ, అల్లురయ్య, స్వరూపనంద్, శ్యామ్ కుమార్, హేమ చందర్, వినోభా,ప్రభాకర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రణాళికతో చేపట్టాలి

- హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివృద్ధి పనులు ప్రణాళికతో, నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. డివిజన్ పరిధిలోని కిందికుంట చెరువు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను ఇరిగేషన్ అధికారులతో కలిసి శుక్రవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఒకప్పుడు రాళ్ళు, రప్పలతో మురికి కూపం లాగా ఉన్న కిందికుంట చెరువుకు మహర్దశ వచ్చిందన్నారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. చెరువు కట్ట పటిష్టం పరిచేలా పునరుద్ధరణ, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం, పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతున్నామన్నారు. చెరువు సంరక్షణ లో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం , చెరువు అలుగు నిర్మాణము, చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. వర్షాకాలాన్ని దష్టిలో ఉంచుకొని చెరువు సుందరీకరణ, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు. త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ విశ్వం, వర్క్ ఇన్స్పెక్టర్ రతన్ నాయక్, కాంట్రాక్టర్ నాగి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నర్సింహారెడ్డి కళాశాలలో మైక్రోసాఫ్ట్ అజుర్‌పై ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడ లోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీటి సహకారంతో కంప్యూటర్ సైన్స్ విభాగం వారు మైక్రోసాఫ్ట్ అజుర్‌పై ఐదు రోజుల ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల నుండి పలువురు నిపుణులు హాజరయ్యి, మైక్రోసాఫ్ట్ అజుర్ లోని పలు అంశాల పై అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల అధ్యపకులు వారి నైపుణ్యాన్ని మరింత మెరుగుపర్చుకోవచ్చని, తద్వారా విద్యార్థుల్ని మరింత సాంకేతికంగా ముందుకు తీసుకువెళ్లగలరని కళాశాల కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి తెలిపారు. అలాగే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని, వాటికి తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి డా. శోభన్ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ జె. నర్సింహారెడ్డి, కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి , కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.లోకనాథం,పలు విభాగాధిపతులు, వివిధ కళాశాల నుండి అధ్యాపకులు పాల్గొన్నారు.



గోల్డెన్ గ్లోబల్‌తో సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల ఒప్పందం



నవతెలంగాణ-హైదరాబాద్

దూలపల్లి లోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కాలేజ్ అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులలో నైపుణ్యం పెంపొందిస్తూ అకడమిక్ ఎక్సలెన్స్‌ని సాధించిందని కళాశాల యాజమాన్యం శుక్రవారం తెలిపింది. సెయింట్ మార్టిన్స్ ఇంజనీరింగ్ కళాశాల , సదరన్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, సిడ్నీ, ఆస్ట్రేలియా మధ్య సహకారం వత్తిపరమైన సామర్థ్యాలను సమన్వయం చేయడం కోసం ప్రొఫెసర్ గ్రూప్ డైరెక్టర్ డా.పి.సంతోష్ కుమార్ పాత్ర కీలకమని తెలిపారు. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న తమ కళాశాల ఎదురుచూస్తున్న కళ ఉన్నత విద్య, సిడ్నీ, ఆస్ట్రేలియా కెపాసిటీ బిల్డింగ్, ఎడ్యుకేషన్, రీసెర్చ్ కన్సల్టింగ్ వైపు తమ కళాశాల సాంకేతిక విద్య చరిత్రలో ఎల్లప్పుడూ అగ్రస్థానంలో ఉందన్నారు, ఈ సహకారం సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాల అత్యంత ఎదురుచూస్తున్న ప్రపంచ గుర్తింపును చేరుకోవడానికి వీలు కల్పించింది. తమ టీమ్ ఈ అత్యుత్తమ అంతర్జాతీయ విజయాన్ని వైభవంగా జరుపుకుంటామన్నారు. ఈ జాయింట్ వెంచర్ తప్పనిసరిగా ప్రపంచవ్యాప్తంగా విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి మార్టినియన్లకు సహాయం చేస్తుంది, ఇది డా. జాన్, డీన్, ఇంటర్నేషనల్ కోలాబరేషన్, సదరన్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, సిడ్నీ, ఆస్ట్రేలియా బందంతో కలిసి అంతర్జాతీయ ప్రశంసలను పొందుతుందన్నారు. ఈ విజయానికి సహకరించిన వారందరికీ కళాశాల చైర్మెన్ ఎం లక్ష్మణ్ రెడ్డి , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి చంద్రశేఖర్ యాదవ్, డైరెక్టర్ జి. జై కిసాన్ యాదవ్ ప్రొఫెసర్ గ్రూప్ డైరెక్టర్ డా.పి.సంతోష్ కుమార్ పత్రా అందరికీ హదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

స్టార్మ్ వాటర్ డ్రైన్ పనుల పరిశీలన



నవతెలంగాణ - బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీన్ దయాల్ నగర్ లో రూ. 25 లక్షల వ్యయంతో చేపడుతున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ (వరద నీటి కాలువ) నిర్మాణ పనులను కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ శుక్రవారం కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తూ, స్టార్మ్ వాటర్ డ్రైన్ వంటి అభివద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, ప్రజలకు రానున్న వర్షకాలంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలనలో భాగంగా స్టార్మ్ వాటర్ డ్రైన్ లెవెల్స్ సరిలేనందున దారి మళ్ళించవలసిందిగా అధికారులు సూచించారు. దానికి అనుగుణంగా హనుమాన్ మందిర ప్రాంగణం నుంచి డ్రైన్ ను మళ్లించగా స్థానిక ప్రజలు అభ్యతరం వ్యక్తం చేయడంతో వారి వద్ద నుండి లిఖితపూర్వకం గా అభ్యంతర పత్రాన్ని స్వీకరించి పనులు ప్రస్తుతం నిలిపి వేస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీదేవి, ఏఈ పవన్, డివిజన్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దీన్ దయాళ్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ కాసుల మహేందర్, కాలనీ ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్ , సీ.సతీష్, కాసుల లక్ష్మణ్, రాజేష్, నాగరాజ్, కిట్టు యాదవ్, సాయి గౌడ్, ఈశ్వర్ గౌడ్, రమేష్, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా ఉంటా..

- ఎస్.పి.ఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు,టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేదలకు,పేద విద్యార్థులకు,నిరాధారణ గురైన అభాగ్యులకు అండగా ఉంటానని ఎస్.పి. ఆర్.ట్రస్ట్ వ్యవస్థాపకులు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్,సంహిత ఎంక్లేవ్ లో నివసిస్తున్న సత్యనారాయణ కుమార్తె సంస్కృత బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని తెలుసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం తన కుమార్తె హేమశ్రీ పుట్టినరోజు సందర్భంగా పుట్టినరోజుకు అయ్యే ఖర్చులు రూ.25,000, బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్నటువంటి సదరు సంస్కృతకు మానవతా దృక్పథంతో వైద్య ఖర్చుల నిమిత్తంఆమె నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.భవిష్యత్తులో కూడా తన అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు. నిరుత్సాహపడకుండా ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం'బి' బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సొంటిరెడ్డి చైతన్యరెడ్డి, సంఘ సేవకులు వెంకటరామిరెడ్డి,రాజారెడ్డి నారాయణరెడ్డి,పాల్గొన్నారు.



కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి

- కార్పొరేటర్ మహేందర్ కొడిచేర్ల

నవతెలంగాణ - కూకట్ పల్లి

మూసాపేట్ డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ మహేందర్ కొడిచెర్లకు, మంచి నీటి నల్లా లో కలుషిత నీరు వస్తుందని మూసాపేట్ గాంధీ బొమ్మ వద్ద కాలనీ వాసులు పలువురు ఫిర్యాదు చేయడంతో సమస్య ఉన్న ప్రాంతానికి వర్క్ ఇన్స్పెక్టర్ వినయ్ పిలిపించి ,స్థానికుల సమక్షం లో పొల్యూషన్ టెస్ట్ స్థానిక కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగు నీరు వచ్చేటప్పుడు ముందు 15 నిమిషాలు, నీళ్ళు ఏవిధంగా వస్తున్నాయో గమనించాలనీ కాలనీ వాసులకు తెలిపారు, ఏదైనా సమస్య ఉంటే తక్షణమే తనకు తెలియజేయాలని సూచించారు. పొల్యూషన్ వాటర్‌ను నియంత్రించాలని మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సివరేజ్ వర్క్ ఇన్స్పెక్టర్ వినయ్ కి సూచించారు. బీజేపీ నాయకులు వినోద్ కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ దంపతులకు వివాహ శుభాకాంక్షలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయశేఖర్ గౌడ్,ధనలక్ష్మి దంపతుల 30 వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం కొంపల్లి లోని ఆయన నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న సన్నిహితులు,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగదీష్ గౌడ్,సందడి శ్రీనివాస్ రెడ్డి,కృష్ణ కిషోర్,తిరుమలరెడ్డి అభిరామ్ గౌడ్ లు.



అంధులు మనోధైర్యంతో ముందుకు సాగాలి

● ఐఐసీడీ సంస్థ చైర్మెన్ డాక్టర్ ముబష్షిర్



నవతెలంగాణ-ధూల్‌పేట్

చీకటిని నిందిస్తూ కూర్చోకుండా అంధులు మనోధైర్యంతో ముందుకు సాగాలని ఐఐసీడీ (ఐడియల్ ఇన్ఫర్మేషన్ ఫర్ డిజేబుల్డ్) సంస్థ చైర్మెన్ డాక్టర్ ముబష్షిర్ అన్నారు. చాదర్ ఘాట్‌లోని ఐఐసీడీ స్కూల్‌లో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న అంధ విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లను అందించారు. ఆయన మాట్లాడుతూ.. అంధులు తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చన్నారు. చూపు లేకపోయినా పట్టుదలతో కంప్యూటర్ నేర్చుకున్న అంధ విద్యార్థులను ఆయన అభినందిం చారు. ఐఐసీడీ స్కూల్లో మూగ, చెవిటి, అంధ విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నామని నవీద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐసీడీ సెక్రటరి నవీదుర్రహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆఫరింగ్స్‌ను విస్తరించిన క్రెడిట్‌బీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ ఆన్‌లైన్ రుణ పరిష్కారాల ప్రదాత క్రెడిట్‌బీ, వ్యాపారాల కోసం రుణాలు ఇవ్వడంతోపాటు తమ ఉత్పత్తి శ్రేణిని వైవిధ్య పర్చనున్నట్టు ప్రకటించింది. స్వయం ఉపాధి కస్టమర్ల కోసం బ్రాండ్ రుణ సమర్పణ, దేశంలోని చిన్న సంస్థలకు తనఖా రహిత రుణాలను అందించడమే కాకుండా, ఆర్థిక సేవలు తగినంతగా లభించని కస్టమర్‌ల కోసం ఆర్థిక చేరికను పెంచడానికి దాని నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. క్రెడిట్‌బీ సహ వ్యవస్థాపకుడు అండ్ సీఈఓ మధుసూదన్ ఏకాంబరం మాట్లాడుతూ, 'స్వయం ఉపాధి వ్యాపారాలకు అవసరమైన రుణ సదుపాయంతో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సాధికారతను లక్ష్యంగా చేసుకున్నాం. స్వీయ ఉపాధి పొందుతున్న వ్యక్తులు, జీతాలు తీసుకునే కస్టమర్లు తరచుగా అధికారిక వనరుల నుంచి ఫైనాన్సింగ్‌ను యాక్సెస్ చేయడానికి కష్టపడతారు. సౌకర్యవంతమైన డిజిటల్ ప్రక్రియలు, అనుషంగిక రహిత రుణాల ద్వారా, మేం క్రెడిట్ అంతరాన్ని తగ్గించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని తెలిపారు.

గచ్చిబౌలి మాక్స్ హౌసింగ్ సొసైటీకి స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, గోపన్ పల్లిలోని ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాల పంపిణీలో జాప్యాన్ని నివారించి టీటీఎన్జీఓ గచ్చిబౌలి మాక్స్ హౌసింగ్ సొసైటీకి స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకం కొమురెల్లి, ప్రధాన కార్యదర్శి తూము అశోక్ రెడ్డి తదితరుల నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఉద్యమ సందర్భంగా ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో విస్మరించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడమే కాకుండా 1991లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను వెనక్కి తీసుకుని తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. ఈ విషయమై గత ప్రభుత్వంలో అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేదని, కేసిఆర్ ను కలిసేందుకు అవకాశమే ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యోగులు, పెన్షనర్లకు నమ్మకం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించి తమకు ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, తమకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జి. సూర్యకళ, ఎస్.వేణుగోపాల స్వామి, కె. యాదగిరి, కె.లక్ష్మణ్ రావు, డి.పవన్ కుమార్, ఝాన్సీ రాణి, ఝాన్సీ లక్ష్మీబాయి, రామ నాధచెట్టి, స్వర్ణకుమారి, జయసేనారెడ్డి, శ్రీదేవి, అబ్దుల్ సాదిక్, పి.కమలాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సోరియాసిస్‌కు ప్రధాన కారకాల్లో ఒకటి 'ఒత్తిడి'

● డెర్మాకాన్-2024 సదస్సులో వివరించిన వైద్యులు

నవతెలంగాణ-సిటీబ్యూరో



సోరియాసిస్‌కు ప్రధాన కారకాల్లో ఒత్తిడి కూడా ఒకటి అని పలువురు వైద్యులు తెలిపారు. డెర్మాకాన్-2024లో నిపుణులు పెరు గుతున్న ఒత్తిడి, సోరియా సిస్ చికిత్సపై దాని ప్రభావం గురించి ఆందోళనలను పంచుకున్నారు. రోజువారీ జీవన నాణ్యతను సోరియాసిస్ ప్రభావితం చేస్తుంది. ఇది కోలుకునే కాలాన్ని పొడిగిస్తుంది. నిపుణులు సోరియాసిస్ నిర్వహణ కోసం సకాలంలో జోక్యం, సరైన మందుల అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రఖ్యాత జాతీయ, అంతర్జాతీయ రుమటాలజిస్టులు, చర్మవ్యాధి నిపుణులు హైదరాబాద్‌లో జరిగిన డెర్మాకాన్-2024కి హాజరయ్యారు. చికిత్సల్లో ఇటీవలి కీలక పురోగతిని చర్చించారు. ముంబైకి చెందిన లిస్కిన్ సాగా డైరెక్టర్ డాక్టర్ అసీమ్ శర్మ మాట్లాడుతూ "పెరుగుతున్న ఒత్తిడి స్థాయిలు శ్వాసకోశ వ్యవస్థను మాత్రమే కాకుండా చర్మ సంబంధిత వ్యాధులను కూడా ప్రభావితం చేస్తున్నాయి. భావోద్వేగ, శారీరక, పర్యావరణ సోరియాసిస్‌కు కారకాలు కాగలవు. కొనసాగుతున్న చికిత్స, రోగి ఆరోగ్యం పై గణనీయంగా ప్రభావం చూపుతాయి' అని తెలిపారు. డాక్టర్ ఎస్.కిరణ్, కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్, కిరణ్ అడ్వాన్స్ డ్ స్కిన్ హెయిర్ అండ్ లేజర్ క్లినిక్, హైదరాబాద్ వారు మాట్లాడుతూ 'సోరియాసిస్ చర్మంపై ఎరుపు లేదా తెలుపు రంగుగా మారిన మచ్చలు. ఇది ఒక ఆటో-ఇమ్యూన్ వ్యాధి. దీన్నిచాలా కాలం పాటు విస్మరిస్తే సోరియాటిక్ ఆర్థరైటిస్‌కి దారి తీయొచ్చు' అని తెలిపారు. డాక్టర్ అసీమ్ శర్మ మాట్లాడుతూ 'వాయు కాలుష్యాన్ని నియంత్రిం చడమే కాకుండా, సోరియాసిస్ ఉన్న వ్యక్తులు బయటికి వెళ్లేటప్పుడు వాయు కాలుష్యానికి గురికావడాన్ని నియం త్రించడంపై అవగాహన కలిగి ఉండాలి. సమయోచిత, కాంతి చికిత్స, నోటి మందులు, బయోలాజికల్ థెరపీ వంటి అనేక ప్రభావవంతమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి' అని తెలిపారు. డాక్టర్ విజయ్ భాస్కర్ మల్లెల, ఎండీ, ఎఫ్ఏఏడీ, ఓమ్ని హాస్పిటల్స్ మాట్లా డుతూ 'ఈ ఈవెంట్ 'సోరియాసిస్‌లో బయోలాజిక్స్ - సరైన ఎంపిక. ఇది బయో లాజిక్స్ ద్వారా సమర్థవంతమైన నిర్వహణను నొక్కి చెప్పింది. ఒత్తిడిని తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై దృష్టి పెట్టడం. తగినంత నిద్రపోవడం సోరియాసిస్ ను మెరుగ్గా నిర్వ హించడంలో సహాయపడతాయి. సమయో చిత, దైహిక, జీవసంబంధమైన, కాంతిచికిత్స, కలయిక చికిత్స వంటి సోరియాసిస్ లక్షణాలను నిర్వహించడానికి అనేక ప్రభావవంతమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి' అని తెలిపారు.

కంటి ఆరోగ్యంపై ఆల్కాహాల్ వినియోగం ప్రమాదం

నవతెలంగాణ-సిటీబ్యూరో

కంటి ఆరోగ్యంపై ఆల్కాహాల్ వినియోగం ప్రమాదకరం అని సోమాజిగూడ మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్స్ సీనియర్ క్యాటరాక్ట్ అండ్ రిఫ్రాక్టివ్ సర్జన్ డాక్టర్ మారగంటి వంశీధర్ తెలిపారు. అధిక లేదా దీర్ఘకాలిక ఆల్కాహాల్ తీసుకోవడం కంటి ఆరోగ్యం సహా మొత్తం శ్రేయస్సుపై ప్రభావాలను కలిగిస్తుందని తెలిపారు. మితమైన ఆల్కాహాల్ వినియోగం కండ్లకు గణనీయమైన హాని కలిగించే అవకాశం లేదని తెలిపారు. అధిక, దీర్ఘ కాలిక ఆల్కాహాల్ తీసుకోవడం డ్రై ఐ సిండ్రోమ్, మాక్యులర్ డిజెనరేషన్, కంటి శుక్లం, ఆప్టిక్ న్యూరోపతి వంటి వివిధ కంటి పరిస్థితులకు దోహదం చేస్తుందని తెలిపారు.



ఇక్షణ ఫౌండేషన్ అధ్యక్షురాలు మేఘన నందూరి ఆధ్వర్యంలో శుక్రవారం గవర్నమెంట్ హైస్కూల్ ఫర్ బ్లైండ్ దారుషిఫా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెచ్ఎం మందాడి వెంక రెడ్డి, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం సద్గుణ, సీనియర్ ఉపాధ్యాయులు రామారావు, జావీద్, శ్రీనివాస్ రెడ్డి, సునందా, పద్మజా, సామాజిక కార్యకర్త రాజశేఖర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా చూస్తాం

● కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లో రాబోవు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దటి లేకుండా చూస్తామని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. డివిజన్‌లోని అశోక్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో కేంద్ర మంత్రి నిధులతో నూతన పవర్ బోర్ నిర్మాణాన్ని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. కేంద్రమంత్రి నిధులతో డివిజన్‌లోని అశోక్ నగర్ కల్చర్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన భవన ఆవరణలో 6.50 లక్షల వ్యయంతో నూతన పవర్ బోరు నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. వేసవికాలంలో నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉంటుందని దానిని అధిగమించాలంటే సాధ్యమైన నీ పవర్ బోర్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు వినయ్ కుమార్, అసోసియేషన్ అధ్యక్షులు రామ్మూర్తి, కార్యదర్శి సూర్య ప్రకాష్, ఐఎస్ఎస్ మూర్తి, సూర్య నారాయణ, సీనియర్ నాయకులు పి.నర్సింగ్ రావు, ప్రకాష్ యాదవ్,ఆకుల సురేందర్,నవీన్, అరుణ్ కుమార్, గోపి, సత్తేందర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

'ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందిస్తున్న రాపిడో'



● రాపిడో కో-ఫౌండర్ గుంటుపల్లి పవన్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

హైదరాబాద్ నగరంలో రాపిడో ద్వారా ప్రయాణించే వారికి ఉత్తమ సేవలు అందిస్తున్నట్లు రాపిడో కో-ఫౌండర్ గుంటుపల్లి పవన్ తెలిపారు. శుక్రవారం క్యాబ్ మహోత్సవం కార్యక్రమంలో రాపిడో కో-ఫౌండర్ పవన్, మాజీ పార్లమెంట్ సభ్యులు గడ్డం ఆత్మ చరణ్ రెడ్డి, జైంట్ ట్రాన్స్ పోర్టు కమిషనర్ రమేష్ పాల్గొని, రాపిడో కెప్టెన్ కు (డ్రైవర్లు) పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు మాసాలుగా హైదరాబాద్ నగరంలో 30 వేల క్యాబ్స్ రాపిడో ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలోని మారుమూల కాలనీకి బుకింగ్ చేసిన వెంటనే వెళ్లి వారిని గమ్యస్థానానికి సమయానికి తీసుకువెళుతున్నట్లు తెలిపారు. మంచిగా పేరుపొందిన కెప్టెన్ ని అభినందించి బహుమతులను అందజేశారు. సుమారు 1,500 మంది కెప్టెన్లు హాజరైనట్లు తెలిపారు. 2023 మేలో హైదరాబాద్ నగరంలో క్యాబ్ వ్యాపారంలోకి రాపిడో ప్రవేశించిందని ఒక సంవత్సరం లోపే 50 వేల కంటే ఎక్కువ క్యాప్ కెప్టెన్లను తమ ప్లాట్ ఫారంపై నమోదు చేసుకున్నారన్నారు. నాలుగు లక్షల రైడ్లను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. భారతదేశం అంతటా మూడు లక్షల మందికి పైగా కెప్టెన్లు క్యాబ్ కోసం ఆధారిత మోడల్ కెప్టెన్లు సంపాదనలో 100 శాతం ప్రయాణికులకు అసాధారణమైన సేవలను అందించడంలో వారి నిబద్ధతతో ఐక్యంగా ఉండటానికి ఈ కార్యక్రమం ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు.

వీణా వాదన, గాన గోష్ఠి సహిత గురు వందనం



నవతెలంగాణ-కల్చరల్

ప్రఖ్యాత వీణా వాయిద్య నిపుణులు, విశ్వ భూషణ్, వీణావాణి శ్రీమతి ఆనంద రాజ్యలక్ష్మి చవాన్ శిష్య బృందం వీణా గోష్ఠి, గాన మాధుర్యంతో గురువందనం చేశారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై ప్రముఖ సంగీత సంస్థ ఆనంద మహతీ కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో గరువందనం పేరిట శాస్త్రీయ సంగీత భరిత కార్యక్రమం జరిగింది. వీణా వాయిద్య గోష్ఠిలో కళాకారిణిలు శ్రుతి లయ బద్ధంగా వాగ్గేయ కారుల కీర్తనలు వీణియలపై పలికించారు. ఇందులో పాల్గొన్న కళాకారిణిలు త్యాగరాజు, అన్నమయ్య, ముత్తుస్వామి వెంకటసుబ్బయ్య, పురందర దాసు, మొదలగు వాగ్గేయకారుల రచనలను మధురంగా ఆలపించారు. వీణలపై శృతి మధురముగా ప్రదర్శించారు. ఇందిరా హేమ వ్యాఖ్యానంలో మృదంగంపై రాజగోపాల్, ఘటంపై దుర్గాకుమార్, డోలుపై రవిచంద్ర బాబు సహకరించారు. సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కస్టమ్స్ విశ్రాంత ఉన్నతాధికారి ఎం.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతం అలసిన మనసులకు ఉరటనిస్తుందన్నారు. ఆనంద రాజ్య లక్ష్మి వీణా వాదనలో శిక్షణ ఇచ్చి ఎందరో ప్రతిభా వంత కళాకారులను దేశానికి అందజేస్తూ దేశ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో సహకరిస్తుందని ప్రశంసించారు. క్షీరసాగరం వ్యవస్థాపకులు శ్రీ వి.ఆనంద మోహన్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ సెంథిల్ రాజప్ప, కర్ణాటక సంగీత గాయని బాలాత్రిపుర సుందరి, న్యాయవాది విజయ కుమార్ తదితరులు పాల్గొని తమ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంలో గురువు ఆనంద రాజ్య లక్ష్మీనీ వారి శిష్య బృందం సత్కరించారు.

బీసీలకు పార్లమెంటు ఎన్నికల్లో 8 సీట్లు కేటాయించాలి

● బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్



నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీల ఆవేదన అరణ్యరోదనేనా సమస్యలపై ఏ నాయకుడికి చెప్పిన పట్టించుకునే నాయకుడే లేడని బీజేపీ పార్టీ బీసీలకు పార్లమెంటు ఎన్నికల్లో 8 సీట్లు కేటాయించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు సీటును బీసీ నాయకులు బండారి శాంతికుమార్‌కు ఇవ్వాలని బీజేపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం సెక్రెటరీ ఉమాశంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బూరుగుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ బీసీల ఓట్ల కోసం కుస్తీపట్టే నాయకులు బీసీలకు రాజ్యాధికారంలో న్యాయమైన వాటా దక్కకుండా అడ్డుకుంటూ బీసీ జపం చేస్తూ బీసీల ఓట్లు దండుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టని మండిపడ్డారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు సీటు రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించి తమ బీసీ వ్యతిరేకతను రేవంత్ రెడ్డి మరోసారి నిరూపించుకున్నారని, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలైనా జనాభా దామాషా ప్రకారం బీసీలకు పార్లమెంటు సీటు కేటాయించాలని లేనియెడల బీసీ వ్యతిరేక పార్టీలకు రాజకీయ పతనం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన నాయకులు రామస్వామి, గొడుగు నర్సిములు, ఎడ్ల రాజు, దోస్త్ తదితరులు పాల్గొన్నారు.

'కేజ్రీవాల్‌కు ఈడీ, సీబీఐ సమన్లు వెనుక బీజేపీ రాజకీయ కుట్ర'



● కేజ్రీవాల్ ను అరెస్ట్ చేస్తే దేశంలో ప్రజా సునామీ
● ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశంలో వచ్చే లోక్ సభ ఎన్నికల్లో "ఇండియా" కూటమిలో భాగంగా ఆప్, కాంగ్రెస్‌తో పార్టీల ఆసన్న జాతీయ ఎన్నికల ఒప్పందం బీజేపీని చావుదెబ్బ తీస్తుందని భావించి నిరంకుశ ప్రధాని మోడీ బృందం తమ 'రాజకీయ కుట్ర'లో భాగంగా ఆమ్ ఆద్మీ పార్టీని అణిచివేయడానికి ముందుగా ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలని ఈడీ, సీబీఐలకు సూచనలు ఇచ్చి అక్రమ నోటీసులు పంపుతున్నారని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. శుక్రవారం హిమాయత్‌నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ఈడీ అక్రమ నోటీసు పని చేయడం లేదని, అందుకే సీబీఐ ద్వారా అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తుందని, అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే దేశంలో ప్రజా సునామీ వస్తుందని హెచ్చరించారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నాయకులపై జరుగుతున్న విచారణలు అవినీతికి వ్యతిరేకంగా పోరాటంలో భాగం కాదని, కేవలం రాజకీయ ప్రతీకారం, బీజేపీని ప్రశ్నించే వారిని జైలుకు పంపుతున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించేందుకు బీజేపీ ఎంత మంది ప్రతిపక్ష నేతలను జైల్లో పెడుతుందని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీ మద్యం ఎక్సైజ్ పాలసీకి సంబంధించి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎలాంటి సంబంధం లేదని, అందుకే చట్టంలో అస్పష్టమైన, ప్రేరేపించబడిన, నిలకడలేని కేసులు పెట్టి జైల్లో పెట్టడానికి ఈడీ, సీబీఐలు చట్టవిరుద్ధంగా ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఒక సాక్షిగా లేదా అనుమానితుడిగా, ఒక వ్యక్తిగా అతనిని ఏ హోదాలో పిలుస్తున్నారో సమన్లలో స్పష్టం చేయడం లేదన్నారు. ఇదే కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవితను ఈడీ అరెస్టు చేయకపోవడం బీజేపీ, బీఆర్ఎస్ మధ్య జరిగిన ఒప్పందానికి నిదర్శనమన్నారు. విషపూరిత జాతీయవాదం తలకెక్కి, రాజకీయ కుట్రలు పన్ని ప్రతిపక్ష నేతలను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేస్తే ఉరుకునేది లేదని తగిన బుద్ధి చెపుతామని ఆయన హెచ్చరించారు. ఈడీ, సీబీఐ నోటీసులకు, బీజేపీ విషపూరిత కుట్రలకు ఆప్ నేతలు భయపడరని, ధైర్యంగా ఎదుర్కొంటారని చట్టవిరుద్ధంగా, రాజకీయ ప్రేరేపితమైన ఈడీ, సీబీఐ సమన్లు, జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఆమ్ ఆద్మీ పార్టీ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతుందని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డా.సోలొమన్ రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు నర్సింగ్ యమునా గౌడ్, ప్రధాన కార్యదర్శి హేమ జిల్లోజు, డాక్టర్స్ విభాగం అధ్యక్షులు డా.లాక్ష్యా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మాల మహానాడు రంగారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షుడిగా చేపూరి శంకర్'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మాల మహానాడు రంగారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షుడిగా చేపూరి శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేపూరి శంకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రంగారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షుడిగా నియమించిన జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మాల మహానాడు పటిష్టత కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అన్నదమ్ముల లాగా కలిసి ఉన్న మాల, మాదిగలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విడదీసేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు తాలూక రాజేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బైండ్ల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదర్శ్ మౌర్య, ఖైరతాబాద్ నియోజక వర్గ అధ్యక్షులు బుర్గు రమేష్, ప్రధాన కార్యదర్శి ఎల్లస్వామి, భారతీయ భీమ్ సేన తెలంగాణ నాయకులు చేపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ హై స్కూల్‌లో ఘనంగా సైన్స్ ఫెయిర్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్‌లోని కాకతీయ హైస్కూల్లో సైన్స్ ఫెయిర్ ఘనంగా జరిగింది. ఈ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు 40 కి పైగా వివిధ రకాల ఉపయోగకరమైన సైన్స్ ప్రాజెక్టులు ఆకర్షణీయంగా తయారు చేసి అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. సింగరేణి, సింక్రోనోస్ మోటార్, బయోగ్యాస్, ఆయుర్వేదిక్ జెట్ కాయిల్, హృదయ విశ్లేషణ మొదలగు ఐదు ప్రాజెక్టులు నేడు సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరుగు సైన్స్ జాతర వేడుకల్లో ప్రదర్శనకు ఎంపిక చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రామ రాజు బల్వంతరావు మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సుకు ఇటువంటి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో దోహద పడతాయని సమయాభావాన్ని అధిగమించి ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు ఎంతో శ్రమకోర్చి ఈ కార్యక్రమాన్ని నేర్పుతో విజయవంతం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని సందర్శించి విద్యార్థులను ప్రోత్సాహించిన వారందరికీ ధన్యవాదాభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా బాలోత్సవ కమిటీ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ఉపా ధ్యక్షురాలు సంజీత, ప్రధాన కార్యదర్శి ఎస్. సోమయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ గోక నవీన్, ప్రిన్సిపల్ రామరాజు బల్వంతరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చిన్న వయస్సులోనే లాస్య నందిత మరణించడం బాధాకరం

నవతెలంగాణ-ధూల్‌పేట్



చిన్న వయస్సులోనే కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణించడం బాధాకరమని బీఆర్ఎస్ నాయకుడు ఎస్.పి.క్రాంతి కుమార్ అన్నారు. ఆమె మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువ ఎమ్మెల్యేగా, సాయన్న వారసురాలిగా ఎంతో భవిష్యత్ ఉన్న ఆమె ఇలా కారు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమైన విషయమని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని, ఆమె కుటుంబానికి మనోధైర్యం కలిగించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాము.



ఈస్ట్ జోన్ డీసీపీ ఆర్ గిరిధర్ నీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోనే ప్రదీప్‌రావు, రాహుల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్పీఐ పార్టీ పోటీ చేస్తుంది

● ఆర్పీఐ జాతీయ ఉపాధ్యక్షులు బైగళ్ల నాగేశ్వర రావు



నవతెలంగాణ-ముషీరాబాద్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) తెలంగాణలోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నట్టు ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బైగళ్ల నాగేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన బైగళ్ల నాగేశ్వర రావు ను ఘనంగా సత్కరించారు. అనంతరం బైగళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో అహంకారంగా వ్యవహారించి అప్రజాస్వామికంగా పాలించిన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లా ల వ్యాప్తంగా ఆర్పీఐ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర నూతన ఇన్‌చార్జీ రత్నప్రసాద్‌ను నియామకం చేసినట్టు ప్రకటించారు. సమావేశంలో పార్టీ జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రభుదాస్, కార్యదర్శి శివ నాగేశ్వర రావు గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డి రవికుమార్, కృష్ణ, మహిళా విభాగం ఇన్‌చార్జ్ అనిత, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షు రాలు లత ప్రభ తదితరులు పాల్గొన్నారు.

27న గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈనెల 27న చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని, టీ జేఏసీ నాయకులు ప్రొఫెసర్ కోదండరాం, రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పని చేస్తున్న దాదాపు వెయ్యిమంది జర్నలిస్టులు సొసైటీలో సభ్యులుగా ఉన్నారని, 2008లో ఏర్పడిన ఈ సొసైటీలో ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులు సభ్యత్వం పొంది గత పదిహేను సంవత్సరాలుగా ఇళ్ళస్థలాల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఇండ్లస్థలాల కోసం పలు మార్లు ప్రభుత్వాన్ని కోరినప్పటికీ సొసైటీ సభ్యులైన జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేసిందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జర్నలిస్టులను కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, తెలంగాణ ఉద్యమానికి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు జర్నలిస్టులను వాడుకున్న కేసీఆర్.. అధికారంలోకి వచ్చిన తర్వాత పదేళ్ళుగా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ప్రజా పాలన లక్ష్యంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు న్యాయం చేయాలని, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి స్థలం కేటాయించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. 27న జరిగే సొసైటీ సర్వసభ్య సమావేశానికి సొసైటీ సభ్యులందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

జర్నలిస్టుపై దాడి.. ఇరువురి పై కేసులు నమోదు...

నవతెలంగాణ-హాయత్ నగర్

ఓ జర్నలిస్టుపై దాడి జరిగిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మధు తెలిపిన వివరాల ప్రకారం జర్నలిస్టు అయిన చలమల శంకర్ (జర్నలిస్టు శంకర్) ఈనెల 22న తన కారులో సిరీస్ రోడ్డు ఎల్బీనగర్‌లో ఉన్న తన కార్యాలయం నుండి కామినేని వైపు వెళ్తున్న క్రమంలో మార్గ మధ్యలో కొంత దూరం వెళ్ళాక వెనుక నుంచి ఇద్దరు యువతులు వారి ద్విచక్ర వాహనంపై అదే దారిలో వెళ్తున్నారు. కొంత దూరం వెళ్ళాక అకస్మాత్తుగా కారు నెమ్మదించ గా వెనుక నుంచి వస్తున్న ఆ ఇద్దరు యువతులు ఆ కారును ఢీ కొనడంతో వారి మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. అంతలో యువతులకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు రావడంతో వారిరువురు ఒకరినొకరు దాడి చేసుకోవడం పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని పోలీసులు తేల్చి చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



నవతెలంగాణ-శంకరపల్లి

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన శుక్రవారం ఫతేపూర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం జరిగింది. శంకర్పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఎర్వగూడ గ్రామానికి చెందిన కుసుమగళ్ల వెంకటేష్ (31)వృత్తి వ్యవసాయం. ఈ నెల 22న తన పల్సర్ బైక్‌పై నవాబ్‌పేట్ మండల పరిధిలోని మన్నాన్పల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఫతేపూర్ బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటేశ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం మృతుడి భార్య స్వాతికి తెలియడంతో ఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వినాయక్‌రెడ్డి తెలిపారు.

ఇక రూ. 500కే గ్యాస్ సిలిండర్

- పేద మధ్యతరగతి కుటుంబాలకు తీరనున్న గ్యాస్ భారం
- జిల్లాలో 19 లక్షల గ్యాస్ కనెక్షన్లు.. 6.39 లక్షల రేషన్‌కార్డులు
- తొలి విడుతలో 4 లక్షల కార్డుదారులకు.. రూ. 22 కోట్లకుపైగా లబ్ధి
- 27న ప్రియాంకా గాంధీ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభం





నవతెలంగాణ-సిటీబ్యూరో

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండింటికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం..మరో రెండు పథకాల అమలుకు అంతా సిద్ధం చేసింది. రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహావసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకాలు అమలు చేయనున్నట్టు ప్రకటించింది. ఈ నెల 27న కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ చేతులమీదుగా లాంఛనంగా ప్రారంభించనున్నట్టు తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

పేద, మధ్యతరగతి కుటుంబాల్లో గడిచిన కొన్నేండ్లుగా వంట గ్యాస్ సిలిండర్ల భారం మోయలేనిదిగా మారింది. దానికితోడు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడం, గ్యాస్ బండ భారం ఎక్కువటంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఆ కుటుంబాలకు భారీ ఊరటనివ్వనుంది. మహాలక్ష్మి పథకంలో భాగమైన 500కే గ్యాస్ సిలిండర్ పంపిణీతో పేదలపై భారం తగ్గనుంది. హైదరాబాద్ జిల్లావ్యాప్తంలోని తొమ్మిది సర్కిళ్లలో 67 గ్యాస్ ఏజెన్సీలుండగా.. వాటి పరిధిలో 19లక్షల వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం 6.39లక్షలకుపైగా రేషన్ కార్డులున్నాయి. అధికార గణాంకాల ప్రకారం రాయితీ అమలైతే.. తొలుత 4.50 లక్షల రేషన్‌కార్డు కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ అందనుంది. మరో లక్షన్నకుపైగా సంబంధించి లబ్దిదారులు ఈకేవైసీ ఇంకా పూర్తిస్థాయిలో కాలేదు. మరికొన్నింటికి సంబంధించి వివరాలు తప్పుగా నమోదు కావడం, తదితర సమస్యలున్నాయి. వాటిని త్వరలోనే పరిష్కరించి.. వారికి ప్రభుత్వమందించే రూ.500 సబ్సిడీ వచ్చేలా చూస్తామని సంబంధిత అధికారులు చెప్పారు. సిలిండర్‌పై రాయితీ పథకాన్ని అమలు చేస్తే తొలివిడుతలో సుమారు రూ. 22కోట్లపైగా లబ్ధిదారులకు మేలు జరగనుంది. ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 955 ఉంది. రాయితీపై రూ.500కు అందిస్తే ఆర్థిక భారం తప్పనుందని ప్రజలు భావిస్తున్నారు.

కుటుంబానికి 9 సిలిండర్లు కటాఫ్!

కాగా ఒక్కో కటుంబానికి ఏడాదిలో నెలకు ఒకటి చొప్పున మొత్తం 12 సిలిండర్లు రాయితీపై వినియోగించే వెసులుబాటు ఉంది. అయితే ప్రభుత్వం మాత్రం ఒక్క కుటుంబానికి 9 సిలిండర్లకే పరిమితం చేయనుందని తెలుస్తోంది. అధికారుల లెక్కల ప్రకారం ఎక్కువ శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలు 40రోజులకోకటి చొప్పున ఉపయోగిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఆ లెక్కన 12 నెలలకు 9 సిలిండర్లు సరిపోనున్నాయి. గడిచిన ఏడాది, రెండేండ్ల డేటా చూస్తే.. ఇంచుమించుగా చాలా ఎక్కువ కుటుంబాలు 9 సిలిండర్లకు మించి ఉపయోగించలేదని తెలిసింది. ఉచిత పథకం అమలుతో అదనపు సిలిండర్లు పక్కా దారి పట్టే ప్రమాదం లేకపోలేదు. అందుకని 9 సిలిండర్లు ఆపై కావాల్సిన వారికి రాయితీ అమలు చేయకపోవచ్చు.

డీలర్లకే రాయితీ చెల్లింపులు..!

రూ.500కే సిలిండర్ పథకం అమలుకు సిద్ధంగా ఉండాలని పౌరసరఫరాల శాఖ గ్యాస్ డీలర్లకు స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సివిల్ సప్లయ్స్ భవన్‌లో కమిషనర్ డీఎస్ చౌహాన్, ఇతర అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి అర్హులైన వినియోగదారులకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని పౌరసరఫరాలశాఖ డీలర్లకు స్పష్టం చేసింది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని వివరించగా.. డీలర్లు సూత్రప్రాయంగా అంగీకరించినట్టు సమాచారం. అంతేగాక డీలర్లకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా కొంత మొత్తాన్ని అడ్వాన్సుగా చెల్లించే విషయాన్ని పౌరసరఫరాల శాఖ ప్రతిపాదించింది. సిలిండర్ల పంపిణీ ఆధారంగా మిగతా మొత్తం చెల్లిస్తామని తెలిపింది.

ఫ్రీ లాంచ్ పేరుతో
రూ. కోట్లు వసూల్లు

- 3000 కస్టమర్లను నిండా ముంచిన నిందితుడు
- బాధితులు ఫిర్యాదు చేయాలని పోలీసుల సూచన

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫ్రీ లాంచ్ పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న నిందితుడి బారి నుంచి బాధితులను రక్షించేందుకు సీసీఎస్ పోలీసులు కసరత్తు చేస్తున్నారు. శుక్రవారం జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్ తెలిపిన వివరాల మేరకు... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాహితి ఇన్ఫ్రాటెక్ యజమాని బూదాటి లక్ష్మీనారాయణ ఫ్రీ లాంచ్ ఆఫర్ పేరుతో హైదరాబాద్‌లోని సుమారుగా 3000 మంది కస్టమర్ల నుంచి కోట్లాది రూపాయలను వసూళ్లు చేశాడు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కాజా గ్రామంలోని సుమారు 56 మంది రైతులకు సంబంధించిన 24 ఎకరాలలో అపార్ట్మెంట్లు, ఐటి పార్కులు, విల్లాలు కడతానంటూ నమ్మించిన నిందితుడు వారి దగ్గర డెవలప్‌మెంట్ పేరుతో పత్రాలను కాజేశాడు. ఆ తర్వాత ఫ్రీ లాంచ్ ఆఫర్ పేరుతో హైదరాబాద్‌లోని పలువురిని నమ్మించిన నిందితుడు కోట్లాది రూపాయాలను వసూలు చేశాడు. కానీ ఆ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. మోసపోయినట్టు గుర్తించిన బాధితులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన పోలీసులు మోసం లాక్కున్న భూమిని ప్రభుత్వానికి అటాచ్ చేశారు. ఇతరులు మోసం పోకుండా డీసీపీ శ్వేతా రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఓ టీమ్‌ను పంపించి సదురు భూములల్లో నోటీసు బోర్డులను ఏర్పాటు చేశారు. నిందితుడి చేతిలో మోసపోయిన బాధితులు హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యార్థులకు సామాజిక బాధ్యతను బోధించడంపై దృష్టి

బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కృష్ణ పడిశెట్టి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యార్థులకు సామాజిక బాధ్యత, స్థిరమైన జీవన విధానాలను బోధించడంపై దృష్టి పెడుతుందని బ్రైట్ చైల్డ్ ఫౌం డేషన్ వ్యవస్థాపకులు కృష్ణ పడిశెట్టి అన్నారు. శుక్రవారం కేపీహెచ్ బీలోని మంజీరా ట్రినేటి కార్పొరేట్‌లో ఏర్పాటు చేసిన బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ప్లాట్‌ఫారంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సారథ్యం భావాన్ని పెంపొందించే కంప్యూటర్ నైపుణ్యంతో విద్యార్థులను సన్నద్ధం చేయడంతో ఒక తరం వ్యక్తులను, వారి కమ్యూనిటీలలో, వెలుపల సానుకూల మార్పును సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నామ న్నా రు. పర్యావరణ స్పృహను పెంపొందించే లక్ష్యంతో విద్యా కార్య క్రమాల అభివృద్ధికి దోహదపడే అవకాశం ఉంటుందన్నారు. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ మేనేజర్ కనకలం మాట్లాడుతూ తెలంగాణలోని సంగారెడ్డిలో ఒక స్కూల్ నుంచి 600 మంది విద్యార్థులను ఉద్ధరించే లక్ష్యంతో మా తొలి ప్రాజెక్టును ప్రారంభించామన్నారు. ప్రాజెక్టు విజయవంతంగా పూర్తయిందన్నారు.

ప్రమాదామా..
ముందు ఢీకొనేది తలే

- లాస్య నందిత మరణంతో ఎక్కడ చూసినా ఇదే హాట్ టాపిక్
- స్టీరింగ్ చేతిలోవుంటే చాలు ..


ఫైల్ ఫోటో

నవతెలంగాణ-సిటీబ్యూరో

వేగం కన్నా.... ప్రాణం ముఖ్యమని... నిదానమే.. ప్రదానమని... పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరించినా .. ఫైన్లు వేసినా అదే మితిమీరిన వేగం.. సీటు బెల్టు ధరించడంలో నిండా నిర్లక్ష్యం.... రోడుపై పోలీసులు లేరనో లేకా రోడ్డు ఖాళీగా ఉందనో గాలిలో తేలిపోతుంటారు... ఇక యువ కులైతే చెప్పనక్కర్లేదు.... స్టీరింగ్ చేతిలోవుంటే చాలు 150కిపైగా కారు వేగంగా పరుగెత్తాల్సిందే... ఒక్క సారీ అనుకోనిది జరిగితే అంతే సంగతులు... తాజాగా లాస్య నందిత మరణంతో ఎక్కడ చూసినా ఇదే హాట్ టాపిక్ మారింది.

నిండా నిర్లక్ష్యం....

వాహనదారుల ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో నిండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. చాలా మంది హెల్మెట్ ధరించడంతో నిర్లక్ష్యం వహిస్తు ంటారు. ద్విచక్రవాహనాలు ప్రమాదానికి గురైన సమయంలో వాహనం నుంచి కిందపడిన వ్యక్తికి ముందుగా తలకే గాయం అవుతుంది. అది చిన్నప్రమాదమైనా, పెద్ద ప్రమాదమైనా కావచ్చు 90శాతం తలకు గాయం అవుతుంది. దాంతో అధిక సంఖ్యలో మృతి చెందుతున్నారు. కొన్ని సంద ర్భాలల్లో కోమాలకి వెళ్లే అవకాశాలున్నాయి. మరి కొన్ని సందర్భాలల్లో గాయాలతో బయట పడ్డారు. ఇదిలావుండగా కారు ఉన్న ప్రతి ఒక్కరికీ సీటు బెల్ట్‌పై పక్కాగా అవగాహన ఉంటుంది. అయినా సరే సీటు బెల్ట్ పెట్టుకోరు. కొందరు నామూషీగా ఫీలవుతుండగా, మరికొందరు బట్టలు నలిగిపోతాయన్న కారణంగా సీటు బెల్ట్ ధరించరు. కారు వేగమూ తగ్గించరు. ఇక ప్రమాదంలో ఎవరో ఒక ప్రముఖ వ్యక్తి మరణించినప్పుడల్లా సీటు బెల్ట్ ప్రాధాన్యం గురించి కొద్దిరోజులు మాత్రం చర్చ జరుగుతుంది. తాజాగా ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో మరోసారి సీటు బెల్ట్ అంశం హాట్ టాపిక్‌గా మారింది.

ఎక్కడ కూర్చున్నామన్నది కాదు...

కారులో ఎక్కడ కూర్చున్నామన్నది ముఖ్యం కాదు సీటు బెల్ట్ ధరించామా లేదా అన్నదే ముఖ్యం. కారు ప్రమాదంలో ముందుగా కారులోని వ్యక్తులు వేగంగా ముందుకు వెళ్తారు. ఆ సమయంలో వాళ్ల డ్యాష్ బోర్డునో, వెనుక కూర్చున్నవారైతే ముందు సీట్ల మధ్య నుంచి వెళ్లి అద్దాన్ని వేగంగా గుద్దుకునే ఆస్కారముంటుంది. ఇక వాహనం పల్టీ కొట్టిందా అంతే సంగతులు, ఏకంగా అద్దంలో నుంచి ముందుకు పడిపోతారు. లేదంటే డోర్ ఊడిపోయి ఒక్క సారిగా ఎగిరి బయట పడిపోతారు. అలా జరిగితే తీవ్ర గాయాలై వ్యక్తి మరణించే అవకాశం అధికంగా ఉంటుంది. సీటు బెల్ట్ ధరించినప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టినా లేదంటే కారు పల్టీలు కొట్టినా పెద్దగా ఇబ్బంది ఉండదు. ఆ సమయంలో సీటు బెల్ట్ వారిని రక్షిస్తుంది. కొన్ని కార్లలో సీటు బెల్ట్ పెట్టుకోవడం వల్ల ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అవుతాయి. దీంతో ప్రమాదం నుంచి సులభంగా గట్టెక్కవచ్చు. అత్యంత అరుదుగా మాత్రమే ఎయిర్ బ్యాగ్స్ సెన్సార్లు యాక్టివేట్ అయి, తెరుచుకోవడానికి 0.05 సెకన్ల సమయం పడుతుంది. ఇలా జరిగితే ఏమీ చెయ్యలేం. కానీ 99.95 శాతం మాత్రం సీటు బెల్ట్ పెట్టుకుంటే సురక్షితంగా బయ టపడగలం. ఒకవేళ సీటు బెల్ట్ పెట్టుకోలేదంటే ఈ ప్రక్రియ జరగడానికి ఆస్కారమే ఉండదు. దాంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

నాంపల్లి దర్గాను సందర్శించిన వేణుగోపాల స్వామి

నవతెలంగాణ-ఓయూ



సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఆశిస్తున్నా వేణు గోపాల్‌స్వామి శుక్రవారం చారిత్రాత్మ కమైన నాంపల్లిలోని యుసిఫ్ బాబా దర్గా ను సందర్శించి సంప్రదాయబద్దంగా చా దర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశా రు. దర్గా నిర్వాహకులు ఆయనకు దర్గా సాంప్రదాయ స్వాగతం పలికారు. పూజా సామాగ్రి, గంధం కలశంతో వేణుగోపాల్ స్వామి ప్రదక్షణలు నిర్వహించారు. అనంతరం సమాధుల మీద ప్రత్యేక ఛాదర్‌లను, పూలమాలలను సమర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ స్వామి మాట్లాడుతూ యూసుఫ్ బాబా దర్గా హిందూ, ముస్లిం ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన పలువురు మైనారిటీ ప్రముఖులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఏఐసీసీ సభ్యుడు కటారి గౌరీశంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నవతెలంగాణ-బేగంపేట

రాహుల్ గాంధీ నాయత్వం కోరుకుంటున్నారు

● చింతా ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-బంజారాహిల్స్



రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరిచి ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకు న్నారని, తెలంగాణ ప్రజా సమస్యలు తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఆ దిశలో విజయ వంతంగా పనిచేస్తున్నారని చింత ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవా రం ఎర్రమంజిల్లోని తన కార్యాలయంలో జరిగిన విలేక రుల సమావేశంలో చింత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో బీజేపీ పార్టీ అవలంబిస్తున్న విధానా లతో దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్ర కష్టనష్టాలకు గురై 60 సంవత్సరాల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుం టున్నారని, దేశ ప్రధానిగా రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తున్న తనతో పాటు దేశ ప్రజలందరూ ఆ శుభ సందర్భం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి వరంగల్ పార్లమెంటు అభ్యర్థిగా తాను టికె ట్టు ఆశిస్తున్నట్లు చింతా ప్రవీణ్‌కుమార్ తెలియజే శారు. కాంగ్రెస్ తనకు అవకాశం ఇస్తే విదేశాల్లో ఉన్నత విద్యను అభ్య సించిన తాను వరంగల్ పార్లమెంటు స్థా నాన్ని గెలిచి రేవంత్‌కి బహుమతిగా ఇస్తానని తెలియజేశారు.

విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్‌లో జాతీయ సదస్సు





నవతెలంగాణ-కంటోన్మెంట్

విజ్ఞాన జ్యోతి డిగ్రీ కళాశాలలో "సాంకేతిక యుగంలో మహిళా పారిశ్రామిక వేత్తల సాధికారిత" అనే అంశంపై శుక్రవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా ఐ.పి.ఎస్. (డైరెక్టర్ జనరల్ జైళ్ళ శాఖ, తెలంగాణ) డాక్టర్. సౌమ్యామిశ్ర, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక యు గంలో మహిళా పారిశ్రామిక వేత్తలు బహుళ అవకాశాలను పొందుతూ అలాగే సమస్యలను కూడా ఎదుర్కొంటున్నా రని తెలిపారు. దీనికి పరిష్కారంగా వారిని సాంకేతికంగా నిపుణులుగా తీరుస్తూ, చట్టాలలో మార్పులు జరగాలని వివరించారు. అంతకుముందు విజ్ఞాన జ్యోతి కార్యదర్శి శేషగిరిరావు మాట్లాడుతూ 'రాబోవు అంతార్జాతీయ మహి ళా దినోత్సవానికి ముందుగానే పారిశ్రామిక వేత్తల సాధికారితపై జాతీయ సదస్సు నిర్వహించడం ఆనం దకరమైనదన్నారు. అనంతరం కళాశాల ప్రధానోపాధ్యు రాలు డా.అరుణ మాట్లాడుతూ మహిళలు చాలా శక్తి వంతులని, వారి నిరంతర కృషియే సామాజిక ఉన్నతికి మూలమని తెలిపారు.

కళాశాల చైర్మెన్ శ్రీ.వి.రాజశేఖర్ మాట్లాడుతూ విజ్ఞాన జ్యోతి సంస్థ లాభాపేక్ష లేకుండా వివిధ స్థాయిలో విద్యాబోధన చేస్తు విద్యారంగ అభివృద్ధికి తోడ్పతుందని కొనియాడారు. విజ్ఞాన జ్యోతి మాజి ముఖ్య కార్యదర్శి డా॥డి.ఎస్.రావు, విజ్ఞాన జ్యోతి సంస్థల అధ్య క్షులు డి.సురేశ్‌బాబు, కళాశాల అధ్యక్షులు విజయప్రసాద్, ఉస్మా నియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొ శ్రీరాములు తదిత రులు పాల్గొని తమ తమ అభిప్రాయాలను ఆలోచనలను విద్యార్థులతో పంచుకున్నారు.

వైజ్ఞానిక సభ పోస్టర్స్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఓయూ



విజ్ఞాన దర్శిని,ఉస్మానియా వామపక్ష విద్యార్థి సం ఘాలు ఈ నెల 29న, జాతీయ సైన్స్ దినోత్సవం సంద ర్భంగా వైజ్ఞానిక సభ పోస్టర్స్ శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ ఏ సమాజమైనా దేశమైనా సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి ద్వారా, వైజ్ఞానిక దృక్పథం అభివృద్ధి ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. కానీ నేడు దేశంలో మనువాద పాలకులు సైన్స్ వైజ్ఞానిక దృక్పథాన్ని దెబ్బతీస్తూ మూఢ త్వాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేస్తున్నారు చరిత్రలో మొట్టమొదటిసారి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ప్రభుత్వ సైన్స్ సంస్థలను మూసివేస్తున్నారు సైన్స్ కు నిధుల కోత విధిస్తున్నారని, మరొకవైపు గోమూత్రంతో రోగాలు తగ్గుతున్నాయని పురాణాల్లోనే సైన్స్ ఉందని ప్రజల్లో మూ ఢత్వాన్ని పెంపొందించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 29న, జాతీయ సైన్స్ దినోత్సవం ఉండడమే కాకుండా సైన్స్ కోసం ఎన్నో త్యాగాలు చేసిన మానవ జీవన గమనాన్ని విప్లవా త్మకమైన మార్పులు తిప్పిన ఆవిష్కరణలు చేసిన సైంటిస్టులు మెండలీ ఎడిషన్, డార్విన్ గెలీలియో, కోపర్నికస్ వంటి వారు జన్మించిన నెల కాబట్టి విజ్ఞాన దర్శిని సైన్స్ మాసోత్సవంగా నిర్వహిస్తూ విజ్ఞాన యానం పేరుతో తెలంగాణలోని 20 జిల్లాల్లో 50 విద్యాసంస్థల్లో 25 వేలమంది విద్యార్థిని విద్యార్థులు యువతకు వైద్యానిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం జరిగిం దన్నారు. ఈ సభలను మేధావులు విద్యావేత్తలు విద్యార్థులు యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో విజ్ఞాన దర్శిని కోర్ టీం నాయకులు శోభారాణి విద్యార్థి సంఘాల నాయకులు పీడీఎస్‌యూ నాగేశ్వర్ రావు, ఎస్ఎఫ్ఐ రవి నాయక్ ఏఐఎస్ఎఫ్ నెల్లి సత్య పీడీఎస్‌యూ సుమంత్, ఎంఎస్‌పీ సైదులు నాయకులు ఉదయ్ కుమార్, శ్రీకాంత్,రామటెంకి శ్రీను, పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు-2024..



నవతెలంగాణ-ఓయూ

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా 21 ఫిబ్రవరి 2024 భాషాశాస్త్ర విభాగం, (యూసీ ఏఎస్ఎస్ ఓయూ) ఆధ్వర్యంలో గురువారం అంతర్జా తీయ బాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చా రు. ఈ కార్యక్రమంలో ఆహ్వానిత అతిథులు డా.బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ అర్జెంట్ ప్రొపెసర్ డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, ఓయూ తెలుగు విభాగం హెడ్ ప్రొ ఫెసర్ డా.సాగి.కమలాకర్ శర్మ సభను ఉద్దేశించి మా ట్లాడుతూ సంస్కృతిని పరిరక్షించడానికి, అభివృద్ధి చేయ డానికి అన్నింటినీ ప్రోత్సహించడానికి భాషలలో మాతృ భాష ప్రాముఖ్యత ఔచిత్యాన్ని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా. భాష నశిస్తే సంస్కృతి, సంప్రదాయాలు, పద్ధ తులు కూడా పోతాయి అంటు సున్నితంగా హెచ్చరిం చారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. సి.గణేష్ మాట్లాడుతూ మాతృభాషను విస్తృతంగా వినియోగించుకోవడం, పరిరక్షించడం, ప్రచారం చేయ డం అందరి బాధ్యతన్నారు.ఈ సందర్భంగా బాషాశాస్త్ర హెడ్ డా.సి.ఎస్.స్వాతి మాట్లాడుతూ భాషా వైవిధ్యంపై ప్రస్తా విస్తూ మరిన్ని భాషలు కనుమరుగవుతున్న కొద్దీ ముప్పు పొంచి ఉందన్నారు. స్వాగత ప్రసంగం చేస్తూ డాక్టర్.కె. బాలు నాయక్ మాట్లాడుతూ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాతృభాషా ఉద్యమాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భా గంగా, ఆన్‌లైన్ క్విజ్, స్థానిక స్పీకర్లు మాట్లాడటం, ఆహ్వా నించబడిన వక్తలు మాట్లాడటం, ఉస్మానియా యూనివ ర్శిటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్‌లోని వివిధ విభాగా ల నుండి మాతృభాషలో మాతృభాషలో మాట్లాడే పోస్టర్ల ప్రదర్శన వంటి వివిధ కార్యకలాపాలు నిర్వహించారు. హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించగా, భారతదేశం అంతటా దాదాపు 150 మంది పాల్గొనేవారు ఆన్‌లైన్‌లో ,యుట్యూ బ్, జూమ్ కళాశాలలో వ్యక్తిగతంగా పాల్గొన్నారు.

లాస్య భౌతికాయానికి మేయర్ నివాళి

నవతెలంగాణ-సిటీబ్యూరో



కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత భౌతి కాయా నికి జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి ఘన నివాళ్ల అర్పించారు. చిన్న వయసులో ఎమ్మెల్యే అయిన లాస్య నందిత ప్రజల్లో మంచి లీడర్‌గా పేరు తెచ్చుకున్నా రని గుర్తు చేశారు. ఆమె అకాల మరణం కలిచివేసిందన్నారు. లాస్య నందిత కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎమ్మెల్యే లాస్య నందిత ఇక లేరు..!





● నాన్న ఆశయాలను నెరవేర్చకుండానే..

నవతెలంగాణ-కంటోన్మెంట్

హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో కం టోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి చెందారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురిగా రాజకీయాల్లోకి వచ్చిన లాస్య.. తండ్రి మరణానంతరం ఆయన ఆశయాలను నెరవేర్చడానికి అను క్షణం పాటు పడేది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలుపొందారు. ప్రజలకు ఇంకా సేవచేద్దామనుకుంటుండగానే ఆమె రోడ్డు ప్రమాదంలో మతి చెందారు.

లాస్య రాజకీయ ప్రస్థానం..

హైదరాబాద్ అశోక్ నగర్ లో జీ.సాయన్న, గీత దంపతులకు 1987లో లాస్య నందిత జన్మించారు. ఆమె కంప్యూటర్ సైన్స్ లో బీటెక్ పూర్తి చేశారు. అనంతరం 2015లో రాజకీయాల్లోకి వచ్చారు. 2015లో జరిగిన కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో నాలుగో వార్డు పికెట్ నుంచి బోర్డు సభ్యురాలిగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం ఆమె తన తండ్రితో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2016లో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కవాడిగూడ డివిజన్ నుంచి లాస్య కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. అయితే 2020లో ఇక్కడి నుంచే కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇదిలా ఉండగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న 2023 ఫిబ్రవరి 19న అనారోగ్య కారణాలతో మతి చెందగా 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఆమెకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీటు ఇచ్చారు. దాంతో ఆమె అక్కడి నుంచి పోటీ చేసి 17,169 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

వరుస ప్రమాదాలు

ఇటీవల లాస్య నందితకు వరుసగా రెండు ప్రమాదాలు ఎదురయ్యాయి.రెండు నెలల క్రితం సికింద్రాబాద్‌లో ఓ కార్య క్రమానికి వెళ్లిన ఆమె లిఫ్ట్ ఓవర్‌లోడ్ కారణంగా అందులో ఇరు క్కుపోయారు. ఎమ్మెల్యే వ్యక్తిగత సిబ్బంది వెంటనే అప్రమత్తమై లిఫ్ట్ డోర్లు బద్దలు కొట్టి రక్షించారు. అలాగే ఫిబ్రవరి 13న బీఆర్ఎస్ పార్టీ నల్గొండలో బహిరంగ సభలో పాల్గొన్న లాస్య నందిత కారులో హైదరాబాద్ వస్తున్నారు. ఈ క్రమంలో నార్కట్‌పల్లి వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి రెయిలింగ్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె స్వల్పగాయాలతో బయటపడ్డారు. అయితే మూడోసారి శు క్రవారం జరిగిన ప్రమాదంలో ఆమె ఆమె ప్రాణాలు కోల్పోయారు.

లాస్య నందిత అకాల మృతి బాధాకరం

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ఎంతో భవిష్యత్ కలిగిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందడం చాలా బాధా కరమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత మరణిం చిన విష యం తెలుసుకున్న ఆయన తీవ్ర దిగ్భ్రాతికి గుర య్యారు. పోస్టుమార్టం నిమిత్తం ఆమె పార్థీవ దేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తీసుకొస్తున్న విషయం తెలు సుకొని ఆయన ఆస్పత్రికి చేరుకుని లాస్య తల్లి, సోదరిలను ఓదా ర్చి తన ప్రగాడ సంతాపం తెలిపారు. ఆయన మాట్లాడుతూ లాస్య తండ్రి సాయ న్న కూడా కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా సుదీర్ఘకాలం పాటు ప్రాతినిధ్యం వహించారని గుర్తు చేశారు. సాయన్న మరణించి ఇటీవలనే ఏడాది గడిచిందని, ఈ లోగానే రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత మరణించిందనే విషా దకరమైన వార్తను వినాల్సి వచ్చిందని.. ఇది అత్యంత భాధాకర మన్నారు. ఆ కుటుం బానికి మనోధైర్యం కల్పించాలని ఆ భగవం తుడిని కోరుతున్నట్టు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కార్ఖా నాలోని లాస్యనందిత నివాసంలో పార్థీవదేహం వెంట మాజీ మం త్రులు హరీష్‌రావు, వి.ప్రశాంత్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డిలు ఉన్నా రు. పార్థీవదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎమ్మెల్యే లాస్య నందితకు నివాళులు

నవతెలంగాణ-ఓయూ

కంటోన్మెంట్ శాసన సభ్యురాలు కుమారి లాస్య నందిత ఆకలమరణం చాలా బాధాకరం అని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, కార్మిక విభాగ అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కార్ఖానలో లాస్య నందిత పార్థివదేహనికి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడ సానుభూతి తెలిపారు.

తీవ్ర దిగ్భ్రాంతికి గురైన తీగుళ్ల పద్మారావుగౌడ్

నవతెలంగాణ-ఓయూ

కంటోన్మెంట్ ఎంఎంఏ లాస్య నందిత శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల సికింద్రాబాద్ శాసనసభ్యులు మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆమె మృతి తీవ్ర బాధాకరమని, చిన్న వయసులోనే నందిత ను కోల్పోవడం విచారకరమని పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఎంఎల్ఏ దివంగత సాయన్న కుమార్తెగా లాస్య నందిత ప్రజల్లో ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు.



ఉజ్జయిని మహంకాళి ఆలయంలో మాఘ మాసంలో ఆనవాయితీగా వస్తున్న కోటి కుంకుమార్చన పూజా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయంలో స్థానిక రామ్ గోపాల్‌పేట్ డివిజన కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ బ్రాహ్మణ మహిళలకు పసుపు కుంకుమలు సమర్పించి సుహాసిని అర్చన, పత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ-బేగంపేట

సినీ కార్మికుడికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



సినీ ఆర్టిస్ట్ డాన్సర్ పి.ఇజ్రాయెల్ యూనియన్ (కార్డు నెంబర్ 212) తన కు మారుడు రాకేష్ తీవ్ర అనా రోగ్యంతో ఆస్ప త్రిలో వైద్యం తీసుకుంటున్నాడని అసోసి యేషన్ తరపున తనకు ఆర్థిక సాయం అందించాలని మ నం సైతం అసోసియేష న్‌కు తెలియజేశారు. అనంతరం శుక్రవారం మనం సైతం చైర్మన్ కదాంబరి కిరణ్ వెంటనే రూ.25 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజే సినట్లు ఆయన తెలిపారు. సినీ కార్మికులు ఎవరైనా ఎలాంటి ఇబ్బందుల్లో ఉన్న వెంటనే స్పం దించాలన్నారు. ఈ విధమైన ఆర్థిక సహాయాన్ని గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నట్లు, అదే విధంగా సినీ కార్మికులు ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్న మనం సైతం సంస్థకు తెలియపరచాలని కోరారు.

ఓయూ నుంచి మేడారంకు యాత్ర



నవ తెలంగాణ-ఓయూ

సీఎం రేవంత్‌రెడ్డి మరో 10ఏండ్లు సీఎం గా ఉండాలని ఇటీవలే ఓయూ నుండి ఓయూ జేఏసీ నేత, కాంగ్రెస్ నేత ఓరుగంటి. కృష్ణ ఆధ్వర్యంలో ఓయూ నుండి చేపట్టిన పాదయాత్ర మేడారం చేరుకున్నట్లు తెలిపారు. అనంతరం వారికి మంత్రి సీతక్క ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం పాదయాత్ర బృందన్ని సీతక్క సత్కరించారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మరో 10ఏండ్లు సీఎంగా ఉండి తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని, అదే క్రమంలో ఎలాంటి ఆటంకాలు రావొద్దని కృష్ణ కోరుకున్నట్లు తెలిపారు.

చికిత్సపరమైన ఒత్తిడి నుంచి ఉపశమనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

సురక్షితమైన, సంతోషకరమైన వాతావరణంలో తమ కు కలుగుతున్న అనవసర కోపాలు, ఒత్తిడిని తొలగిం చుకోవడానికి ఉపశమనం లభించింది. నగరానికి చెందిన చెందిన సూరజ్, వ్యక్తులు తమ ఒత్తిడిని వదులుకోవ డా నికి, నియంత్రిత విధ్వంసం ద్వారా చికిత్సా విడుదలను కనుగొనే అసాధారణ స్థలాన్ని సృష్టించారు. ఈ సంద ర్భంగా సూరజ్ మాట్లాడుతూ 'షార్క్ ట్యాంక్‌పై పెట్టు బడిని పొందనప్పటికీ, అనుభవం ఆనందదాయకంగా ఉంది. మా రేజ్ రూమ్ కాన్సెప్ట్‌ను ప్రదర్శించడం మా అభి రుచి, సజనాత్మకతను ప్రదర్శించడానికి ఇది ఒక థ్రిల్లింగ్ అవకాశం. సొర చేపలకు పిచ్ చేసే ఆడ్రినలిన్ హడావిడి, వాటి అంతర్ దృష్టితో కూడిన అభిప్రాయం అమూల్య మైనది. మేం ఒప్పందాన్ని కుదుర్చుకునప్పటికీ, బహిర్గతం, నేర్చుకున్న పాఠాలు మమ్మల్ని ముందుకు నడిపిస్తాయి. గదిలోని శక్తి, నరాలు, ఆ క్షణపు ఉత్సాహం మరువలేనివి. మేం మా రేజ్ రూమ్ విజన్‌ని వాస్తవంగా మార్చుకోవ డానికి కొత్తగా వచ్చిన సంకల్పం, డ్రైవ్‌తో బయలుదేరాం. షార్క్ ట్యాంక్ అనేది ఒక పరివర్తన కలిగించే అనుభవం. మేం ఎల్లప్పుడూ ఎంతో ఆదరిస్తాం' అని తెలిపారు.

లాస్య నందిత అకాల మరణం బాధాకరం

● ప్రగాఢ సంతపాన్ని వ్యక్తం చేసిన పీ. సాయిబాబా

నవతెలంగాణ-సిటీబ్యూరో



కంటోన్మెంట్ శాసన సభ్యురాలు లాస్య నందిత అకాల మరణం బాధాకర మని సికింద్రాబాద్ టీడీపీ పార్లమెంటు అధ్యక్షులు పీ..సాయిబాబా తెలిపారు. శు క్రవారం పటాన్ చెరువు ఓఆర్.ఆర్ దగ్గర రోడ్డు ప్రమాదంలో మతి చెందడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఎంతో రాజకీయ భవిష్యత్తు కలిగిన ఆమె అకాల మరణం విచారకరమన్నారు. ఆ మె ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటు ంబ సభ్యులకు ప్రగాఢ సంతపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, యాదగిరిరావు, ఎస్.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్ పలు కాలనీలోని మహిళలు శు క్రవారం, మాజీ డిప్యూటీ మేయర్ బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌ను కలిసి, బోరబండ డివిజన్ మహిళలు తురేభాజ్ ఖాన్ ఫంక్షన్ హాల్ నుంచి బోరబండ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కాంగ్రెస్ పార్టీ, ప్రజా పాలనలో మహిళలకు బ్రహ్మ రథం పడుతున్నారని, ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారంటీ లలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 లకు గ్యాస్ పంపిణీ, 200యూనిట్ల ఉచిత విద్యుత్,రేషన్ కార్డు ఉన్నా వారికి 10 లక్షల ఆరోగ్య భీమా పథకం, నాలుగు పథకాలు అమలు చేస్తున్న సందర్భంగా, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హబిబా సుల్తాన, కృష్ణ వేణి, కవిత ,మహేశ్వరి ,కమలేశ్వరి, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నట్లు తెలిపారు.

మార్చి 4 నుంచి 6వ తేదీ వరకు డైరీ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్

నవ తెలంగాణ-బంజారాహిల్స్



50వ డైరీ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్‌ను మార్చి 4 నుంచి 6 తేదీ వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు ఇండియన్ డైరీ అసోసియేషన్ హైదరాబాద్ చాప్టర్ చైర్మెన్ సతీష్ తెలిపారు.ఈ సందర్భంగా శుక్రవారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో దీనికి సంబంధించిన బ్రోచర్లను అసో సియేషన్ ప్రతినిధులు రాజేశ్వరరావు బీవీకేరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు రోజులపాటు కొనసాగి ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం ఉందని అన్నారు. సుమారు 2500 మంది దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు ఇందులో హాజరవుతారని, పాడి పరిశ్రమ రం గంలో వస్తున్న మార్పులను పాడి రైతులకు వివరిం చేం దుకు ఈ సదస్సు ఎంతగా దోహదపడుతుందనీ తెలిపారు.



సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత భౌతికాయానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పి.విజయారెడ్డి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



చపాతీలు ఇలా చేస్తున్నారా?

మన దేశంలో చాలా మందికి చపాతీలు ఆహారంలో ఒక భాగం. కొందరు డైట్ పాటించే క్రమంలో రాత్రి పూట చపాతిలు తింటుంటారు. అయితే ఇవి చేసే క్రమంలో వారి వారి ఆరోగ్యాల రీత్యా కొన్ని జాగ్రత్తలు పాటిస్తుంటారు. అందులో కొందరు ఆయిల్ లేకుండా చపాతిని పెనం మీద కాలిస్తే కొందరు నేరుగా స్టవ్‌మీద కాలుస్తుంటారు. ఎందుకంటే ఆయిల్ లేకుండా పెనం మీద చేసిన చపాతి కొంచెం గట్టిగా ఉంటుంది. అలా కాకుండా నేరుగా స్టవ్ మీద కాలిస్తే మెత్తగా ఉంటుంది. అందువల్ల ఈ పద్ధతిని ఉపయోగించేందుకు ఇష్టపడుతుంటారు. అయితే ఇది ఏ మాత్రం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. దీని వల్ల ఆరోగ్యం సంగతి ఏమో కానీ అనారోగ్య సమస్యలు ఎక్కువవుతాయట. అవేంటో తెలుసుకుందాం.

ఒకప్పుడు చపాతీలు, పుల్కాలు నార్త్ ఇండియాలో ఎక్కువగా తింటారు. అయితే సౌత్ ఇండియాలోనూ వీటిని తినడం ఎక్కువైంది. ఆరోగ్యం ప్రకారం చపాతీలు కూడా మంచివే. చపాతీలు తింటే స్కిన్ హైడ్రేషన్ కాకుండా ఉంటాం. గోధుమ పిండితో చేసే చపాతీలు ఆరోగ్యానికి మంచి చేస్తాయి. చపాతీలు బరువు తగ్గించేందుకు ఉపయోగపడతాయి. కానీ చపాతీలు తయారుచేసేప్పుడు మాత్రం తప్పులు చేయకూడదు.

ఓ అధ్యయనం ప్రకారం... గ్యాస్ స్టవ్‌లు ఆరోగ్యానికి హాని కలిగించే వాయు కాలుష్యాలను విడుదల చేస్తాయని వెల్లడైంది. ఈ కాలుష్య కారకాలు, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, శ్వాస, జీర్ణక్రియకు ప్రమాదాన్ని కలిగిస్తాయి. అంతేకాదు క్యాన్సర్‌కు కూడా కారణమయ్యే అవకాశం ఉందని ఆ అధ్యయనాలు చెబుతున్నాయి.

ఇష్టం వచ్చినట్టుగా చపాతీలు తింటే అనారోగ్యం వస్తుంది. ఓ అధ్యయనం ప్రకారం.. కాల్చినా లేదా మాడిన ఆహార పదార్థాలు క్యాన్సర్ ప్రమాదాన్ని ఎక్కువగా పెంచుతాయి. అందుకే పుల్కాలు, చపాతీలు గ్యాస్ మీద నేరుగా కాల్చకూడదు. గతంలో వీటిని కట్టెల పొయ్యి మీద చక్కగా కాల్చేవారు. కానీ ఇప్పుడు దాదాపు అందరూ గ్యాస్ మీద నేరుగా కాలుస్తున్నారు. ఇది సురక్షితం కాదని నిపుణులు సూచిస్తున్నారు.

అందుకే చపాతీలు చేసేపుడు జాగ్రత్త వహించడం ఉత్తమం. ఆరోగ్యం కోసం తింటున్నామనుకుని అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంది.

కడ వరకు తోడుండేది భార్యే...

పెండ్లయిన కొత్తలో అంతా బాగానే ఉంటుంది. కానీ రోజులు గడిచే కొద్దీ భార్య భర్తల మధ్య చిన్న చిన్న గొడవలు రావడం సాధారణమే. అయితే చూసే వారికి అవి చాలా చిన్నగా కనిపిస్తాయి. ఈ మాత్రం దానికే ఇంతగా గొడవ పడాలా! అనే సందేహం కూడా కొందరికి వస్తుంది. కానీ అనుభవించే వారు మాత్రం వాటి వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ఆ సమస్యల నుండి ఎలా బయట పడాలో తెలియక సతమతమవుతుంటారు. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్...

ఐద్వా అదాలత్
సెల్: 9490098024



పల్లవి, అనిల్‌కి పెండ్లయి నాలుగేండ్లు అవుతుంది. నెలల బాబును ఎత్తుకొని హైదరాబాద్‌లోని సుందర్యపార్క్ వద్ద ఉన్న ఐద్వా అదాలత్ ఆఫీస్‌కి వచ్చింది పల్లవి. వారిది పెద్దలు కుదిర్చిన వివాహం. ఇంట్లో భార్య, భర్త, అత్తమ్మ కలిసి ముగ్గురే ఉంటారు. పెండ్లయిన ఏడాదికే బాబు పుట్టాడు. చిన్న కుటుంబం, అంతా బాగానే ఉంది కదా! ఇక సమస్యేంటీ అనుకుంటున్నారా? పెండ్లి తర్వాత పల్లవి భర్తతో కలిసున్న రోజులు చాలా తక్కువ. అనీల్, పల్లవితో సరిగ్గా మాట్లాడడు. ఎక్కువ శాతం వాళ్ళ అమ్మతోనే ఉంటాడు. పల్లవి వంట చేసినా అతనికి నచ్చదు. వాళ్ళ అమ్మ చేస్తేనే తింటాడు. దాంతో ఒక్క వంట తప్ప మిగిలిన పనులన్నీ పల్లవినే చేసేది. కూరగాయలు ఈమె కట్ చేసి ఇస్తే వాళ్ళ అత్త వంట చేసేది. మిగిలిన అన్ని పనులు చేసినా వంటగదికి వెళ్ళే హక్కు మాత్రం ఆమెకు లేదు. ఆమె టీ తాగాలన్నా, టిఫెన్ తినాలన్నా వాళ్ళ అత్త ఇస్తేనే. అన్నం కూడా ఆమె పెడితేనే తినాలి. అంతే గానీ పల్లవి పెట్టుకొని తినడానికి లేదు.

రోజూ ఉదయం చల్లని నీటితో స్నానం చేసి మడి కట్టుకోవాలి. ఆ తర్వాతనే పనులు చేయాలి. స్నానం చేయకుండా రూమ్‌లో నుండి బయటకు వచ్చిందంటే అత్త జానకమ్మ బూతులు తిట్టేది. ఇక నెలసరి సమయంలో అయితే ఆ ఐదు రోజులు పల్లవికి నరకం కనిపించేది. ఆమెను ఒక వస్తువులా చూస్తారు. ఎవరూ ముట్టుకునేవారు కాదు. కింద పడుకోవాలి. ఆమె పక్క నుండి కూడా నడిచేవారు కాదు. భర్త, అత్త ఇద్దరూ తాకితే మైల పడిపోతాము అనే వారు. పొరపాటుగా పల్లవి తన బట్టలు తాకినా అది తప్పు అనేవారు. ఐదు రోజుల తర్వాత ఇల్లు మొత్తం శుభ్రం చేయించేవారు. ఆమె బట్టలు, బొంతలు, బెడ్‌షీట్స్, అన్నీ ఉతకాలి. ఇంటి తలుపులు కూడా శుభ్రం చేయించేవారు. అనిల్ ఆమె దగ్గరకు కూడా వచ్చేవాడు కాదు. ఆ సమయంలో విపరీతమైన నొప్పితో పల్లవి విలవిల లాడిపోయేది. అలాంటి పరిస్థితుల్లో కూడా భర్త ఆమెను పట్టించుకునేవాడు కాదు. కనీసం ఆమెను కన్నెత్తి చూసేవాడు కాదు. ఆమెకు సహకరిస్తే మళ్ళీ స్నానం చేయాల్సి వస్తుంది అనేవాడు.

శారీరకంగా కలుసుకోవడం కూడా తప్పు కార్యం అన్నట్లుగా భావించే వాడు. ఎప్పుడూ భగవంతుడిని తలచుకోవాలి అంటాడు. ఎప్పుడైనా ఒక్కసారి పల్లవి దగ్గరకు వచ్చేవాడు. అప్పుడు కూడా జానకమ్మ కొడుకుని తిట్టేది. దాంతో ఎక్కువగా వాళ్ళ అమ్మ దగ్గరే పడుకునే వాడు. ఇలాంటి పరిస్థితుల్లోనే పల్లవి గర్భవతి అని తెలిసింది. ఐదో నెల రాగానే పల్లవిని తల్లిగారింటికి పంపించారు. అక్కడే ఆమెకు బాబు పుట్టాడు. బాబు పుట్టి మూడు నెలలు గడిచాయి. అయినా అనిల్ గానీ, జానకమ్మ గానీ చూడటానికి వెళ్ళలేదు. 'బాబును ఉయ్యాలలో వేస్తున్నాము' అని కబురు చేస్తే అలా వెళ్ళి ఇలా తిరిగి వచ్చేశారు. కనీసం డెలివరి అయినప్పుడు కూడా వెళ్ళలేదు. భర్త, అత్త ఎందుకిలా చేస్తున్నారో పల్లవికి అర్థం కాలేదు. అసలు సమస్య ఎక్కడుందో తేల్చుకోవాల్సిన సమయం వచ్చింది అనుకుంది. తన సమస్యలన్నీ చెప్పుకోవాలని ఐద్వా అదాలత్ ఆఫీస్‌కి వచ్చింది.

పల్లవి చెప్పిందంతా విన్న తర్వాత మేము అనిల్‌ను, జానకమ్మను పిలిపించాము. జానకమ్మతో మాట్లాడితే 'మా ఇంట్లో ఒక పద్ధతి ఉంటుంది. ఉదయం లేవగానే స్నానం చేసిన తర్వాతే ఏ పనైనా చేయాలి. అది పల్లవికి ఇష్టం లేదు. అందుకే ఆమె తల్లిగారింటికి వెళ్ళి తిరిగి రావడం లేదు. ఆమె వస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు' అంది. పల్లవి భర్త అనిల్‌తో మాట్లాడితే 'అవును పల్లవి చెప్పింది మొత్తం నిజమే. మా అమ్మ చేసిన వంటనే నేను తింటాను. నేను చిన్నప్పటి నుండి మా అమ్మ చేతి వంటే తినేవాడిని. ఆమెకు నేను తప్ప ఇంకెవరున్నారు? అందుకే నేను మా అమ్మతోనే పడుకుంటాను. ఆఫీసు నుండి వచ్చిన తర్వాత కూడా ఆమెతోనే మాట్లాడుతూ కూర్చుంటాను. ఇకపోతే పల్లవితో అంటారా... ఆమెకు ఎప్పుడూ ఒకే ధ్యాస. నేను ఆమెతో మాట్లాడాలి. ఆమెతో సమయం గడపాలి. మా అమ్మతో కాకుండా ప్రతి రోజూ నేను రూంలో ఆమెతోనే ఉండాలి. భార్యాభర్తలు రోజూ కలుసుకోవల్సిన అవసరం లేదు. అది కేవలం పిల్లల కోసం చేసే పని. ఇప్పుడు మాకు బాబు పుట్టాడు. కాబట్టి ఇక మేమిద్దరం లైంగికంగా కలుసుకోవలసిన అవసరమే లేదు. ఆమెను ఇంటికి తీసుకు వస్తే తనతోనే ఉండమని అడిగిద్ది. అందుకే తీసుకు రావడం లేదు. నెలసరి సమయంలో కూడా ఆమె పట్ల జాగ్రత్తలు తీసుకుంటాను. కాకపోతే ఆమెను తాకితే వెంటనే స్నానం చేయాలి. అందుకే దూరంగా ఉంటాను. దాన్ని కూడా తప్పుగా చూపిస్తే ఎలా?' అన్నాడు.

దానికి మేము 'నెలసరి అనేది ప్రతి మహిళకు, ప్రతి నెలా వచ్చే ఒక సహజ క్రమం. అంతే గానీ ఇంకొకటి కాదు. ఆ సమయంలో మహిళలకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. కాబట్టి కేర్ తీసుకోవల్సిన బాధ్యత మీది. దాని వల్ల మీరు మైల పడిపోవడం అంటూ ఏమీ ఉండదు. ఈ రోజుల్లో కూడా మీ ఆలోచన ఇలా ఉండటం సరైనది కాదు. ఇకపోతే పెండ్లి చేసుకున్న తర్వాత భార్యను ప్రేమగా చూసుకోవల్సిన బాధ్యత భర్తగా నీకుంది. భార్యంటే మధ్యలో వచ్చి మధ్యలో వెళ్ళిపోయే చుట్టం కాదు. జీవితాంతం నీకు తోడుగా వుండే నీ మనిషి. ఆమెతో మాట్లాడాలి. రోజులో కొంత సమయం ఆమె కోసం కేటాయించాలి. మీ అమ్మకు మీరు తప్ప ఎవ్వరూ లేరని ఎలా అంటున్నావో, అలాగే నీ భార్యకు నువ్వు తప్ప ఎవ్వరూ లేరని గుర్తు పెట్టుకోవాలి.

ప్రతి రోజూ భార్యాభర్తలు సంతోషంగా గడపడం వల్ల ఇద్దరి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇద్దరి మధ్య బంధం బలపడుతుంది. కానీ దాన్ని కూడా నువ్వు తప్పుగా భావిస్తున్నావు. లైంగిక సంబంధం కేవలం పిల్లల కోసం మాత్రమే అనే నీ మాటలు వింటుంటే మాకు జాలేస్తుంది. నువ్వు చెప్పిన ప్రకారం అయితే పిల్లలు కన్న తర్వాత ఏ భార్యాభర్తలు కలిసి ఉండాల్సిన పని లేదు. ఇప్పటికైనా నీ ఆలోచనా ధోరణి మార్చుకో. భార్యతో సంతోషంగా ఉండటం నేర్చుకో. అవసరమైతే మీ అమ్మను కొన్ని రోజులు మీ అన్నయ్య వాళ్ళ ఇంటికి పంపించి ఇంట్లో మీరిద్దరూ కలిసి ఉండండి. ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ ప్రేమగా ఉండండి. బాబు పనులు కూడా ఇద్దరూ కలిసి చూసుకోండి' అని చెప్పి పంపించాము.

> **ప్రతి రోజూ భార్యాభర్తలు సంతోషంగా గడపడం వల్ల ఇద్దరి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇద్దరి మధ్య బంధం బలపడుతుంది. కానీ దాన్ని కూడా నువ్వు తప్పుగా భావిస్తున్నావు. లైంగిక సంబంధం కేవలం పిల్లల కోసం మాత్రమే అనే నీ మాటలు వింటుంటే మాకు జాలేస్తుంది. నువ్వు చెప్పిన ప్రకారం అయితే పిల్లలు కన్న తర్వాత ఏ భార్యాభర్తలు కలిసి ఉండాల్సిన పని లేదు. ఇప్పటికైనా నీ ఆలోచనా ధోరణి మార్చుకో. భార్యతో సంతోషంగా ఉండటం నేర్చుకో.**



- వై. వరలక్ష్మి, 9948794051

స్వామినాథన్‌కు భారతరత్న ఇస్తారు... రైతాంగాన్ని అణచివేస్తారు

(మొదటిపేజీ తరువాయి)

మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. తద్వారా బీజేపీ విధానాలను ఎండగట్టాలని నిర్ణయించామన్నారు. సొంతంగా 370, మిత్రులతో కలిసి 400 సీట్లు సాధిస్తామంటూ మోడీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నదని అన్నారు. భారత్ వెలిగిపోతున్నదని వాజ్‌పేయి హయాంలో ప్రచారం చేశారని గుర్తు చేశారు. అదే తరహాలో ఇప్పుడు మోడీకి శృంగభంగం తప్పదని హెచ్చరించారు. ఇండియా కూటమిలో సీట్ల సర్దుబాటు ప్రారంభమైందనీ, యూపీ, ఢిల్లీలో సయోధ్య కుదురుతున్నదని వివరించారు. ఉమ్మడి శక్తిగా మతోన్మాదాన్ని ఎదుర్కొంటామన్నారు. బీజేపీ పీడను వదిలించుకుంటేనే దేశానికి మేలు కలుగుతుందన్నారు. కేంద్రం పదేండ్లలో తెలంగాణకు చేసిన అన్యాయంపై శ్వేతపత్రం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం విధానాలను నిరసిస్తూ కర్నాటక సీఎం సిద్ధరామయ్య, కేరళ సీఎం విజయన్ ఢిల్లీలో ధర్నా చేశారని గుర్తు చేశారు. మూసీని ప్రతిష్టాత్మక నదిగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నదని చెప్పారు. గంగానది ప్రక్షాళనకు కేంద్రం నిధులిచ్చిందని గుర్తు చేశారు. అదే తరహాలో మూసీ శుద్ధికి కేంద్రం నిధులివ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కోరాలన్నారు. ప్రయివేటు సంస్థలకివ్వడం సరైంది కాదన్నారు. బీజేపీవైపు ఉంటారో? దూరంగా ఉంటారో? బీఆర్ఎస్ తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీకి దగ్గరయ్యేందుకు దూరంగా ఉన్నారా? దానిపై పోరాడతారా? స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. రాష్ట్రంలో బీజేపీ పునాది లేకుండా చేయాలన్నారు. చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో ఇండియా కూటమిలోని పార్టీలను కలుపుకోకుండా ఎంత నష్టపోయిందో ఆ చేదు అనుభవం ద్వారా కాంగ్రెస్ నేర్చుకుందన్నారు. అందుకే మిత్రులతో సయోధ్యతో ఉండాలని భావిస్తున్నదని చెప్పారు.

27 నుంచి అమలు

(మొదటిపేజీ తరువాయి)

సీతక్క, కొండా సురేఖతో కలిసి తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. సమ్మక్క-సారలమ్మ అంటేనే పోరాట స్ఫూర్తి అని, ప్రజలపై ఆధిపత్యం చలాయించి.. వారిని పీడించైనా పన్నులు వసూలు చేయాలనుకున్న రాజులపై కలిసికట్టుగా పోరాడారని కొనియాడారు. ఆ స్ఫూర్తితోనే ప్రజా పాలన ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించడానికి తమ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తున్నదని తెలిపారు. దక్షిణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతరను కేంద్ర ప్రభుత్వం జాతీయ పండగగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేడారం జాతరకు కేంద్రం రూ.3 కోట్లు కేటాయించిందనీ, తెలంగాణను కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందనడానికి జాతర పట్ల వ్యవహరిస్తున్న తీరు నిదర్శనమన్నారు. అయోధ్యలో రాముడిని దర్శించుకోవాలని ప్రధాని మోడీ, మంత్రి అమిత్‌షా చెప్పారని, ఆ మాదిరిగానే మేడారం జాతరను వారిద్దరూ దర్శించుకోవాలని అన్నారు. వారికి అధికారిక హోదాలో స్వాగతం పలుకుతామన్నారు. జాతీయ హోదా ఇవ్వలేమని కిషన్‌రెడ్డి ఆదివాసీలను అవమానించారని తెలిపారు.

జర్నలిస్టుల అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

తాము అధికారంలోకొచ్చి వంద రోజులు కాలేదని, పదేండ్లు ఓపిక పట్టారని, ఇంకొన్ని రోజుల్లో జర్నలిస్టుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని సీఎం స్పష్టంచేశారు. ప్రభుత్వాన్ని తేవడంతోనే జర్నలిస్టుల పని అయిపోలేదని, కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టడానికి సహకరించాలని కోరారు. త్వరలోనే ప్రెస్ అకాడమీ చైర్మెన్‌నూ నియమిస్తామని తెలిపారు. గతంలో జర్నలిస్టులను సచివాలయంలోకి రానివ్వలేదని, ఇప్పుడు ప్రతి ఛాంబర్‌కు వెళ్లే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

కాళేశ్వరం దోపిడీపై బీజేపీ ఎందుకు స్పందించదు..

కాళేశ్వరం ప్రాజెక్టులో దోపిడీ, అక్రమాలు, నిర్లక్ష్యం కండ్లకు కట్టినట్టు చూపించినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని సీఎం రేవంత్ ప్రశ్నించారు. మేడిగడ్డపై తాము జ్యుడిషియల్ విచారణకు అనుమతిచ్చిన తర్వాత దాన్ని సీబీఐకి అప్పగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ-బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందాలు చేసుకుంటున్నాయని, పది సీట్లు బీజేపీకి, ఏడు సీట్లు కేసీఆర్‌కు మాట్లాడుకొని ఎన్నికలకు రాబోతున్నారన్నారు.

ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ఖజానా ఖాళీ అయ్యిందనే పేరుతో వాటిని అమలు చేయకుండా ఉండడం సరైంది కాదని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని అన్నారు. ప్రభుత్వ చర్యను బట్టి ప్రతి చర్య ఉంటుందన్నారు. గ్యారంటీల అమలు తీరు ఆధారంగా భవిష్యత్తులో తమ కార్యాచరణ ఉంటుందని చెప్పారు. రానున్న కాలంలో సమరశీల పోరాటాలకు సన్నద్ధమవుతామని అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలనీ, కనీస వేతనాల జీవోలను అవసరాలకు అనుగుణంగా సవరించాలని డిమాండ్ చేశారు. ఇండ్లు, ఇండ్లస్థలాలు, సాగుభూముల సమస్యను పరిష్కరించాలనీ, భూపోరాట కేంద్రాల్లో ప్రజలపై నమోదు చేసిన కేసులను ఎత్తేయాలని కోరారు. సమగ్ర భూసర్వే జరిపి ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. పేదలు, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలన్నారు. ధరణి లోపాలను సవరించాలని చెప్పారు. మూసీనదిలో కాల్యుష్యాన్ని అరికట్టాలనీ, పేదలకు నష్టం లేకుండా మూసీ మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయాలని కోరారు. ఆ పరివాహక ప్రాంత గ్రామాలకు స్వచ్ఛమైన తాగు, సాగునీరందించాలని సూచించారు. సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలని రాష్ట్ర ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యావైద్య రంగాలను బలోపేతం చేయాలంటూ రాష్ట్ర విస్తృత సమావేశంలో తీర్మానాలను ఆమోదించామని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. 200 రోజులపని కల్పించాలనీ, కూలి రూ.700 చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరువు వచ్చిందనీ, పంటనష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవికి మల్లు రవి రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఇవ్వండని కొంతమంది చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తాను వారం రోజుల కిందటే ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవికి రాజీనామా చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశానని చెప్పారు. తప్పనిసరిగా నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మినాజ్, అశోక్ యాదవ్, నిత్యానందం కౌన్సిలర్ రాజు, రమేష్ బహదూర్, యాదయ్య, కాజాలిముద్దీన్, ఫాహేద్, ఖాజా, బాబా తదితరులు ఉన్నారు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ లాంఛనాలతో మారేడ్‌పల్లిలో పూర్తయ్యాయి. ప్రమాదానికి సంబంధించి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, ఏఎస్పీ సంజీవరావు వివరాలు వెల్లడించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత(37) గురువారం రాత్రి 11 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి రెండు కార్లలో బయలుదేరారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం, ఆరూర్ గ్రామంలో మిస్కిన్‌షా బాబా దర్గాను సందర్శించారు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు. ఆ తర్వాత అల్పాహారం కోసమంటూ శుక్రవారం ఉదయం 5.10 గంటల సమయంలో ఆమె డ్రైవర్‌తో కలిసి బయటకు వచ్చారు. శామీర్‌పేట వద్ద ఓఆర్ఆర్‌పైకి వచ్చి సుల్తాన్‌పూర్ టోల్‌ప్లాజా దాటిన తర్వాత డ్రైవర్ ఆకాశ్ నిద్రమత్తు వల్ల స్టీరింగ్‌పై నియంత్రణ కోల్పోయాడు. కారు అదుపు తప్పడంతో ముందు ఓ గుర్తు తెలియని వాహనాన్ని గుద్దుకుని.. ఎడమ వైపు ఉన్న ఓఆర్ఆర్ మెటల్ బీమ్‌కు బలంగా ఢీకొట్టారు. కారు ముందు భాగం నుజ్జు నుజ్జైంది.. దాంతో కారులో ముందు సీట్లో కూర్చున్న ఎమ్మెల్యే లాస్య నందిత తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వెంటనే ఆమెను, డ్రైవర్‌ను పటాన్‌చెరులోని అమేధ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. దీంతో లాస్య మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫోరెన్సిక్ వైద్యుల పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ఆకాష్‌ను మియాపూర్‌లోని శ్రీకర ఆస్పత్రికి తరలించారు. ఫోరెన్సిక్, క్లూస్ టీంతో పాటు రవాణా శాఖ అధికారులతో ఏఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రవిందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే లాస్య నందిత మరణ వార్త తెలిసిన వెంటనే మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు వెంటనే అమేధ లాస్య మృతదేహాన్ని చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ఎమ్మెల్యే లాస్య నందిత అంత్యక్రియలు శుక్రవారం రాత్రి హైదరాబాద్ మారేడ్‌పల్లి శ్మశాన వాటికలో ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. ముందుగా గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కార్ఖానా గృహలక్ష్మి కాలనీలోని ఆమె ఇంటికి తరలించారు. అక్కడ వివిధ పార్టీల నేతలు, అధికారులు, పలువురు ప్రముఖులు ఆమె భౌతికకాయానికి నివాళ్లర్పించారు. తర్వాత అంతిమయాత్ర సాగింది. మారేడ్‌పల్లి హిందూ హ్మశాన వాటికకు సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు చేరుకుంది. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి తదితరులు పాడె మోశారు. అనంతరం పోలీసులు గాలిలో మూడుసార్లు కాల్పులు జరిపి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వేలాదిమంది అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడకు వచ్చారు. హరీశ్‌రావు కార్యక్రమం పూర్తయ్యే వరకు కుటుంబ సభ్యుల వెన్నంటే ఉన్నారు.

సీఎం రేవంత్ నివాళ్లు

ఎమ్మెల్యే లాస్య నందిత భౌతికకాయానికి ఆమె ఇంట్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం నుంచి అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. సీఎంతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పలువురు నేతలు నివాళులర్పించారు.

బీఆర్ఎస్ అధినేత నివాళి

లాస్య నందిత భౌతికకాయానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ భౌతికకాయానికి నివాళ్లర్పించారు. లాస్య తల్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ కేశవరావు, ప్రజాశాంతి వ్యవస్థాపకుడు కేఏ పాల్ తదితరులు లాస్య భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

పోస్టుమార్టం రిపోర్టులో కీలక అంశాలు

ఎమ్మెల్యే లాస్య నందిత మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు రిపోర్టు ప్రాథమిక నివేదిక ప్రకారం.. లాస్య తలకు బలమైన గాయాలయ్యాయి. తై బోన్, రిబ్స్ విరిగిపోయాయి. ఒక కాలు పూర్తిగా విరిగిపోయిందని, దవడ ఎముకలు విరగడంతోపాటు దంతాలు ఊడిపోయాయని తెలుస్తోంది. పక్కటెముకలు చాలా వరకు దెబ్బతిన్నాయి. తలకు బలమైన గాయాలు కావడం వల్లే స్పాట్‌లోనే చనిపోయిందని వైద్యులు వెల్లడించారు.

డ్రైవర్‌పై ఫిర్యాదు

తన సోదరి లాస్య నందిత మరణంపై అనుమానాలు ఉన్నాయని, డ్రైవర్ కం పీఏపై ఎమ్మెల్యే సోదరి నివేదిత పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రమాదం ఉద్దేశపూర్వకంగానే చేసినట్టుగా అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. నల్లగొండలో జరిగిన సంఘటనపై డ్రైవర్‌ను మందలించడంతో.. కోపంతో ఏమైనా చేసి ఉంటారన్న కోణంలో డ్రైవర్‌పై ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. నివేదిత ఫిర్యాదు మేరకు ఆకాశ్‌పై కేసు నమోదు చేసి ప్రమాదంపై నిపుణుల సమక్షంలో దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్పీ సంజీవరావు తెలిపారు. పది రోజుల వ్యవధిలోనే ఆమె రెండోసారి రోడ్డు ప్రమాదానికి గురికావడం గమనార్హం.

మోడీ నియంత

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు ఈడీ, సీబీఐ వంటి కేంద్ర ఏజెన్సీలను ప్రత్యర్థి పార్టీలు, తమకు గిట్టనివారిపై ఆయుధాలుగా వాడుకుంటున్నదన్న ఆరోపణలు ఇప్పటికే ఉన్నాయి. ఇప్పుడు ఇదే ఆరోపణను జమ్మూకాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ వినిపిస్తున్నారు. దక్షిణ ఢిల్లీలోని తన నివాసంలో సీబీఐ దాడులు చేసిన విషయం విదితమే. ఈ సోదాలపై ఆయన స్పందించారు. ప్రధాని మోడీ ఒక నియంత అనీ, పుల్వామా దుర్ఘటనపై ప్రశ్నించినందుకే తనపై మోడీ సర్కారు ఇలా సోదాలు చేయిస్తున్నదని సత్యపాల్ మాలిక్ ఆరోపించారు. సత్యపాల్ మాలిక్ ఈ ఒక్క విషయంపైనే కాకుండా పలు అంశాల్లో మోడీ సర్కారును విమర్శించాడు. మోడీ సర్కారుపై సత్యపాల్ మాలిక్ తాజాగా చేసిన ఆరోపణలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. నిన్నటి సీబీఐ దాడి తర్వాత మాలిక్ మోడీని నియంతగా అభివర్ణించారు. "ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేయటం ద్వారా నియంత నన్ను భయపెట్టటానికి ప్రయత్నిస్తున్నాడు. నేను రైతు కొడుకుని. నేను భయపడను" అని సత్యపాల్ మాలిక్ అన్నారు. కాశ్మీర్‌లోని చీనాబ్ నదిపై కిరు జలవిద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి ఫిబ్రవరి 22న సీబీఐకి చెందిన సుమారు 100 మంది సిబ్బంది సోమ్ విహార్‌లోని మాలిక్ ఇంటికి, 29 ఇతర ప్రాంగణాలకు వెళ్లి దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్‌తో వెళ్తే కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేస్తుంది

న్యూఢిల్లీ : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి ఆప్ ముందుకు సాగితే కేజ్రీవాల్‌ను సీబీఐ ద్వారా అరెస్టు చేయించాలని కేంద్రంలోని మోడీ సర్కారు యోచిస్తున్నదని ఆప్ వర్గాలు ఆరోపించాయి. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలని సీబీఐ యోచిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల నుంచి తెలిసిందని ఢిల్లీ మంత్రి, ఆప్ ఎమ్మెల్యే అతిషి అన్నారు. "అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ నుంచి ఏడుసార్లు సమన్లు అందినట్టు గత రెండు నుంచి రెండున్నర నెలలుగా మనందరం చూస్తున్నాము. అయితే ఇప్పుడు ఈడీ ద్వారా కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయటం కుదరదని బీజేపీ నేతృత్వంలోని కేంద్రానికి అర్థమైంది. అందుకే ఇప్పుడు కేంద్రం సీబీఐని తీసుకొచ్చి, దాని ద్వారా కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయాలని ప్లాన్ చేస్తున్నది" అని ఆమె తెలిపారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటే ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తారని తమకు సమాచారమందిందని గత రెండు రోజుల్లో ఆప్ నేతలు మీడియాకు చెప్పటం ఇది రెండోసారి కావటం గమనార్హం. ఫిబ్రవరి 22న కూడా అతిషి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఆ ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- గురుకుల పాఠశాలలో మరణించిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి
- ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శికి కేవీపీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సూర్యాపేట జిల్లా ఇమాంపేట గురుకుల పాఠశాలలో చదువుతూ మరణించిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని,ఆయా ఘటనలపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ కులాల అభివృద్ధి శాఖా ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్‌కు సంఘం అధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్కైలాబ్ మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థుల మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత సర్కారుదేనని తెలిపారు. వైష్ణవి, అస్మితల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలనీ, రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లు లేదా ఐదెకరాల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల జీవితాలకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలన్నారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కోట గోపి, రాష్ట్ర కమిటీ సభ్యులు బాలపీరు, వైష్ణవి తల్లిదండ్రులు దగ్గుపాటి వెంకన్న, భాగ్యమ్మ హస్మిత, తల్లి ఇరుగు జ్యోతి టీఎస్ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు పాలడుగు పరుశరాములు, నాయకులు సోమపంగు నర్సయ్య క్రాంతి పాల్గొన్నారు.



తొలిరోజు సగం.. సగం...

• ఆకాశ్ దీప్‌కు మూడు వికెట్లు • రూట్ సెంచరీ - ఇంగ్లండ్ 302/7



రాంచీ: నాల్గోటెస్ట్‌లో టీమిండియా బౌలర్లు ఏడు వికెట్లు పడగొట్టగా.. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ సెంచరీతో కదం తొక్కాడు. టీమిండియా, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న నాలుగో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. ఆట చివరికి ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ లో 7 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. ఇంగ్లండ్ స్టార్ బ్యాట్స్ మన్ జో రూట్ సెంచరీ సాధించి అజేయంగా నిలవడం విశేషం. రూట్‌కు ఇది కెరీర్ లో 31వ టెస్టు సెంచరీ. టీమిండియా కొత్త పేసర్ ఆకాశ్ దీప్ ధాటికి 112 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్ జట్టును జో రూట్ ఆదుకున్నాడు. వికెట్ కీపర్ బ్యాట్స్ మన్ బెన్ ఫోక్స్ తో కలిసి వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేశాడు. బెన్ ఫోక్స్ 126 బంతుల్లో 47 పరుగులు చేశాడు. ఈ జోడీని సిరాజ్ విడదీశాడు. బెన్ ఫోక్స్ ను అవుట్ చేసిన సిరాజ్... ఆ తర్వాత టామ్ హార్ట్ లేను పెవిలియన్ చేర్చాడు. దాంతో ఇంగ్లండ్ ఏడో వికెట్ కోల్పోయింది. ఈ క్రమంలోనే సెంచరీ పూర్తి చేసుకున్న రూట్... ఓల్లీ రాబిన్సన్ తో కలిసి విలువైన భాగస్వామ్యం నెలకొల్పాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి రూట్ 106 పరుగులతోనూ, రాబిన్సన్ 31 పరుగులతోనూ క్రీజులో ఉన్నారు. రూట్ మొత్తం 223 బంతులు ఎదుర్కొని 9 ఫోర్లు కొట్టాడు. టీమిండియా బౌలర్లలో ఆకాశ్ దీప్ 3, సిరాజ్ 2, జడేజా 1, అశ్విన్ 1 వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. కెరీర్ లో తొలి టెస్టు ఆడుతున్న ఆకాశ్ దీప్ మూడు వికెట్లతో ఇంగ్లండ్ టాపార్డర్ ను దెబ్బతీశాడు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ లో ఓపెనర్లు జాక్ క్రాలే 42, బెన్ డకెట్ 11 పరుగులు చేశారు. ఓల్లీ పోప్ (0) డకౌట్ కాగా, జానీ బెయిర్ స్టో 38 పరుగులతో ఓ మోస్తరుగా రాణించాడు . కెప్టెన్ బెన్ స్టోక్స్ (3) నిరాశపరిచాడు.

ఆకాశ్‌దీప్ అరంగేట్రం..

బెంగాల్ పేసర్ ఆకాశ్ దీప్ అరంగేట్రం టెస్టులో అంచనాలకు మించి రాణించాడు. ఇంగ్లండ్ టాపార్డర్‌ను కకావికలం చేసి తన అరంగేట్రాన్ని ఘనంగా చాటుకున్నాడు.

బుల్లెట్ లాంటి బంతులతో తొలి మూడు వికెట్లు తీసి ఔరా అనిపించాడు. బుమ్రా స్థానాన్ని భర్తీ చేస్తూ సెలెక్టర్ల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. రాంచీలో అతడి స్పెల్ చూసినవాళ్లంతా మరో ఫాస్ట్ బౌలర్ దొరికాడంటూ ఆకాశ్‌ను ఆకాశానికెత్తేస్తున్నారు.

స్కోర్‌బోర్డు...

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (బి)ఆకాశ్ దీప్ 42, డకెట్ (సి)ధ్రువ్ జురెల్ (బి)ఆకాశ్ దీప్ 11, పోప్ (ఎల్‌బి)ఆకాశ్ దీప్ 0, రూట్ (బ్యాటింగ్) 106, బెయిర్‌స్టో (ఎల్‌బి)అశ్విన్ 38, బెన్ స్టోక్స్ (ఎల్‌బి)జడేజా 3, ఫోక్స్ (సి)జడేజా (బి)సిరాజ్ 47, హార్ట్‌లీ (బి)సిరాజ్ 13, రాబిన్సన్ (బ్యాటింగ్) 31, అదనం 11. (90ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 302పరుగులు.

వికెట్ల పతనం:

1/47, 2/47, 3/57, 4/109, 5/112, 6/225, 7/245

బౌలింగ్:

సిరాజ్ 13-3-60-2, ఆకాశ్ దీప్ 17-0-70-3, జడేజా 27-7-56-1, అశ్విన్ 22-1-83-1, కుల్దీప్ 10-3-21-0, జైస్వాల్ 1-0-6-0

అట్టహాసంగా డబ్ల్యుపిఎల్ ప్రారంభం

ప్రత్యేక ఆకర్షణగా షారుక్ ఖాన్



బెంగళూరు: టాటా ఉమెన్స్ ప్రిమియర్ లీగ్(డబ్ల్యూపిఎల్) 2024 బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమైంది. టోర్నీ ప్రారంభానికి ముందు ప్రారంభోత్సవ వేడుకలు జరిగాయి. బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ ప్రత్యేకంగా ఐదు టీమ్‌ల కెప్టెన్లను పరిచయం చేసుకుని, తనదైన శైలిలో ఆటపాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే' సినిమాలోని పాటలకు షారూక్ ఐదుజట్ల కెప్టెన్లతో కలిసి స్టెప్పులేశారు. తొలుత ప్రేక్షకులను ఉత్సాహపరుస్తూ సందేశాన్నిచ్చారు. షారుఖ్ ఖాన్‌తోపాటు యువ హీరోలు టైగర్ ష్రాఫ్, వరుణ్ ధావన్, షాహిద్ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రాలతో కలిసి సందడి చేశారు. యువ హీరోల డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ ఆడియన్స్‌ను ఆకట్టుకుంది. కార్తిక్ ఆర్యన్ అద్భుత ప్రదర్శనతో ప్రారంభోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. టాస్ గెలిచిన ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ బౌలింగ్ ఎంచుకోగా.. మెగ్ లానింగ్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తొలిగా బ్యాటింగ్‌కు దిగింది.

హైదరాబాద్‌లో సీసీఎల్

• 10 వేల మంది విద్యార్థులకు ఫ్రీ ఎంట్రీ



హైదరాబాద్ : సెలబ్రెటీ క్రికెట్ లీగ్ (సీసీఎల్)కు హైదరాబాద్ ఆతిథ్యమిస్తోందని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగనమోహన రావు వెల్లడించారు. బాలీవుడ్, టాలీవుడ్‌తో పాటు దేశంలోని వివిధ సినీ ఇండస్ట్రీ ప్రముఖులు ఈ లీగ్‌లో ఆడనున్నారని చెప్పారు. ఈ లీగ్ తొలి అంచె పోటీలు ఇప్పటికే షార్జాలో జరుగుతుండగా, రెండో అంచె మ్యాచ్‌లు వచ్చే నెల 1వ తేదీ నుంచి మూడ్రోజుల పాటు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలుగు వారియర్స్ జట్టుకు హిరో అక్కినేని అఖిల్ నాయకత్వం వహిస్తున్నాడని చెప్పారు. 'రోజుకు రెండు మ్యాచ్‌లు చొప్పున మొత్తం ఆరు మ్యాచ్‌లు ఉప్పల్ స్టేడియంలో నిర్వహిస్తున్నాం. కళాశాల విద్యార్థులను ఉచితంగా అనుమతించాలని సీసీఎల్ నిర్వాహకులను నేను కోరగా వారు అంగీకరించారు. రోజుకు పది వేల మంది విద్యార్థులకు కాంప్లిమెంటరీ పాసులు ఇవ్వనున్నాం. ఆసక్తి గల విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ తమ విద్యార్థుల పేర్లను హెచ్‌సీఏ ఈమెయిల్ ఐడీకి ఈనెల 27వ తేదీలోపు పంపించాలి' అని జగనమోహన రావు తెలిపారు.

బౌలింగ్‌లో చెలరేగిన శశికాంత్, నితీష్

• మధ్యప్రదేశ్ 234/9
• రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్స్



ఇండోర్: రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్లో ఆంధ్ర బౌలర్లు శశికాంత్, నితీశ్ కుమార్ చెలరేగారు. దీంతో టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన మధ్యప్రదేశ్‌ను తొలిరోజే ఆంధ్ర బౌలర్లు కట్టడి చేశారు. శశికాంత్ నాలుగు, నితీశ్ కుమార్ మూడు వికెట్లతో సత్తా చాటడడంతో మధ్యప్రదేశ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 9వికెట్ల నష్టపోయి 234పరుగులు చేసింది. మధ్యప్రదేశ్ ఓపెనర్లు యశ్ దూబే(64), హిమాన్షు(49) తొలి వికెట్‌కు 123 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరు ఔటయ్యాక ఆంధ్ర బౌలర్లు చెలరేగారు. దీంతో మధ్యప్రదేశ్ జట్టు ఓ దశలో 159పరుగులకే 7వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో సరళ్ జైన్(41నాటౌట్), కార్తికేయ(29) ఆదుకున్నారు. చివరి సెషన్‌లో మరో రెండు వికెట్లను ఆంధ్ర బౌలర్లు నేలకూల్చడంతో మధ్యప్రదేశ్ భారీస్కోర్ చేయకుండా అడ్డుకున్నారు. ఇతర క్వార్టర్‌ఫైనల్లో కర్ణాటకపై విదర్భ జట్టు 3వికెట్ల నష్టానికి 261పరుగులు చేయగా.. తమిళనాడుతో జరుగుతు మ్యాచ్‌లో సౌరాష్ట్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 183పరుగులకే ఆలౌటైంది. మరో క్వార్టర్‌ఫైనల్లో బరోడాపై ముంబయి జట్టు 5వికెట్ల నష్టానికి 248పరుగులు చేసింది.



పోరాడి ఓడిన హైదరాబాద్

హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టుకు రెండో ఓటమి ఎదురైంది . గురువారం చెన్నై లోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచలో హైదరాబాద్ 0-3తో అహ్మదా బాద్ డిఫెండర్స్ చేతిలో పరాజయం పాలైంది. హెూరాహెూరీ గా జరిగిన ఈ మ్యాచలో తొలి సెట్‌లో 15-17, రెండో సెట్‌లో 13-15, మూడో సెట్‌లో 11-15తో పోరాడి ఓడింది. ఈనెల 26న జరగనున్న తదుపరి మ్యాచలో ఢిల్లీ తుఫాన్స్‌తో హైదరాబాద్ తలపడనుంది.



'చెల్లెమ్మవే..' పాట విడుదల

విజయ్ ఆంటోని తమిళ రోమియో సినిమాను తెలుగులో 'లవ్‌గురు'గా వేసవిలో విడుదల చేయబోతున్నారు. మృణాళిని రవి హీరోయిన్. విజయ్ ఆంటోనీ ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై మీరా అజయ్ ఆంటోనీ నిర్మిస్తున్నారు. వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'చెల్లెమ్మవే..' అనే సిస్టర్ సెంటిమెంట్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. భాష్యశ్రీ సాహిత్యాన్ని, భరత్ ధనశేఖర్ స్వరాలను అందించారు. ఆదిత్య ఆర్‌కె ఆలపించారు.



నేడు గామి ఫస్ట్ సాంగ్ విడుదల

హీరో విశ్వక్‌సేన్ నటించిన సినిమా 'గామి' మార్చి 8న విడుదల కానుంది. ఈ చిత్రం నుండి ఫస్ట్ సాంగ్ నేడు(శనివారం) విడుదలకానుంది. ఈ సినిమాలో చాందినీ చౌదరి హీరోయిన్. మానవ స్పర్శను అనుభవించలేని అరుదైన వ్యాధితో బాధపడే అఘోరా పాత్రలో విశ్వక్‌సేన్ నటించారు. విద్యాధర్ కాగిత దర్శకత్వంలో కార్తీక్ కుల్ట్ క్రియేషన్స్‌పై కార్తీక్ శబరీష్ నిర్మించారు. వి.సెల్యులాయిడ్ సమర్పిస్తోంది. హారిక పెడాడ, మహ్మద్ సమద్ ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ విశ్వనాథ్‌రెడ్డి, రాంపీ నందిగాం అందిస్తున్నారు. నరేష్ కుమారన్ మ్యూజిక్ అందిస్తున్నారు. విద్యాధర్ కాగిత, ప్రత్యూష్ వత్యం స్క్రీన్ ప్లే సమకూరుస్తున్నారు.

నవచిత్రం

మార్చి 3న 'గామా' అవార్డులు



దుబాయ్‌లో ఏఎఫ్‌ఎం ప్రాపర్టీస్ ప్రెజెంట్స్ 'గామా' తెలుగు మూవీ అవార్డ్స్ రాష్ట్ర ఎడిషన్ వేడుక మార్చి 3న జరగనుంది. ఏఎఫ్‌ఎం ప్రాపర్టీస్ సారధ్యంలో 'గామా' అవార్డ్స్ చైర్మన్ కేసరి త్రిమూర్తులు ఈ వేడుకను నిర్వహించబోతున్నారు. శుక్రవారం ఈ వేడుకకు సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్యూరీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మ్యూజిక్ డైరెక్టర్ కోటి, జ్యూరీ సభ్యులు వీఎన్ ఆదిత్య, రఘు కుంచె, నిర్మాత డీ వీ వీ దానయ్య, దర్శకుడు సాయి రాజేష్, ప్రసన్న, హీరోయిన్ డింపుల్ హయతి, గామా అవార్డ్స్ సీఈఓ సౌరభ్, ఏఎఫ్‌ఎం ప్రాపర్టీస్ సుశీల్, ఫణి మాధవ్ కలిసి ఈ అవార్డుకు సంబంధించి ట్రోఫీ లాంచ్ చేశారు. 2021, 2022, 2023లో విడుదలైన చిత్రాల నుంచి బెస్ట్ యాక్టర్ (మేల్, ఫిమేల్), బెస్ట్ మూవీ డైరెక్టర్, బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్, బెస్ట్ సింగర్ (మేల్, ఫిమేల్), బెస్ట్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, బెస్ట్ లిరిక్స్, బెస్ట్ సెలబ్రిటీ సింగర్, వంటి వివిధ కేటగిరీలకు అవార్డ్స్ అందజేయనున్నారు.






'జమల్‌కుడు' పాటకు అర్హ డ్యాన్స్

తన కుమార్తె అర్హ చేసే డ్యాన్స్ వీడియోలను హీరో అల్లు అర్జున్ సోషల్‌మీడియాలో పోస్టు చేస్తుంటారు. అవి ట్రెండింగ్ అవుతుంటాయి. ఇటీవల వచ్చిన 'యానిమల్' సినిమాలోని 'జమల్‌కుడు' పాటలో మందు గ్లాసు తలపై పెట్టుకుని బాబీదేవోల్ స్టెప్పులు వేశారు. ఇప్పుడు అదే పాటకు అర్హ కూడా స్టెప్పులేసింది. తలపై ప్లేటు పెట్టుకుని నడుచుకుంటూ వస్తున్న వీడియో వైరల్ అవుతోంది. 'శాకుంతలం'లో ఆమె వెండితెరకు పరిచయమైన విషయం తెలిసిందే.

'మార్కెట్ మహాలక్ష్మి' టీజర్ విడుదల



కేరింత మూవీ ఫేమ్ పార్వతీశం, కొత్త అమ్మాయి ప్రణీకాన్వికా జంటగా నటిస్తున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. వియస్ ముఖేష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాని అఖిలేష్ కలారు నిర్మించారు. బి2పి స్టూడియోస్ ద్వారా తెరకెక్కిన ఈ సినిమాలో హర్షవర్ధన్, మహబూబ్ బాషా, ముక్కు అవినాష్ ప్రధాన పాత్రలు పోషించనున్నారు. తాజాగా ఈ మూవీ 'టీజర్'ని శ్రీ విష్ణు విడుదల చేశారు. 'మార్కెట్ మహాలక్ష్మి' మూవీ టీజర్ చూసాను చాలా ఫన్నీగా ఉంది. హీరో, హీరోయిన్ క్యారెక్టరైజెషన్ బాగుంది. హీరో పార్వతీశం నాకు ఇష్టమైన వ్యక్తి. అతని కామెడీ టైమింగ్ బాగుంటుంది. ఈ సినిమా ప్రతి ఒక్కరికి మంచి పేరు తీసుకు వస్తుందని బలంగా నమ్ముతున్నాను.' అని శ్రీవిష్ణు అన్నారు.

బీజేపీకి అడ్డదారిలో విరాళాలు

కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం

- వివిధ కంపెనీల నుంచి కోట్లల్లో వసూళ్లు
- న్యూస్ పోర్టళ్ళ నివేదిక వెల్లడి





న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం ద్వారా వివిధ కంపెనీల నుంచి పెద్ద మొత్తంలో బీజేపీ విరాళాలు సేకరించిన వివరాలు బహిర్గతమయ్యాయి. బీజేపీకి రూ.335కోట్ల మొత్తాల విరాళాల కోసం 2018-19 నుండి 2022-23 వరకు 30 కంపెనీలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపన్ను శాఖల చర్యలు, దాడులు ఎదుర్కొన్న వివరాలను న్యూస్ లాండ్రీ, న్యూస్ మినిట్ వంటి వార్తా పోర్టళు) విడుదల చేశాయి.

వీటిలో, 23 కంపెనీలు 2014 నుంచి కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యలు ఎదురయ్యేంతవరకు బీజేపీకి ఒక్క రూపాయి కూడా విరాళంగా ఇవ్వలేదు. కేంద్ర సంస్థలు కంపెనీలకు వెళ్ళిన నాలుగు మాసాల వ్యవధిలోనే నాలుగు కంపెనీలు రూ.9.05 కోట్లకు పైగా మొత్తాన్ని బీజేపీకి అందచేశాయి. గతంలో పార్టీకి విరాళమిచ్చిన ఆరు కంపెనీలు ఈ దాడులు మొదలైన తర్వాత మరింత పెద్ద మొత్తాలను అందచేశాయి. గతంలో బీజేపీకి విరాళాలు ఇచ్చినా కూడా ఒక ఏడాది పాటు ఇవ్వని ఆరు కంపెనీలపై కేంద్ర సంస్థలు చర్యలు తీసుకున్నాయి. విరాళాలు ఇచ్చిన 30 కంపెనీల్లో మూడు కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన అనుమతులు ఇచ్చిందనే ఫిర్యాదులు కూడా వున్నాయి. ఐదేండ్లపాటు కంపెనీల ఆర్థిక లావాదేవీల స్టేట్‌మెంట్‌లను, ఎన్నికల కమిషన్ పత్రాలను పరిశీలించిన తర్వాత కేంద్ర దర్యాప్తు సంస్థల బెదిరింపులతో వసూలు చేసిన విరాళాల వివరాలతో న్యూస్ మినిట్, న్యూస్‌లాండ్రీల బృందం ఒక నివేదికను రూపొందించింది. తమిళనాడు, కర్నాటక, తెలంగాణా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని కంపెనీలు బీజేపీకి విరాళమిచ్చాయి. కోటి రూపాయిలకు పైగా విరాళమిచ్చిన పక్షాల సమాచారాన్ని మీడియా బృందం చెక్ చేసింది.

దాడుల సందర్భంగా కొన్ని సంస్థలు విరాళమిస్తే, ఇతర కంపెనీలపై దాడులు చేస్తుండగానే విరాళం అందచేసిన కంపెనీలు కొన్ని వున్నాయి. విరాళాలు అందిన తర్వాత కొన్ని కంపెనీలపై చర్యలు విరమించుకోవడం కూడా జరిగింది. మరికొన్ని కంపెనీలపై ఇంకా చర్యలు కొనసాగుతునే వున్నాయి. 2022-23లో ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపి రూ.1300కోట్లు వసూలు చేసింది .2018 -2022 మధ్యలో బీజేపీ అందుకున్న మొత్తం విరాళాల్లో 57శాతం ఎన్నికల బాండ్ల ద్వారానే వచ్చాయి. గత పదేండ్లలో ఎన్నికల ట్రస్టుల ద్వారా కూడా పెద్ద మొత్తాలనే సేకరించింది. వివిధ ట్రస్టుల ద్వారా రూ.1893 కోట్లను బిజెపి వసూలు చేసింది. కొద్ది రోజుల క్రితమే రాజ్యాంగ విరుద్ధమంటూ ఎన్నికల బాండ్లను సుప్రీం కోర్టు రద్దు చేసింది.

న్యూస్ పోర్టళ్ళ నివేదిక నేపథ్యంలో సిపిఎం నేత సీతారాం ఏచూరి దీనిపై స్పందిస్తూ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోయడానికి ఇడి, సిబిలను ఉపయోగించడమే కాకుండా బ్లాక్‌మెయిలింగ్ కళలో కూడా మోడీ ప్రభుత్వం సిద్ధహస్తురాలని తాజా వివరాలతో రుజువైందని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

తగ్గేదేలే..

- పంచాయితీ ఉప ఎన్నికల్లో బలాన్ని పెంచుకున్న ఎల్డీఎఫ్
- ఎల్డీఎఫ్‌కు 10, యూడీఎఫ్‌కు 10, బీజేపీకి మూడు స్థానాలు



తిరువనంతపురం : కేరళలో పలు జిల్లాల్లో జరిగిన పంచాయితీ ఉప ఎన్నికల్లో ఎల్డీఎఫ్ మంచి పురోగతిని సాధించింది. తన బలాన్ని పెంచుకుంది. తనకున్న ఐదు స్థానాలను పదికి పెంచుకోగలిగింది. అదే సమయంలో యూడీఎఫ్ సీట్లు 13 నుంచి 10కి పడిపోగా, బీజేపీ నాలుగు స్థానాలు కాస్తా మూడుకు తగ్గాయి. ఎర్నాకులం జిల్లాలోని నెడుంబసెరి పంచాయితీలో యూడీఎఫ్ వార్డును కూడా ఎల్‌డిఎఫ్ గెలుచుకోవడంతో యూడీఎఫ్ పాలనా పగ్గాలను కోల్పోయింది. తిరువనంతపురం జిల్లాలో కార్పొరేషన్ స్థానంతో సహా రెండు బీజేపీ వార్డులను ఎల్డీఎఫ్ కైవసం చేసుకుంది.


మొత్తంగా యూడీఎఫ్ నుంచి నాలుగు స్థానాలను, బీజేపీ నుండచి మూడు స్థానాలను ఎల్డీఎఫ్ కైవసం చేసుకుంది. ఎల్డీఎఫ్ కు చెందిన ఒక వార్డులో కాంగ్రెస్, మరో వార్డులో బీజేపీ గెలుపొందింది. నెడుంబసెరి పంచాయితీలోని కల్పక నగర్‌ను యూడీఎఫ్ నుంచి ఎల్డీఎఫ్ స్వాధీనం చేసుకుంది. ఇక్కడ రెండు ఫ్రంట్‌లకు 9చొప్పున సీట్లు వుండేవి. ఇప్పుడు ఎల్డీఎఫ్‌కు మెజారిటీ వచ్చింది. తిరువనంతపురం కార్పొరేషన్‌లో రామాలయ నిర్మాణాన్ని ఉపయోగించి మతోన్మాద ప్రచారం చేసినా బీజేపీ ఓడిపోయింది. అక్కడ వెల్లార్ వార్డును బీజేపీ నుంచి ఎల్డీఎఫ్ కైవసం చేసుకుంది. కొల్లాం జిల్లాలోని చదయమంగళం పంచాయితీలో కురియె వార్డును బీజేపీ నుంచి ఎల్డీఎఫ్ గెలుచుకుంది. గత ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ 400 ఓట్ల మెజారిటీతో గెలవగా, ఈసారి కేవలం 58ఓట్లు వచ్చాయి. ముల్లాస్సెరి పంచాయితీలోని ఓరకమ్ వార్డును యూడీఎఫ్ నుంచి ఎల్డీఎఫ్ కైవసం చేసుకుంది. పాలక్కాడ్ జిల్లాలో నాలుగు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించగా ఎల్డీఎఫ్ మూడు స్థానాల్లో గెలుపొందింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

బైజూస్ వ్యవస్థాపకులు అనర్హులు

- రవీంద్రన్‌ను తొలగించాలి
- కొత్త బోర్డును ఏర్పాటు చేయాలి
- ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలి
- ఎన్‌సిఎల్‌టిలో ఇన్వెస్టర్ల గ్రూప్ దావా



బెంగళూరు : ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ వ్యవస్థాపకులపై ఇన్వెస్టర్ల గ్రూపు ఎదురు తిరిగింది. కంపెనీ బోర్డు సభ్యులను తొలగించి కొత్త బోర్డును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.. సంస్థ ఆర్థిక లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలని కోరారు. ఈ డిమాండ్లతో బెంగళూరులోని నేషనల్ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)లో నలుగురు ఇన్వెస్టర్ల గ్రూపు శుక్రవారం పిటిషన్ దాఖలు చేసింది. దావా వేసిన ఇన్వెస్టర్లలో ప్రోసస్, జనరల్ అట్లాంటిక్, సోఫినా, పీక్ ఎక్స్‌వి ఉన్నాయి. వీరికి టైగర్, ఓల్ వెంచర్స్ వంటి వాటాదారుల మద్దతూ ఉంది. కంపెనీలో షేర్ హోల్డర్ల వాటాల విలువ కరిగిపోకుండా చూడటంతో పాటు ఉద్యోగులు, వినియోగదారులు ప్రయోజనాలను పరిరక్షించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. కంపెనీలో చోటు చేసుకుంటున్న వ్యవహారాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ధర్మాసనాన్ని ఆశ్రయించారు. బైజూస్ యాజమాన్యం వేధింపులు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని ఆరోపించింది.

అసాధారణ వార్షిక బోర్డు జరుగుతున్న రోజే ఎన్‌సిఎల్‌టిని ఇన్వెస్టర్ల గ్రూప్ ఆశ్రయించడంతో వారు బైజూస్ అంశాన్ని చాలా తీవ్రంగా తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. కంపెనీని నడిపించేందుకు సిఇఒ రవీంద్రన్ సహా ఇతర వ్యవస్థాపకులను అనర్హులుగా ప్రకటించాలని ఎన్‌సిఎల్‌టిని కోరారు. ఇటీవలే ముగిసిన రైట్స్ ఇష్యూను సైతం రద్దు చేయాలని అన్నారు. ఇన్వెస్టర్ల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి కార్పొరేట్ చర్యలను కంపెనీ యాజమాన్యం తీసుకోకుండా నిలువరించాలని సూచించారు. వ్యవస్థాపకుల ఆర్థిక అవకతవకల వల్ల కంపెనీ అనుబంధ విభాగమైన ఆకాశ్‌పై నియంత్రణ కోల్పోతున్నామని ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు బైజూస్ ఆల్ఫా దివాలా దశకు చేరుకుందని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా కార్పొరేట్ పాలనాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. స్వతంత్ర డైరెక్టర్ సహా సిఎఫ్ఒ నియామకం నిలిచి పోయాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సింగపూర్‌కు చెందిన నార్త్‌వెస్ట్ ఎడ్యుకేషన్ కంపెనీ కొనుగోలు విషయంలో అనధికారిక కార్పొరేట్ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు.

పేటీఎంకు థర్డ్ పార్టీ ప్రొవైడర్ హోదా..!

ముంబయి : పేటీఎంకు థర్డ్‌పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్ హోదాను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ఎన్‌పిసిఐకి ఆర్బీఐ సూచించింది. పేటియం యాప్‌లో యూపీఐ లావాదేవీలు నిర్వహించుకునేందుకు వీలు కల్పించాలని కోరింది. ఈ అంశమై పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్ అభ్యర్థన మేరకు ఆర్బీఐ సూచన చేసింది. ఒక వేళ ఆ హోదా లభిస్తే పేటీఎం భవిష్యత్తుల్లో యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేయడానికి వీలుంటుంది.

ఇలువియాకు ఫైర్‌సైడ్ వెంచర్స్ నిధులు



న్యూఢిల్లీ : ఫైర్‌సైడ్ వెంచర్స్, మల్టీప్లై వెంచర్స్ నుంచి సిరీస్ ఎ ఫండింగ్‌లో నిధులు సమీకరించినట్లు ప్రొఫెషనల్ హెయిర్‌కేర్ స్టార్టప్ ఇలువియా తెలిపింది. ఈ నిధులను ఉద్యోగుల నియామకాలు, పరిశోధన, అభివృద్ధిని పెంపొందించడం, బ్రాండ్ మార్కెటింగ్ విస్తరణకు ఉపయోగించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. కాగా ఎంత మొత్తం నిధులను సమీకరించిందనే విషయాన్ని వెల్లడించలేదు.

కియా కుర్రో..మొర్రో

- నాలుగు వేల పైగా కార్లలో లోపాలు



న్యూఢిల్లీ : కియా ఇండియా తన నాలుగు వేల పైగా సెల్టోస్ ఎస్‌యువి కార్లలో లోపాలు ఉన్నట్లు గుర్తించింది. 4,358 యూనిట్ల సివిటి వర్షన్ కార్లను రీకాల్ చేస్తున్నట్లు కియా ఇండియా శుక్రవారం తెలిపింది. వీటిలోని ఎలక్ట్రానిక్ ఆయిల్ పంప్ కంట్రోలర్‌లో లోపాలు ఉన్నట్లు గుర్తించింది. దీన్ని మార్చేందుకు రీకాల్ చేస్తున్నట్లు తెలిపింది. గతేడాది ఫిబ్రవరి 28 నుంచి జులై 13 మధ్య తయారైన సివిటి వర్షన్ కార్లను రీకాల్ చేస్తున్నామని వెల్లడించింది. వీటిని స్వచ్ఛందంగా రీకాల్ చేస్తున్నామని, ఉచితంగా ఎలక్ట్రానిక్ ఆయిల్ పంప్ కంట్రోలర్‌ను మార్చి ఇవ్వనున్నట్లు పేర్కొంది.

గెలాక్సీల్లో నూతన వన్ యుఐ 6.1 అప్‌డేట్



గూర్‌గావ్ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తన గెలాక్సీ ఫోన్లలో నూతన వన్ యుఐ 6.1 అప్‌డేట్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. ఈ అప్‌డేట్ గెలాక్సీ ఎస్ 23 సిరీస్, ఎస్ 23 ఎఫ్ఇ, జెడ్ ఫోల్డ్ 5, జెడ్ ఫ్లిప్ 5, టాబ్ ఎస్9 సిరీస్‌లలో అందుబాటులో ఉంటుందని తెలిపింది. దీన్ని మార్చి చివరి నుండి అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొంది.

నేటి నుంచి వండర్‌లా ప్రత్యేక ఆఫర్

హైదరాబాద్ : అతిపెద్ద అమ్యూజ్మెంట్ పార్క్ చైన్ వండర్‌లా హాలిడేస్ పర్యాటకులను ఆకర్షించడానికి కొత్త ఆఫర్‌ను ప్రకటించింది. హైదరాబాద్, కొచ్చీ, బెంగళూరులోని పార్కుల్లో ఫిబ్రవరి 24 నుండి 29వ తేదీ వరకు లీప్ వీక్ ఆఫర్‌నలో భాగంగా కేవలం రూ.929 ధరతో పార్క్‌లోకి ప్రవేశించవచ్చని పేర్కొంది. అదే విధంగా రూ.1,229తో పార్క్ టిక్కెట్, ఫుడ్‌తో కూడిన కాంబో టిక్కెట్‌లను కొనుగోలు చేసే అవకాశం కూడా అందిస్తున్నట్లు తెలిపింది.

బీఆర్ఎస్, బీజేపీ పార్టీలది సురభి నాటకం

- లిక్కర్ కేసులో కవిత పేరు చేర్చడంపై జగ్గారెడ్డి ఎద్దేవా

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

లిక్కర్ కేసులో కల్వకుంట్ల కవిత పేరు సీబీఐ చేర్చడాన్ని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. అది బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల సురభి నాటకమని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ సీట్లకు గండికొట్టేందుకు ఆ రెండు పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర మంత్రులు ఢిల్లీలో ఉన్నప్పుడు ఒకలా, హైదరాబాద్ వచ్చాకా మరోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌పై ఏదో ఒక నింద వేసేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలను గందరగోళానికి గురి చేసేలా ఆయన వ్యాఖ్యలు ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో బీజేపీ సర్కారు తెచ్చిన అన్ని బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందన్నారు. చాలా కాలం మోడీ, కేసీఆర్ మధ్య రాజకీయ ప్రేమాయణం నడిచిందనీ, ప్రేమికుల మధ్య ఎక్కడ చెడిందో తెలియదు కానీ రెండేండ్లుగా గ్యాప్ తీసుకున్నట్లు నటించారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో మళ్లీ లవ్ ట్రాక్‌ను కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు.

యల'మంద' వెనక్కి..!

- గొర్రెల స్కీం నుంచి గొల్లకుర్మలు నగదు ఉపసంహరణ
- రాష్ట్రవ్యాప్తంగా రెండో (బీ) జాబితాలోని 3.54 లక్షల మంది పరిస్థితి అధోగతి
- ఖమ్మం జిల్లాలో వెయ్యి మంది వరకు వెనక్కి..
- ఒక్కొక్కరిపై రూ.20వేల వడ్డీ భారం
- రూ.2 లక్షలు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ అమలయ్యేనా?



'కుల వృత్తులకు జీవం పోయాలె.. గొల్ల కురుమల జీవితాలు మారాలె.. బతుకు దెరువుకు వలసెల్లినోళ్లు వాపస్ రావాలె.. ఉన్న ఊళ్లెనే పని జేయాలె.. ఆర్థికంగా ఎదగాలె.. ఇంటిల్లిపాదీ మెతుకు తినాలె..' అని మాటలు చెప్పి 75శాతం రాయితీపై గొర్రెల యూనిట్ పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. 20 నెలల క్రితం నగదు చెల్లించిన రెండో జాబితా (బీ)లోని గొల్ల కురుమలకు తీరని అన్యాయం చేసింది. ఒక్కరంటే ఒక్కరికి కూడా ఒక్క యూనిట్ మంజూరు చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 3,54,791 మంది గొల్ల, కురుమల సొసైటీ సభ్యుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కారాయిగూడెం నుంచి కె. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

గొల్ల కురుమలు ఒక్కొక్కరు తమ వాటాధనంగా రూ. 43,750 చెల్లించారు. 20 నెలలుగా తమకు రావాల్సిన రూ.1.75 లక్షల విలువైన ఒక్కో యూనిట్ (20 గొర్రెలు, పొట్టేలు) కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో రూ. రెండు లక్షలు ఈ పథకం దరఖాస్తుదారులకు ఇస్తామని హామీ ఇవ్వడంతో బడ్జెట్ సమావేశాల వరకు ఆశతో ఉన్నారు. కానీ మొన్నటి బడ్జెట్‌లో ఈ పథకం కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదు. మరోవైపు గత ప్రభుత్వం అమలు చేసిన ఈ స్కీమ్‌లో అవినీతి చోటు చేసుకున్నట్లు 'కాగ్' నివేదిక ఇవ్వడం.. కామారెడ్డి, రంగారెడ్డి జిల్లాలకు చెందిన నలుగురు అధికారులను ఏసీబీ అదుపులోకి తీసుకోవడం.. అన్నింటికీ మించి అప్పు చేసి డీడీలు తీసిన రూ. 43,750కి వడ్డీలు చెల్లించడం భారం కావడంతో దరఖాస్తుదారులు నగదు వెనక్కి తీసుకుంటున్నారు. ఒక్కో సభ్యుడు నూటికి నెలకు రూ.2 నుంచి రూ.4 వరకు వడ్డీతో అప్పు తెచ్చారు. ఇప్పుడు ఆ వడ్డీ రూ.20వేల నుంచి రూ.40వేల వరకు చేరింది.

ఎన్నికల స్కీమ్‌గా మారిన గొర్రెల పంపిణీ పథకం..

మొదటి నుంచి గొర్రెల యూనిట్ల పంపిణీ పథకం అస్తవ్యస్తంగానే సాగుతోంది. ఎన్నికలున్నప్పుడు కొన్ని యూనిట్లు మంజూరు చేయడం ఆ తర్వాత దీని గురించి పట్టించుకోకపోవడం ఆనవాయితీ అయింది. రాష్ట్ర వ్యాప్తంగా 8,135 సొసైటీలు ఉండగా 7,46,179మంది సభ్యులు ఉన్నారు. వీరిని ఏ, బీ జాబితాగా విడదీశారు. మొదటి(ఏ) జాబితాలో ఉన్న సుమారు 3.60లక్షల మందికి తొలుత ఒక్కో యూనిట్‌కు రూ.1.25లక్షల చొప్పున చెల్లించారు. బీ జాబితాకి వచ్చే సరికి యూనిట్ విలువ రూ.1.75లక్షలకు పెంచారు. సొసైటీ సభ్యుల వాటాధనంగా రూ.43,750 చెల్లించాల్సిందిగా నిర్ధారించారు. 2022 జూన్, జులై నెలల్లో సభ్యులు డీడీలు తీశారు. ఏ జాబితాలో అవినీతి ఆరోపణలు చోటు చేసుకోగా.. బీ జాబితా నాటికి అసలు సబ్సిడీ గొర్రెలు ఇవ్వడమే ప్రభుత్వం మరిచింది. బీ జాబితాలో 3,54,791మంది తమ వాటాధనం చెల్లించి గొర్రెల పంపిణీ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో 332సొసైటీలు ఉండగా 33,560మంది సభ్యులకు గాను 16,382మంది బీ జాబితాలో అర్హత సాధించగా 10,508మంది లబ్ది పొందేందుకు నగదు చెల్లించారు.

మొత్తం రూ.46కోట్లు జిల్లా కలెక్టర్ బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయి. వీరంతా 20 నెలలుగా ప్రభుత్వ వాటాధనం కోసం ఎదురుచూస్తున్నారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఆ నియోజకవర్గంలోని 4వేల మంది సభ్యులకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల యూనిట్ల కోసం నగదు జమ చేసింది. కానీ.. విత్ డ్రా చేయకుండా ఫ్రీజింగ్‌లో పెట్టింది. 780మందికి మాత్రమే ఇచ్చి.. ఎన్నికల అనంతరం వెంటనే ఆ మొత్తాన్ని ప్రభుత్వం తమ ఖాతాలోకి జమ చేసుకుంది.

కాంగ్రెస్ రూ.2లక్షల హామీ అమలయ్యేనా..?

కాంగ్రెస్ పార్టీ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో గొల్ల, కురమలకు రూ.2లక్షలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఈ అంశానికి సంబంధించి ప్రస్తావన లేకపోవడంతో సభ్యులు తమ నగదును వెనక్కు తీసుకుంటున్నారు. గ్రీవెన్స్‌లో డబ్బులు వాపసు ఇవ్వాలని సభ్యులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకానికి నగదు విడుదల చేస్తే నష్టపోతారని కలెక్టర్లు, అధికారులు వారికి సూచిస్తున్నా అప్పు భారం, అనారోగ్య సమస్యలతో పలువురు డబ్బులు వెనక్కు తీసుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో గడిచిన వారం రోజుల్లో వెయ్యి మంది వరకు డబ్బులు వెనక్కు తీసుకోగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి కూడా అభ్యర్థనలు వస్తున్నట్టు ఆ జిల్లా అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగానూ ఇదే పరిస్థితి ఉంది.

కారాయిగూడెంలో 85 మంది ఉపసంహరణ..



ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కారాయిగూడెంలో 85 మంది సభ్యులున్నారు. వీరంతా గొర్రెల పంపిణీ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. తమ నగదును వెనక్కి తీసుకుంటున్నట్టు కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం పథకం అమలు చేస్తే లబ్ధి చేకూరదని చెప్పినా.. ఆర్థికభారంతో ఇబ్బందులు పడుతున్నామని మొరపెట్టుకున్నారు.

ఒకవేళ పథకం అమలు చేసేటట్టయితే తమ వాటాధనాన్ని తిరిగి చెల్లించే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మండలానికి మంజూరైన వంద దళితబంధు యూనిట్లలో ఇదే గ్రామంలో 75 దళిత కుటుంబాలుంటే వారికి ఎలాంటి నగదు చెల్లించకుండా రూ.10 లక్షలు విలువ చేసే 75 యూనిట్లు మంజూరయ్యాయి. ఈ పరిస్థితి గ్రామస్తుల మధ్య సామాజిక విభేదాలకు కారణమైందని గొర్రెలే జీవనాధారంగా జీవించే కట్టబోయిన వెంకటేశ్వరరావు వాపోయారు.

నగదు వెనక్కి తీసుకున్నా లబ్ది చేకూర్చాలి..



గత ప్రభుత్వంలా ఈ ప్రభుత్వం వ్యవహరించొద్దు. ఆర్థిక ఇబ్బందులతో నగదు వెనక్కు తీసుకుంటున్న సభ్యులకు కూడా లబ్ది చేకూరేలా ప్రభుత్వం చూడాలి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షలు సభ్యులందరికీ ఇవ్వాలి.

– చింతలచెర్వు కోటేశ్వరరావు, తుషాకుల లింగయ్య
తెలంగాణ గొర్రెల, మేకల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

రైతు పోరాటంలో ఆ ఇంటి దిక్కే అమరుడు

22 ఏండ్ల వ్యక్తి కుటుంబానికి ఏకైక ఆధారం

నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో

ఖానౌరీ సరిహద్దులో బుధవారం మరణించిన భటిండా జిల్లా రాంపుర ఫుల్ సబ్–తహసీల్‌లోని బల్లో గ్రామానికి చెందిన శుభకరణ్ సింగ్ (22)కి అనారోగ్యంతో ఉన్న తండ్రికి రూ.10 లక్షల రుణం మిగిల్చారు. శుభకరన్ సింగ్ తన కృషి, అంకితభావానికి ప్రసిద్ధి చెందాడు. శుభకరన్ ఆయన కుటుంబానికి ప్రధాన జీవనాధారం. ఆయన బీకేయూ (సిధుపూర్)లో క్రియాశీల సభ్యుడు. అక్కడ వంటగది పనిలో సహాయం చేయడానికి ఫిబ్రవరి 13న నిరసన ప్రదేశానికి వెళ్ళాడు. గ్రామంలోని ఆయన సహచరులు మాట్లాడుతూ శుభకరణ్ వ్యవసాయంతో పాటు పశువులను కూడా పోషించేవాడు. "ఆయన తన మామ చరణ్‌జిత్ సింగ్‌తో కలిసి దాదాపు 20 ఎకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నాడు. ఆయన 12వ తరగతి పాసయ్యాడు. ఆ తరువాత చదువుకు స్వస్తి చెప్పాడు. ఆయన తల్లి చనిపోవడంతో, తండ్రి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నందున కుటుంబాన్ని చూసుకునే బాధ్యతను తీసుకున్నాడు" అని చెప్పారు. కుటుంబాన్ని పోషించేందుకు, అక్కకు పెళ్లి చేసేందుకు 3.5 ఎకరాలు అమ్ముకోవాల్సి వచ్చిందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేస్తుందన్న ఆశతో ఆయన ఆందోళన స్థలానికి వెళ్లారు.





శుభకరణ్ మామ బూటా సింగ్ మాట్లాడుతూ "బుధవారం ఉదయం ఆయన ఖనౌరీ నిరసన ప్రదేశంలో రైతులకు అల్పాహారం సిద్ధం చేశాడు. ఉదయం ఫోన్ చేసి 11 గంటలకు ముందుకు వెళతామని చెప్పారు. కానీ ఒక గంట తరువాత, ఆయన గాయపడ్డాడని మాకు తెలిసింది. తరువాత, ఆయన చనిపోయాడని చెప్పారు" అని తెలిపారు.మరో మేనమామ బల్జిత్ సింగ్ మాట్లాడుతూ, "శుభకరణ్ ఎప్పుడూ రైతుల ఆందోళనల్లో పాల్గొంటాడు. ఆయన కూడా మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిరసనలో పాల్గొన్నాడు" అని తెలిపారు.ఇదిలా ఉండగా, బల్లో నివాసితులు, సమీప గ్రామాల నుండి అనేక మంది ప్రజలు శుభకరణ్ ఇంటికి వచ్చి ఆయన మృతికి సంతాపం తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రతాప్ సింగ్ బజ్వా కూడా ఆయన ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. గ్రామస్తులు ఆయన మృతదేహాన్ని తీసుకురావడానికి వేచి ఉన్నారు. శవపరీక్ష కోసం క్లియరెన్స్‌లో జాప్యం జరిగింది.

ఆ రైతు కుటుంబానికి కోటి పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం

కన్నౌరి బోర్డర్ వద్ద జరిగిన కాల్పుల్లో మతిచెందిన రైతు శుభ్‌కరణ్ సింగ్ కుటుంబానికి పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ సింగ్ నష్టపరిహారాన్ని ప్రకటించారు. కోటి రూపాయల నగదుతో పాటు కుటుంబ సభ్యులకు ఒక ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. శుభ్‌కరణ్ మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. రైతు శుభ్‌కరణ్ పబ్లిసిటీ కోసం ఆందోళనల్లో పాల్గొనేందుకు రాలేదని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర డిమాండ్ చేసేందుకు వచ్చినట్లు సీఎం భగవంత్‌మాన్ వెల్లడించారు. రైతులకు పంజాబ్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన అన్నారు. రాష్ట్రపతి పాలన విధిస్తామని మమ్మల్ని బెదిరిస్తున్నారని, ఆ బెదిరింపులకు తానేమీ బెదిరేది లేదని తెలిపారు. మరో శుభ్‌కరణ్ మృతి చెందకుండా చూస్తానని సీఎం భగవంత్‌మాన్ అన్నారు. మమ్మల్ని బెదిరించడానికి ముందు మణిపూర్, నుహ్ గురించి ఆలోచించాలన్నారు. శాంతి భద్రతలు సన్నగిల్లడానికి హర్యానా పోలీసులే కారణమని తెలిపారు. ఎవరికీ ఎటువంటి ట్రబుల్ ఇవ్వడం లేదన్నారు. తమ అహంకారాన్ని పక్కన పెట్టి, రైతుల డిమాండ్లను పూర్తి చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు

మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేయాలి

పాటియాలాలోని రైతు నేతలు సర్వన్ సింగ్ పంధేర్, జగ్జిత్ సింగ్ దల్లెవాల్ మాట్లాడుతూ పంజాబ్ ప్రభుత్వం ప్రకటించి రూ.కోటి పరిహారాన్ని తిరస్కరించారు. దోషులకు శిక్ష పడే వరకు పోస్టుమార్టం చేయబోమని అన్నారు. వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. "(రైతు) మరణానికి కారణమైన వారిపై సెక్షన్ 302 ఐపిసి కింద కేసు నమోదు చేయాలి" అని అన్నారు. శుభకరన్‌ను హత్య చేసిన నిందితులపై పంజాబ్ ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. "నష్టపరిహారం, ఉద్యోగం కోసం అంగీకరించడానికి పంజాబ్ ప్రభుత్వం చాలా సమయం, శక్తిని వెచ్చిస్తోంది. వారు ఈ శక్తిలో సగం అయినా వెచ్చించాలనేది వారికి ఒక సూచన. శుభకరన్‌ను హత్య చేసిన దోషులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ధైర్యం చేయాలి" అని రైతుల డిమాండ్ చేశారు.

'గొర్రెలు, చేపల' పంపిణీలపై లెక్కలు తేల్చాలి

- టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

గత ప్రభుత్వంలో జరిగిన గొర్రెలు, చేపల పంపిణీలపై లెక్కలు తేల్చాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ డిమాండ్ చేశారు. గొర్రెల పంపకాల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాగ్ నివేదికలో అక్రమాలు పూర్తిగా బయటపడ్డాయని గుర్తు చేశారు. గొర్రెలు పంపిణీ చేసిన వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లు చూస్తే ఆశ్చర్యం వేస్తున్నదని చెప్పారు. కొన్ని వాహనాలను పరిశీలిస్తే అంబులెన్స్ నంబర్లు కూడా ఉన్నాయని చెప్పారు. 142 కోట్ల విలువైన గొర్రెల వివరాలకు లెక్కలు లేవన్నారు. గొర్రెల పంపకాలపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. డిసెంబర్ 10న మాసబ్ ట్యాంక్‌లోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఫైల్స్ దొంగలించారనీ, దీని వెనుక మాజీ మంత్రి శ్రీనివాస్ యాదవ్ పీఏ హస్తం ఉన్నట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు. మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ పై కూడా వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత బాల నారాయణ

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ నేత, మదనాపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మెన్ సాక బాల నారాయణ, 13వ వార్డు కౌన్సిలర్ పి.రామ్మోహన్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో వారు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

సెక్స్ రాకెట్ ఆరోపణలపై బీజేపీ నేత అరెస్టు

- మరో పది మందీ అదుపులోకి

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని హౌరా జిల్లాలో ఒక హోటల్‌లో సెక్స్ రాకెట్ నడుపుతున్నారన్న ఆరోపణలపై బీజేపీ నేతతో సహా పది మందిని అరెస్టు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి శుక్రవారం తెలిపారు. స్థానిక బీజేపీ నేత అయిన సవ్యసాచి ఘోష్, ఆయన సహచరులు మరో 10మందిని వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి కూడా పంపారు. గురువారం ఉదయం సంక్రెయిన్‌లో ఒక హోటల్‌పై దాడి చేసిన పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని కోర్టు ముందు హాజరు పరచగా, వారిని రిమాండ్‌కు పంపారు. ఆ హోటల్ బీజేపీ నేతదేనని తెలుస్తోంది. అదే సమయంలో అనేకమంది బాలికలు, యువతులను కూడా కాపాడినట్లు చెప్పారు. 116వ నెంబరు జాతీయ రహదారికి దగ్గర్లో వున్న ఈ హోటల్‌లో యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ఈ సంఘటన రాజకీయ వివాదాన్ని రేపింది. ఈ సెక్స్ రాకెట్‌లోని వారిని కాపాడేందుకు బీజేపీ యత్నిస్తోందంటూ తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది.

ఒకరి నిర్లక్ష్యం.. మరొకరికి విషాదం

సీట్‌బెల్ట్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్..

- సాధ్యం కాని 'యాక్సిడెంట్ ఫ్రీ సీటీ' ప్రణాళిక
- పట్టించుకోని ట్రాఫిక్ నిబంధనలు

రోడ్డు ప్రమాదాలు ఏటేటా పెరుగుతున్నాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం ఓవైపు, నిబంధనలు పాటించని వాహనదారుల తీరు మరో వైపు.. ఇలా ప్రమాదాలు పెరుగుతున్నాయి. రాష్ట్ర రాజధాని నగరంలోనూ అంతే తీవ్రత ఉంది. నగరవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో చిన్నారులు, వృద్ధులు రోడ్డు దాటుతున్నా పట్టించుకోకుండా వాహనదారులు దూసుకెళ్తున్నారు. మరికొందరు సిగ్నల్స్ పడినా జంప్ చేస్తున్నారు. వీరి కారణంగా వాకింగ్‌కు వెళ్లినవారు సైతం అకారణంగా ప్రాణం కోల్పోతున్నారు. ఇలా ప్రతిరోజూ నగరంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. నగరాన్ని 'యాక్సిడెంట్ ఫ్రీ సిటీ'గా తయారు చేయాలని పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ రోడ్డు ప్రమాదాలు ఆగడం లేదు. కొందరి నిర్లక్ష్యం.. మరి కొందరి కుటుంబాల్లో విషాదాన్ని నింపుతోంది. వాహనాలు నడిపించే సమయంలో సీట్‌బెల్టు, హెల్మెట్ ధరించడం నామోషీగా భావించడం.. మరికొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.



నవతెలగాణ– సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ పరిధిలో 83.5 లక్షల వాహనాలు, 240.9కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయి. ప్రతిరోజూ ఏదోఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో గతేడాది 2370 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 280 మంది మృతిచెందారు. 2090 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా డివైడర్‌కు ఢీకొట్టడం లాంటివి కొన్నయితే, వాహనదారులను ఢీకొట్టినవి.. అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడం ఇంకొన్ని సంఘటనలున్నాయి. ఈ ఘోర సంఘటనలు స్థానికులను కలవరపాటుకు గురిచేశాయి.

వాకింగ్‌కు వెళ్లిన పాదచారులు పలువురు మృతి

నగరంలో పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్‌లో రోడ్డు దాటాలంటే నానా ఇబ్బందులకు గురికావల్సిందే. దూసుకెళ్తున్న వాహనాలు ఓ వైపు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యహరించే వారు మరోవైపు.. సెల్‌ఫోన్లు, సిగ్నల్ జంపింగ్స్ చేసే వారికారణంగా అమాయకులు ప్రాణం కోల్పోతున్నారు. గతేడాది రోడ్డు దాటుతూ 121 మంది పాదచారులు మృతిచెందిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. అందులో 23 మంది (60ఏండ్లకు పైబడి) వృద్ధులుండగా, 23 మంది యాచకులున్నారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లివారు 18 మంది మృతిచెందగా, నగరాన్ని చూసేందుకు వచ్చిన ముగ్గురితోపాటు ఇతరులు 54 మంది ప్రమాదాలకు గురై మృతిచెందారు. ఈ ప్రమాదాలు బాధితుల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి.

ట్రిబుల్ రైడింగ్... రాంగ్‌సైడ్ డ్రైవింగ్

డ్రైవర్ల నిర్లక్ష్యం.. కొందరు వాహనదారులు రాంగ్‌రూట్‌లో దూసుకెళ్లడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి ఘటనలు రోడ్డు ప్రమాదాలకు కారణాలవుతున్నాయి. దీనికి తోడు ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులు నిర్లక్ష్యం వహిస్తుండటం భారీ మూల్యం చెల్లించుకోక తప్పడం లేదు.

గతేడాది సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లో 53456 మందితోపాటు రాంగ్‌సైట్ డ్రైవింగ్‌లో 523382 కేసులు నమోదయ్యాయి. సిగ్నల్ జంపింగ్‌లో 65413 కేసులు నమోదుకాగా, ట్రిబుల్ రైడింగ్‌లో 121956కేసులు, ఓవర్‌స్పీడ్ చేసినందుకు 76538 కేసులు నమోదు చేశారు. ఇక మైనర్లు డ్రైవింగ్ చేస్తూ రోడ్లపై వచ్చిన 1745 మంది పోలీసులకు పట్టుబడ్డారు.

స్పెషల్ డ్రైవ్ అయినా..

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు పలు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా నగరాన్ని 'యాక్సిడెంట్ ఫ్రీ సిటీ'గా మార్చేందుకు పలు ప్రాంతాల్లో డెడ్ స్పాట్స్‌గా గుర్తించి ఆయా ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా వాహనదారులు అధిక స్పీడ్‌తో దూసుకెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

వాహనాలను నడిపించే సమయంలో సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించినా పాటించడం లేదు. నగరంలో ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్‌లో సీటుబెల్టు పెట్టుకోలేని కారణంగా 18,429 కేసులు నమోదు కాగా, హెల్మెట్ లేనికారణంగా 18,33,761 కేసులు నమోదయ్యాయి. హెల్మెట్, సీటుబెల్ట్ లేని కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో తలకు దెబ్బలు తగిలి అనేక మంది మృతి చెందుతున్నారని ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. తప్పనిసరిగా సీటుబెల్ట్, హెల్మెట్ ధరించాలని కోరారు.